Estd 1938

ఆంధ్రప్రభ


www.prabhanews.com

Journalism first!



సంపుటి: 64 • సంచిక: 23 • బుధవారం 6 ఫిబ్రవరి 2019 • విజయవాడ • పేజీలు: 14 • వెల: 5.00

•Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad



ఓట్ ఆన్ బడ్జెట్

రూ.2.26 లక్షల కోట్లు

కొత్త పథకం అన్నదాత సుఖీభవకు

రూ.5,000 కోట్లు

రైతు ఖాతాల్లోకి నేరుగా నగదు బదిలీ

సంక్షేమానికి 65,486 కోట్లు

• పసుపు-కుంకుమకు మరో 4,000 కోట్లు • వృద్ధాప్య, వితంతు పింఛన్లకు 10,401 కోట్లు • బీసీ కార్పొరేషన్‌కు 3,000 కోట్లు • మహిళ, శిశు, దివ్యాంగ, వృద్ధులకు 3,408 కోట్లు • విభిన్న ప్రతిభావంతుల పింఛన్లకు 2,133 కోట్లు • డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణం 1,100 కోట్లు • నిరుద్యోగ భృతికి 1,200 కోట్లు • ఉపాధి హామీ పథకానికి 1,000 కోట్లు • మైనార్టీల సంక్షేమానికి 1,304 కోట్లు • కాపుల సంక్షేమానికి 1,000 కోట్లు • 308 కాపు భవనాలకు 123 కోట్లు • మైనార్టీల దుల్హన్‌కు 100 కోట్లు • వైశ్యుల సంక్షేమానికి 50 కోట్లు • బ్రాహ్మణ కార్పొరేషన్‌కు 100 కోట్లు • క్షత్రియుల సంక్షేమానికి 50 కోట్లు • ఎస్సీలకు చంద్రన్న పెళ్లికానుక 128 కోట్లు • చేనేతల సంక్షేమానికి 225 కోట్లు • అన్న క్యాంటీన్లకు 300 కోట్లు • చంద్రన్న బీమాకు 354 కోట్లు • ఎన్టీఆర్ విదేశీ విద్యకు 100 కోట్లు • చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహానికి 400 కోట్లు • డ్రయివర్ల సాధికార సంస్థకు 150 కోట్లు • పెరిగిన బడ్జెట్ అంచనా 18.38 శాతం • ఆర్థిక లోటు రూ.32,391 కోట్లు

3 లో

సార్వత్రిక ఎన్నికల శంఖారావం మోగనుండగా.. చంద్రబాబు ప్రభుత్వం శాసనసభలో మంగళవారం ప్రవేశ పెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ సంక్షేమ పథకాలకు కేటాయింపులతో మోతెక్కించింది. దీంతో అమరావతి రోడ్లపై సంక్షేమ రథం పరుగులు పెట్టినట్లుంది. అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం అంశాలలో సమతుల్యతను పాటిస్తూ ఆర్థిక మంత్రి తన అనుభవాన్ని రంగరించి బడ్జెట్‌ను రూపొందించారు. అన్నదాత సుఖీభవ పేరిట కొత్త పథకానికి శ్రీకారం చుట్టారు. విద్యా, వ్యవసాయానికి పెద్దపీట వేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సబ్ ప్లాన్‌లకు భారీగా కేటాయింపులు జరిపారు. బడుగు, బలహీన వర్గాల వారికి వెన్నుదన్నుగా సంక్షేమ పథకాలకు నిధులిచ్చారు. గత బడ్జెట్ కన్నా *18* శాతం పైగా బడ్జెట్ ప్రతిపాదనలు పెరిగాయి. రాష్ట్ర విభజనాంతరం ఏర్పడిన తొలి ప్రభుత్వంలో, చిట్టచివరిదైన ఈ బడ్జెట్‌లో అన్నివర్గాల వారిని సంతృప్తి పరిచేందుకు ప్రయత్నించారు.





పారిశ్రామిక, సామాజికవేత్త

కె.వి.విష్ణురాజు జన సేనలోకి

• సొంత విద్యా సంస్థల్లో నిరుపేదలకు ఉచిత బోధన • ఫౌండేషన్ ద్వారా పలు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన • పవన్ కల్యాణ్ ఆలోచనలతో భావ సారూప్యత • జనసేన సలహా మండలి ఛైర్మన్‌గా నియామకం

భీమవరం, ప్రభన్యూస్: విష్ణు విద్యాసంస్థల అధినేత, ప్రముఖ పారిశ్రామిక, సామాజికవేత్త కలిదిండి వెంకట విష్ణురాజు మంగళవారం హైదరాబాద్‌లోని జనసేన కార్యాలయంలో అధినేత పవన్‌కళ్యాణ్ సమక్షంలో పార్టీలో చేరారు. పశ్చిమగోదావరితో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ విష్ణురాజుకు మంచి పేరు ప్రఖ్యాతులున్నాయి. విద్యాసంస్థల ద్వారా పలువురు పేదలకు ఉచిత విద్యాబోధనతో పాటు ఉపకార వేతనాల ➪ 3వ పేజీలో...



నాది పోలీసు కుటుంబం

• ఏ కులానికి, మతానికి సంబంధం లేదు • ప్రజా రక్షణే నా ధ్యేయం • ఏపీ డీజీపీ ఆర్పీ ఠాకూర్ వెల్లడి

తిరుపతి, ప్రభన్యూస్ బ్యూరో : తాము ప్రజలకోసం పనిచేస్తామని, అనునిత్యం ప్రజారక్షణకోసం శ్రమిస్తామే తప్ప రాజకీయాలు తమకు అవసరం లేదని, వాటిపై తాను మాట్లాడటం కూడా సబబు కాదని రాష్ట్రడీజీపీ ఆర్పీ ఠాకూర్‌పేర్కొన్నారు. గత రెండు రోజుల క్రితం జగన్ చేసిన వ్యాఖ్యలపై మంగళవారం తిరుపతిలో జరిగిన మీడియా సమావేశంలో డీజీపీని జగన్ వ్యాఖ్యలపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు. ఈ సందర్భంగా డీజీపీ ఠాకూర్ మాట్లాడుతూ తనపై వచ్చిన విమర్శలపై పత్రికల ద్వారా ➪ 8వ పేజీలో...

నేడు సీఎంతో కేఈ బ్రదర్స్ భేటీ

• కోట్ల చేరికపై చర్చ 9





కేంద్ర పథకాల కింద రూ. 62 వేల కోట్లు ఏపీకిచ్చాం!

• రాజ్యసభలో ఆర్థికమంత్రి పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : కేంద్ర ప్రాయోజిత పథకాల కింద 2014-15 నుంచి 2019 ఫిబ్రవరి 2 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రూ. 62,168 కోట్లు విడుదల చేసినట్లు ఆర్థిక మంత్రి పియూష్ గోయల్ మంగళవారం రాజ్యసభకు తెలిపారు. సభ్యులు అడిగిన ఒక ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ప్రకటించిన ప్రత్యేక ఆర్థిక చర్యల్లో (ప్యాకేజీ) భాగంగా ఈ ప్రాయోజిత పథకాల అమలులో కేంద్రం వాటా 90 శాతం, రాష్ట్రం వాటా 10 శాతం ఉంటుందని అన్నారు. 2015-16 నుంచి 2019-20 మధ్య కాలంలో ➪ 8వ పేజీలో...

తలొగ్గండి!

వివాదాలు ఆపండి

• కోల్‌కతా సీపీ అరెస్ట్ వద్దు
• సీబీఐకి సుప్రీం ఆదేశం
• విచారణకు షిల్లాంగ్ వెళ్లండి
• సీపీ రాజీవ్‌కు ఉత్తర్వులు
• బెంగాల్ సీఎం మమత హర్షం
• రాజీవ్‌పై వేటుకు కేంద్రం సన్నాహం

న్యూఢిల్లీ : శారదా చిట్ ఫండ్ కుంభకోణం కేసు విచారణపై సీబీఐకి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలిచ్చింది. ఈ కేసులో కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్‌కుమార్ ప్రశ్నించవచ్చని స్పష్టం చేసింది. విచారణ పేరుతో అరెస్ట్ మాత్రం చేయవద్దని సూచించింది. కేసు విచారణకు రాజీవ్ కుమార్ కూడా సీబీఐకి సహకరించాలంటూ ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. అనవసర వివాదాలకు పోకుండా కేసు విచారణను పూర్తయ్యేలా చూడాలని స్పష్టం చేసిన కోర్టు.. విచారణకు మేఘాలయ రాజధాని షిల్లాంగ్ సీబీఐ కార్యాలయానికి హాజరుకావాలని కోల్‌కతా సీపీని ఆదేశించింది. సీబీఐ దర్యాప్తునకు హాజరుకాకుండా ఉండేందుకు ➪ 5వ పేజీలో...



వచ్చే ఎన్నికల్లో మమతే కీలకం!

• అందుకే రాజకీయ దాడులు • యావత్ దేశాన్నీ కదిలించిన దీదీ దీక్ష • మార్పువైపు... భారత్ చూపు • కోల్‌కతాలో ముఖ్యమంత్రి చంద్రబాబు 2 లో



ఆర్టీసీ చర్చలు సఫలం

• నేటి సమ్మె విరమణ
• 25 % ఫిట్‌మెంట్‌కు ఓకే

అమరావతి, ఆంధ్రప్రభ : చర్చలు సఫలం కావడంతో బుధవారం నుంచి ఏపీఎస్ఆర్టీసీలో తలపెట్టిన సమ్మెను ఐకాస విరమించింది. వేతన సవరణ, ఇతర 18 డిమాండ్ల సాధనకు ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ గతంలోనే యాజమాన్యానికి సమ్మె నోటీస్ ఇచ్చి, ఈనెల 6 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో యాజమాన్యంతో మంగళవారం జరిగిన చర్చల్లో పురోగతి కనిపించడంతో సమ్మెను విరమించుకున్నట్లు యూనియన్ నేతలు ప్రకటించారు. ఆర్టీసీ ఐకాస నేతలతో రాష్ట్ర రవాణా శాఖా మంత్రి ➪ 5వ పేజీలో...



ఆలి గోడు పట్టదు...
జాతిని ఉద్ధరిస్తారా!?

- పలాస పరాభవం చాలదా... ప్రేలాపనలెందుకు? • మోడీ, అమిత్ షా ద్వయం పతనం ప్రారంభం
- నా కుమారుడిని సీఎం చేస్తానని ఏనాడూ చెప్పలేదు • అమిత్ షా కొడుకు అక్రమాలు కనిపించవా?
- నిధులపై చర్చలకు సిద్ధం • అమిత్ షా వ్యాఖ్యలపై సభలో 'చంద్ర' నిప్పులు

అమరావతి, ఆంధ్రప్రభ: 'రాష్ట్రప్రజలకు మీరు ఏదైనా చేస్తే చెప్పుకోండి. అంతే తప్ప నమ్మక ద్రోహం చేసి నా పైనే అవినీతి విమర్శలు చేస్తే సహించేది లేదు. నన్ను విమర్శించే నైతికత ఎన్డీయే, బీజేపీ నేతలకు లేదు. మా అబ్బాయిని సీఎం చేస్తానని ఎప్పుడైనా అమిత్ షాకు చెప్పానా? నీ కొడుకు అక్రమ వ్యాపారాలు చేస్తుంటే విచారణ జరపరు కాని నన్ను విమర్శిస్తారా? ఇదే పరిస్థితి కొనసాగితే పలాస పరాభవమే అన్ని చోట్లా జరుగుతుంది' అంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బీజేపీ నేతలపై నిప్పులు చెరిగారు. భార్యనే చూడని వాడు దేశానికి ఏం చేస్తాడంటూ బీజేపీ అగ్రనేత, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వ్యాఖ్యలను ఈ సందర్భంగా సభలో ఉదహరించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మోడీ ఇక దేశానికి ఏం చేస్తాడు అంటూ ఎద్దేవా చేశారు. రైల్వేజోన్ ఇస్తామంటే విశాఖ ప్రజలు ఒక పార్లమెంటు, శాసనసభ్యుడిని కూడా గెలిపించారు. ఇచ్చిన హామీ నెరవేర్చనందుకు విష్ణుకుమార్ రాజు తదితరులు రాజీనామా చేస్తే తానే అభినందించేవాడినని చెబుతూ ప్రజల కోసం ఉండండి తప్ప పార్టీల కోసం కాదంటూ ముఖ్యమంత్రి హితవు పలికారు.



శాసనసభలో మంగళవారం వ్యవసాయం, అనుబంధ రంగాల అభివృద్ధిపై జరిగిన లఘు చర్చలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం పలాస సభలో చంద్రబాబును లక్ష్యంగా చేసుకొని బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. తెలుగుజాతి న్యాయం కోసం పోరాడుతున్నానే తప్ప యు టర్న్ తీసుకోలేదని, బీజేపీ పార్టీనే అనేక వంకర టర్న్‌లు తీసుకుందని ఆయన అన్నారు. మరోసారి నరేంద్ర మోడీ ప్రధాని కానున్నారంటూ అమిత్ షా చెపడంపై స్పందిస్తూ, ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. 2014లో స్వయంగా మోడీ హైదరాబాద్ వచ్చి ప్రత్యేక హోదా, విభజన హామీలపై నిర్దిష్టమైన హామీ ఇచ్చిన తర్వాతనే బీజేపీతో కలిశాను తప్ప తనంత తానుగా వెళ్లి కలవలేదన్నారు. నాలుగేళ్ల పాటు ఎదురుచూసినప్పటికీ నమ్మక ద్రోహం చేసిన మోడీ, అమిత్ షాలు తనపై ఎదురుదాడి చేస్తున్నారని, ఎంత ఒత్తిడి పెంచితే అంత పతనం తప్పదని ఆయన హెచ్చరించారు. తన పరిధిలో అగ్రిగోల్డ్ మోసంపై కేసులు పెట్టి నిందితులను జైలుకు పంపడంతో పాటు ఆస్తులను సీజ్ చేయడం ద్వారా బాధితులకు న్యాయం చేస్తున్నానన్నారు. మరి మోడీ రాఫెల్ స్కాంపై విచారణ ఎందుకు చేయడం లేదని, బ్యాంకుల సొమ్మును కొల్లగొట్టిన నిందితులు దేశం విడిచి ఎలా పరారయ్యారని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. అవినీతి వైఎస్సార్‌సీపీతో కలిసి తనపై నిందలు వేస్తున్నట్లు ఆరోపించారు. రాష్ట్రపతి విషయంలో అప్పటి ప్రధాని వాజ్‌పేయీ చూపిన రాజనీతిజ్ఞతను సీఎం చంద్రబాబు కొనియాడారు. రాష్ట్రానికి న్యాయం చేయమంటే తనపై ఎదురుదాడి చేయడంతో పాటు పార్లమెంటు సభ్యులపై ఈడీ, సీబీఐ దాడులు చేయిస్తున్నారంటూ విమర్శించారు. ఇప్పుడున్నది మోడీ, అమిత్ షా బీజేపీ తప్ప విలువలతో కూడిన పాత బీజేపీ కాదన్నారు. నాలుగేళ్లలో అమిత్ షా కొడుకు ఆస్తుల విలువ 16వేల రెట్లు పెరిగితే ఎందుకు విచారణ చేయరని ఆయన నిలదీశారు. మహిళలతో తనకు జన్మజన్మల సోదర బంధం ఉందని, వారి కోసం పసుపు-కుంకుమ ఇస్తే అసూయతో విమర్శలు చేస్తున్నారన్నారు.

ఎవరేమీ అనుకున్నా మహిళల సాధికారత కోసం మళ్లీ మళ్లీ ఇలాంటి కార్యక్రమాలు చేపడతానంటూ సభ్యుల హర్షధ్వానాల మధ్య చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్ర చరిత్రలో రాయలసీమ అభివృద్ధి తెదేపా హయాంలో తప్ప మరెప్పుడూ జరగలేదని సీఎం పేర్కొన్నారు.

ఆత్మగౌరవం కోసం పుట్టిన పార్టీ

తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం దివంగత ఎన్టీ రామారావు స్థాపించిన పార్టీ ఇదని చెపుతూ అవాకులు, చవాకులు పేలితే ప్రజలు సహించరన్నారు. అభివృద్ధి అంటే తెలియని అమిత్ షా 40ఏళ్ల తన నిబద్ధతను ప్రశ్నిస్తున్నారని చెపుతూ తాను తొలి నుంచి కూడా తెలుగు ప్రజల కోసమే పోరాటం చేస్తున్నానని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే భారత్‌ను అత్యున్నతంగా తీర్చిదిద్దడం తన ఆకాంక్ష అని చెపుతూ మోడీ ఉండగా ఇది సాధ్యపడదన్నారు. పుండుమీద కారం జల్లి ఆనంద పడతానంటే కుదరదని, బీజేపీ నేతల ఆటలు సాగనివ్వబోనని ఆయన పేర్కొన్నారు.

చర్చకు సిద్ధం

జాతీయ రహదార్లపై చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. గుజరాత్, మహారాష్ట్రకు ఎన్ని నిధులు ఇచ్చారు, ఆంధ్రప్రదేశ్ సహా బీజేపీయేతర రాష్ట్రాలకు ఎంతిచ్చారనేది చర్చించేందుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు.

కష్టాల్లోనూ వృద్ధిరేటు పెంపు!

- ఆర్థిక లోటు రూ.32,390.68 కోట్లు • రెవెన్యూ వ్యయం 20.03 శాతం పెరుగుదల
- మూలధన వ్యయం గత ఏడాది కంటే 20.03 శాతం ఎక్కువ
- రెవెన్యూ వ్యయం రూ.1,80,369.33 కోట్లు

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్ర ప్రభుత్వం విభజన కష్టాలను అధిగమిస్తూ, మరోవైపు ఆర్థిక వృద్ధిని నమోదు చేసుకుంటూ దేశీయ ఆర్థికఅభివృద్ధిరేటుతో మరింత పోటీని పెంచుకోవడానికి ప్రయత్నిస్తున్నది. ఇందుకుగాను ఖర్చులను తగ్గించుకుంటూ, అదే తరహాలో లోటును భర్తీ చేయడానికి కృషిచేస్తోంది. ఇందుకు నిదర్శనం 2018-19 వార్షిక బడ్జెట్‌లో రూ. 1,91,063.61 కోట్ల కేటాయింపులు చేయాలన్న ప్రతిపాదనలు ఉండగా, వాటిలో రూ.1,96,948.49 కోట్ల బడ్జెట్‌లో అదనపు కేటాయింపులు జరిగాయి. దీంతో 2019-20 ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను రూ. 2,26,177.53 కోట్ల అంచనాలతో ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టింది. దీంతో గత ఏడాది బడ్జెట్ కేటాయింపులతో పోలిస్తే.. 18.38శాతం అదనపు కేటాయింపులు ఉన్నట్లు రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి యనమల రామకృష్ణుడు శాసనసభలో పేర్కొన్నారు. కేవలం ఆరునెలల తాత్కాలిక బడ్జెట్‌ను రూపొందించిన రాష్ట్రప్రభుత్వం 2019 ఏప్రిల్-మే నెలల్లో జరిగే సార్వత్రిక ఎన్నికల అనంతరం ఏర్పడే కొత్త ప్రభుత్వం తిరిగి పూర్తిస్థాయి బడ్జెట్ ను తిరిగి ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. దీంతో ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా రైతులకు ఉపయోగపడే విధంగా కొత్త పథ కాన్ని, నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతితోపాటు పెన్షన్లన నూటికి నూరుశాతం పెంచడం గమనార్హం. ''మాప్రభుత్వం సరైన అభివృద్ధి వ్యూహాలతో భావిత రాలకు మార్గదర్శకం చేసే దిక్సూసి అని, కేవలం మాకు ఓటు వేసిన వారి కోసమే కాదు, మాకు ఓ ట ం



వేయని వారి కోసం కూడా పనిచేస్తామని, వారి బిడ్డలు, మన బిడ్డల కోసం పనిచేస్తున్న ప్రభుత్వమని'' మంత్రి యనమల శాసనసభలో ప్రకటించారు. అప్పుల నిర్వహణలో ఆంధ్రప్రదేశ్ 2014-15 నాటికి రూ.1,48,744 కోట్ల నుండి 2017-18 నాటికి రూ.2,23,706 కోట్ల రూపాయలకు పెరిగిందన్నారు. ఇది జీఎస్‌డీపీలో 2014-15లో 28.33 శాతానికి సమానమని, 2017-18 సంవత్సరానికి 27.83 శాతానికి సమానమని మంత్రి స్పష్టం చేశారు. నిర్మాణాత్మకమైన వసూళ్లు ఉన్నత.. ఆర్థిక వృద్ధిరేటు చూపడంలో ఏపీ ముందున్నదని, గడచిన నాలుగేళ్లలో జాతీయ వృద్ధిరేటు 7.3 శాతం ఉండగా, ఏపీ వృద్ధిరేటు 10.66 శాతం ఉందని, ఇది వ్యవసాయరంలో భారతదేశపు వృద్ధిరేటు 2.4 శాతం ఉండగా, ఏపీ 11 శాతం పారిశ్రామికరం గంలో దేశీయ వృద్ధిరేటు 7.1 శాతం కాగా, ఏపీ వృద్ధిరేటు 9.52గా నమోదు అయ్యిందని యనమల ప్రకటించారు.

సేవా రంగాల్లో జాతీయ వృద్ధి రేటు 8.8శాతం ఉంగా, ఏపీ వృద్ధి రేటు 9.57శాతంగా నమోదు అయ్యిందన్నారు. రాష్ట్ర విభజన కష్టనష్టాలు ఉన్నప్పటికీ అన్నిరంగా లలోనూ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు నూతన ఆర్థిక ప్రణాళికలను అమలు చేయడం ద్వారా సంపూర్ణమైన వృద్ధి రేటును సాధించడం జరిగిందన్నారు. 2018- 19లో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ 11.5 శాతం వృద్ధిచెందాలన్న లక్ష్యం కాగా, 7.2 శాతంగా నమోదు అయ్యిం దన్నారు. ఇది దేశీయ వృద్ధిరేటుకంటే అధికంగా ఉందని స్పష్టం చేశారు.

రాష్ట్ర రె వెన్యూలోటు తగ్గుముఖం పట్టాలన్న పట్టుదలతో పని చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశలకు అనుగుణంగానే దేశీయ వృద్ధి కంటే అదనపు వృద్ధిరేటును నమోదు చేస్తున్నామని ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు తెలిపారు. 2017-18లో ఏపీ అకౌంటెంట్ ఖాతాల ప్రకారంగా 2017 ఏప్రిల్ 1వ తేదీ నుండి 2018 మార్చి 31 వతేదీ మధ్య కాలానికి రూ.16,151.08 కోట్లు రెవెన్యూలోటు, నూ.32,372.57 కోట్ల ఆర్థిక లోటు నమోదు అయ్యింది. 2017 ఏప్రిల్ - 2018 మార్చి 31 మధ్య కాలానికి సంబంధించిన రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో వరుసగా 2.01 శాతం, 4.03 శాతం లోటు నమోదు అయ్యింది. సవరించిన అంచనాల ప్రకారం రెవెన్యూ వ్యయం రూ.1,50,858.53 కోట్లు, మూలధన వ్యయం రూ.25,021.34 కోట్లు, 2018-19 రెవెన్యూ లోటు దాదాపుగా రూ.2,494.12 కోట్లు కాగా, ఆర్థికలోటు రూ.29,141.72 కోట్లు, ఇది రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో వరుసగా 0.27, 3.14 శాతంగా నమోదు అయ్యింది.

వైఎస్ హయాం కన్నా తక్కువ అప్పులు

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో రూ.59 వేల కోట్లున్న రాష్ట్రం అప్పు 2009లో ఆయన మరణించేనాటికి రూ.1,09,000 కోట్లుకు చేరింది. ఉమ్మడి రాష్ట్రంలో మిగులు బడ్జెట్ ఉన్నప్పటికీ ఆయన హయాంలో అప్పటి వరకూ ఉన్న రుణభారంలో 86 శాతం అప్పులు చేయాల్సి వచ్చిం ది. అదే 2014లో చంద్రబాబు అధికారం చేపట్టిన నాటికి రూ.1,48,000 కోట్లు ఉన్న రాష్ట్రం అప్పు నేటికి రూ. 2,23,000 కోట్లకు చేరుకుంది. లోటు బడ్జెట్‌తో సతమతమవుతున్న ముఖ్యమంత్రి ఒకవైపు రాజధాని నిర్మాణం, మరోవైపు ప్రతిష్టాత్మక పోలవరం ప్రాజెక్టు నిర్మిస్తూ ఈ నాలుగున్నరేళ్లలో రూ.75000 కోట్లు మాత్రమే అప్పులు చేశారు. అంటే ఆయన అధికారం చేపట్టిన నాటికి ఉన్న రుణభారంపై 52 శాతం అప్పులు మాత్రమే చేయడం గమనార్హం.

2019-20 బడ్జెట్ అంచనాలు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ రూ.2,26,177.53 కోట్ల వ్యయాన్ని ప్రభుత్వం ప్రతిపాదించగా, దీనిలో రెవెన్యూ వ్యయం రూ. 1,80,369.33 కోట్ల మేర అంచనా వేశారు. మూల ధన వ్యయం రూ.29,596.33 కోట్ల అంచాలు కాగా, 2018-19 బడ్జెట్ అంచనాలతో పోలిస్తే 2019-20 బడ్జెట్ అంచనాలు మొత్తం మీద 18.33 శాతం పెరుగుదలను సూచిస్తున్నాయి. రెవెన్యూ వ్యయం సుమారు 20.03 శాతం పెరుగుతుండగా, మూల ధన వ్యయం కూడా 2018-19 కంటే 20.03శాతం పెరుగుదలను నమోదు చేసుకోగలదని ప్రభుత్వం అంచనా వేసింది. అలాగే రెవెన్యూ మిగులు రూ. 2,099.47 కోట్లు, ఆర్థికలోటు రూ.32,390.68 కోట్లు ఉండగలదని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 3.03శాతం ఉండగా, రెవెన్యూ మిగులు రాష్ట్రస్థూల ఉత్పత్తిలో 0.20 శాతం ఉండగలదని ఆర్థికశాఖ అధికారులు అంచనాలు వేశారు.

పర్యాటకానికి ప్రోత్సాహం

- 20శాతం మేర బడ్జెట్ పెంపు

అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం శాసనసభలో ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో పర్యాటక రంగానికి ప్రాధాన్యత ఇచ్చారు. గతేడాదితో పోల్చితే బడ్జెట్ కేటాయింపులు 20శాతం మేర పెంచారు. గత ఆర్థిక సంవత్సరంలో పర్యాటక రంగానికి రూ.385 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు. ఈ వార్షిక ఏడాదికి రూ.467 కోట్లు డిమాండ్ కాగా మొదటి నాలుగు నెలల కాలానికి రూ.155 కోట్లు కేటాయించారు. ప్రత్యేక టూరిజం పాలసీ కింద ప్రభుత్వం పర్యాటక రంగానికి పెద్దపీట వేస్తోంది. పర్యాటక రంగంలో చేపట్టిన పలు కార్యక్రమాల ద్వారా దేశ, విదేశీ పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగింది. దేశీయ పర్యాటకుల రాకలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మూడో స్థానంలో నిలిచింది. ఏటా సగటున 15శాతం వృద్ధిని పర్యాటక రంగం సాధిస్తోంది. రాష్ట్ర పర్యాటక రంగంలో రూ.5300 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు వివిధ సంస్థలు ముందుకు వచ్చాయి. తద్వారా రెండున్నర వేల మంది ఉద్యోగావకాశాలు పొందగా, పలువురికి ఉపాధి కలిపించారు. 2014 నాటికి రాష్ట్రంలో ఆరు వేల హోటల్ గదులు అందుబాటులో ఉండగా వీటి సంఖ్యను నాలుగేళ్లలో పది వేలకు పెంచారు. ఫైవ్ స్టార్ హోటల్స్‌ను ఆరు నుంచి పదికి పెంచారు. ఈ ఏడాది మే నాటికి మరో రెండున్న వేల గదులు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వపరంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. పర్యాటక రంగంలో ప్రభుత్వ కృషికి నిదర్శనంగా పలు అత్యుత్తమ అవార్డులను కేంద్ర ప్రభుత్వం నుంచి సాధించారు.

పరిశ్రమలకు రూ.4,114.02 కోట్లు

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో ఉపాధి కల్పనా భివృద్ధిలో పారిశ్రామిక, సేవా రంగాలకు ప్రభుత్వం అం త్యం ప్రాధాన్యమిచ్చింది. పరిశ్రమలు, వాణిజ్యానికి రూ. 4,114.02 కోట్లు కేటాయించింది. గత ఏడాది ఈ రంగా నికి ఈ. 3,074.87 కోట్లతో అంచనాలు రూపొందించిన ప్పటికీ రూ. 6,290.29 కోట్లు ఖర్చుచేశారు. ఈ ఏడాది కేటాయించిన మొత్తంతో కొత్త పరిశ్రమలకు ప్రోత్సహకా లు అందించడంతో పాటు, ఖాయిలా పడిన పరిశ్రమలకు చేయూతనివ్వడం వంటి కార్యక్రమాలను నిర్వహించేలా ప్రణాళిక తయారుచేస్తున్నారు. 2014 సంవత్సరం నుండి రూ. 14, 282 కోట్ల రూపాయాల పెట్టుబడితో 30, 349 ఎంఎస్‌ఎంఈ యూనిట్లు స్థాపించి 3.3 లక్షల మందికి ఉపాధి కల్పించారు. ఈ ఎంఎస్‌ఎంఈల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంది. 2019-20 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. వెయ్యి కోట్లతో ఎంఎస్‌ఎంఈ సెక్టార్ అభివృద్ధికి కేటాయించారు. ఇందులో రూ. 100 కోట్లు ఒత్తిడిలో ఉన్న ఎంఎస్ఎంఈల పునరుద్ధరణకు, రూ. 400 కోట్లు కొత్త సంస్థలకు ప్రోత్సహకాలు అందించేందుకు, మరో రూ. 500 కోట్లు ఈ ఎంఎస్‌ఎంఈ పార్కుల అభివృద్ధికి కేటాయించారు.

ఉద్యోగిత సాంద్రతకు అవకాశమున్న వస్త్ర పరిశ్రమ, ప్రాథమిక ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు మరియు పర్యాటక రంగంలో అభివృద్ధిపై ఈబడ్జెట్‌లో ప్రభుత్వం దృష్టిసారించింది. ఏకగవాక్ష విధానం ద్వారా ఉత్తమమైన సరళీకరణ విధా నం రూపొందించి ఏడు రోజుల్లో అన్ని అనుమ తులు మంజూరుచేయడం ద్వారా అనేక పరిశ్రమ లను ఇక్కడ పెట్టుబడి పెట్టించేవిధంగా చర్యలు తీసు కున్నారు. ప్రపంచ బ్యాంక్ మరియు లీకున్ యా పబ్లిక్ పాలసీ స్కూలు వంటి సంస్థలు ఉత్తమ వ్యాపా ర అనుగుణమైన రాష్ట్రంగా ఏపిని గుర్తించాయి. ఇప్పటికే 33.3 లక్షల మందికి ఉపాధి కల్ప నకు 18 శాఖల్లోని 2,633 ప్రాజెక్టులకు రూ. 15.77 లక్షల కోట్లు మేర ఎంఓయూ లు ఈ మధ్య కాలంలో చేసుకోవడం జరిగింది. ఈ ఎంవోయూలు పూర్తిస్థాయిలో అమలులో సుమారు 40 శాతం పెట్టుబడుల కార్యాచరణతో మన రాష్ట్రం దేశంలోనే ముందు వరుసలో నిలబడింది.

820పెద్ద మరియు మెగా ప్రాజెక్టులు 1.82 లక్షల కోట్లతో ఇప్పటికే ఉత్పత్తిని ప్రారంభించి 2.8 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. అలాగే 5.27 లక్షల కోట్లతో 7.66 లక్షల మందికి ఉపాధి కల్పించే 1,211 ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయి. ప్రభుత్వం చొరవతో ప్రతిష్టాత్మకమైన కియా మోటార్స్, హీ రో గ్రూపు, పెప్సీకో, మాండలీజ్ జైన్ ఇరిగేషన్, అదరవింద మిల్స్, షాహి ఎక్స్‌పో ర్స్, జాకీ మొదలైన సంస్థలు కార్యకలాపాలు నిర్వహించేందుకు ముందుకొచ్చాయి.

మండలిలో 6వసారి బడ్జెట్ ప్రవేశపెట్టిన నారాయణ



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రమున్సిపల్ శాఖ మంత్రి నారాయణ శాసనమండలిలో ఆరోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. మండలి ఇన్‌ఛార్జీ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన మంగళవారం జరిగిన కౌన్సిల్ సమావేశాల్లో 2019-20 సంవత్సర ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఉదయం 11.45 గంటలకు ప్రారంభమైన 30 పేజీలతో కూడిన నారాయణ బడ్జెట్ ప్రసంగం మధ్యాహ్నం 1.21 గంటలతో ముగిసింది. కొత్త రాష్ట్రంలోని సర్వజన సంక్షేమానికి పెద్దపీట వేయడంతోపాటు ఆరు నూతన పథకాలకు శ్రీకారం చుట్టామని, అన్నదాత సుఖీభవ పథకంతో రైతన్నలను ఆదుకుంటూ పసుపు-కుంకుమ పథకం ద్వారా మహిళలకు అండగా ఉంటామని నారాయణ వాఖ్యానించారు. రాష్ట్రాభివృద్ధితోపాటు ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు, తనతోపాటు సహచర మంత్రులు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నామని, విభజనతో వచ్చిన కష్టనష్టాలను అధిగమించడంతోపాటు భావితరాల భవిష్యత్తు కోసం కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నవ్యాంధ్ర పునర్‌నిర్మాణంలో యావత్ ప్రజానీకం వెన్నుదన్నుగా నిలిచిందని, పాలకుల కఠోర శ్రమ, ఉద్యోగుల చిత్తశుద్ధి, అంకితభావం వలన అభివృద్ధి సాధ్యమవుతోందంటూ ప్రభుత్వం సాధించిన ప్రతి విజయాన్ని ప్రజలకు అంకితం చేస్తున్నామని ప్రసంగం ముగించారు.

రోడ్ల అభివృద్ధికి రూ. 5,382.83 కోట్లు



అమరావతి, ఆంధ్రప్రభ: రహదారుల అభివృద్ధి మరియు మౌలిక వసతుల కల్పనకు ఈ బడ్జెట్‌లో రూ. 5,382.83 కోట్లు కేటాయించారు. గత ఏడాది బడ్జెట్‌లో రూ. 4,703.45 కోట్లు కేటాయించగా, సవరించిన అంచనాలతో రూ. 4,599.31 కోట్లు ఖర్చుచేశారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది కేటాయింపులు 14.44 శాతం అధికంగా ఉన్నాయి. అమరావతి నుండి అనంతపురం వరకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే కింద 384 కిలోమీటర్ల రోడ్డును సుమారు రూ. 20 వేల కోట్లతో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా నిర్మించేందుకు అనుమతి లభించింది. ఈ జాతీయ రహదారి పొడవు 2014 జూన్ నుండి 2,164 కిలోమీటర్లకు పెరిగింది. ఇది ప్రస్తుత పొడవు కంటే 50 శాతం ఎక్కువ. రాష్ట్రంలోని నేషనల్ హైవే వింగ్, రహదారులు, భవనాల శాఖ మరియు నేషనల్ హైవే అథారిటీ వారిచే నిర్మించే రహదారులను చదునుచేసి రెండు లైన్లుగా 2020 నాటికి ఆధునీకరించేందుకు నిర్ణయించారు. జూన్ 2014 తరువాత 2,400 కిలోమీటర్ల రెండు వైపుల చదును చేసిన రహదారులను రూ. 12,729 కోట్లతో నాలుగు లేన్ల రహదారిగా విస్తరించడం జరిగింది. 2014 తరువాత రాష్ట్ర రహదారుల వ్యవస్థ 41,856 కి.మీ.నుండి 46,342 కి.మీకు పెరిగింది. 1800 కి.మీ. పొడవైన నాన్ బీటీ రోడ్లను రూ. 1,580 కోట్ల అంచనా వ్యయంతో 2020 నాటికి బీటీ రహదారిగా మార్చేందుకు కృషిచేస్తున్నారు. 2 వేల పీసీయలకు పైగా ట్రాఫిక్ ఉండే అన్ని సింగిల్ రహదారులను రెండు లైన్లుగా విస్తరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ముహూర్తం

శ్రీ విళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం;
తిథి: శుద్ధ విదియ రా.తె.5.29 వరకు, అనంతరం తదియ;
నక్షత్రం: ధనిష్ఠ ఉ 7.38 వరకు అనంతరం శతభిషం;
అమృతకాలం: రా.2.25 నుండి 4.15 వరకు;
వర్జ్యం: మ.3.35 నుండి 5.21 వరకు;
దుర్ముహూర్తం: ఉ.11.36 నుండి 12.24 వరకు,
రాహుకాలం: మ.12.00 నుండి 1.30 వరకు;
యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు

వచ్చే ఎన్నికల్లో మమతే కీలకం!

- అందుకే రాజకీయ దాడులు • యావత్ దేశాన్నీ కదిలించిన దీదీ దీక్ష
- మార్పువైపు... భారత్ చూపు • కోల్‌కతాలో సీఎం చంద్రబాబు

అమరావతి, ఆంధ్రప్రభ: మార్పుకోసం యావత్ భారతదేశం ఎదురుచూస్తోందని, ఎన్‌డిఏ విధానాలతో దేశ భద్రతకే ముప్పు వాటిల్లే పరిస్థితి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. అందరూ సంఘటితంగా పోరాటాన్ని చేయకపోతే దేశం నష్టపోతుందన్న ఆందోళన ఆయన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కలకత్తాలో చేపట్టిన నిరసన దీక్షకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం స్వయంగా హాజరై తన సంఘీభావాన్ని ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దేశ చరిత్రలో మోడీ వంటి ప్రధానిని ఇంత వరకూ చూడలేదని, ఇక ముందు కూడా చూసే అవకాశమే లేదని తెల్చి చెప్పారు. వ్యవస్థలను అడ్డం పెట్టుకుని ప్రతిపక్షాలను వేధించడం దారుణమైన విషయమన్నారు. రాష్ట్రప్రభుత్వాలపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగా సివిల్ సర్వీసెస్‌తోపాటు ఇతర శాఖల ఉన్నతాధికారులను కేంద్రం టార్గెట్ చేస్తున్నదని దుయ్యబట్టారు. ఆంధ్రప్రదేశ్‌తోపాటు పశ్చిమ బంగాలోని అధికారులందరూ ఎంతో సంతోషంగా ఉన్నారని తెలిపారు. దేశ వ్యాప్తంగా బీజేపీయేతర ప్రధాన పార్టీలన్నీ మమతకు మద్దతుగా ఉన్నాయని తెలిపారు. దేశం మొత్తం బెంగాల్‌వైపు చూస్తోందన్నారు. సాంకేతిక పెరిగిన ప్రస్తుత తరుణంలో దేశంలో జరుగుతున్న పరిణామాలను అదరూ గమనించాలని కోరారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో పశ్చి బెంగాల్‌లో 40 ఎంపీ సీట్లు తృణమూల్ కాంగ్రెస్ గెలుచుకుంటుందని చెప్పిన చంద్రబాబు, ఆసమయంలో మమతా బెనర్జీ కేంద్రంలో కీలకంగా మారతారనే ఇప్పుడు కేంద్రం దాడులు చేస్తూ దీదీని దెబ్బ తీస్తు న్నారని విమర్శించారు. స్వతంత్రంగా వ్యవహరించే ఐఏఎస్, ఐపీఎస్‌లను



కేంద్రం ఏ విధంగా కం ట్రోల్ చేయాలని చూస్తుందని ప్రశ్నించారు. ఇది ఫెడరల్ స్ఫూర్తికే విరుద్ధమని తేల్చి చెప్పారు. దేశంలో నరేంద్రమోడీ, అమిత్‌షాలు తామే నిజాయితీ పరులు అనుకుంటున్నారని చంద్ర బాబు చెప్పారు. రాఫెల్ కుంభకోణంతో పాటు ఆర్థిక నేరగాళ్లను దేశం దాటించడం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సాధించిన అతి పెద్ద ఘనతని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలతో బ్యాంకులు తీవ్రంగా నష్టపోయాయన్నారు. ఇది సామాన్యులపై ప్రభావం చూపుతుందని తెలిపారు. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. ఇటువంటి కష్ట సమయంలో అందరూ మమతా బెనర్జీకి అండగా ఉందామని పిలుపునిచ్చారు. అదే విధంగా సోమవారం ఢిల్లీలో సమావేశమైన 23పార్టీల నేతలంతా సంయుక్తం గా కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిశామని, ఈవిఎంల వినియోగం, ట్యాంపరింగ్‌పై ఉన్న అనుమానాలను వారి దృష్టికి తీసుకువచ్చామని చెప్పారు. వివిప్యాట్‌లకు సంబంధించి కనీసం 50శాతం రసీదులన్న ఇవ్వాలని డిమాండ్ చేశామని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల అభివృద్ధిని అడ్డుకోవాలని ప్రయత్నిస్తుందని, అందుకేతామంతా ఏకతాటిపైకి వచ్చి పోరాటానికి సిద్ధమయ్యామని చెప్పారు. ఢిల్లీ, పశ్చిమ బెంగాల్, ఏపీ లాంటి రాష్ట్రాల అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతీకారచర్యలకు పాల్పడుతుందని మండిపడ్డారు. త్వరలో బీజేపి, ఎన్‌డీఏ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. అనంతరం సీఎం చంద్రబాబు భవిష్యత్తు కార్యచరణ, ఎన్‌డీఏపై పోరు చేయాల్సిన అంశాలపై మమతా బెనర్జీతో ఏకాంతంగా సమావేశమయ్యారు.



బడ్జెట్ 2019-20

ఓట్ ఆన్ బడ్జెట్


రూ.2.26 లక్షల కోట్లు

● కొత్త పథకం అన్నదాత సుఖీభవకు రూ. 5,000 కోట్లు ● రైతు ఖాతాల్లోకి నేరుగా నగదు బదిలీ ● సంక్షేమానికి 65, 486 కోట్లు

అమరావతి, ఆంధ్రప్రభ : ఎన్నికల నామ సంవత్సరంలో అన్నివర్గాల సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ అధికారపార్టీకి ఓట్లు కురిపించే విధంగా రాష్ట్ర ఆర్థిక శాఖామంత్రి యనమల రామకృష్ణుడు బడ్జెట్‌లో వరాల జల్లులు కురిపిస్తూ శాసనసభలో మంగళవారం 2019-20 ఓట్-ఆన్-అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. యనమల 11వ సారి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో 6 కొత్త పథకాలకు శ్రీకారం చుట్టారు. రాష్ట్రవిభజన అనంతరం తొలిసారిగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో 1.13 లక్షల కోట్లు వివిధ పద్దులకు కేటాయించగా సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గత నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం సాధించిన ప్రగతికి సూచనగా ఈ బడ్జెట్‌లో 2.26 లక్షల కోట్ల వ్యయ అంచనాలను మంత్రి ప్రకటించడం విశేషం. ఈ బడ్జెట్‌లో సంక్షేమ పథకాలకు మొత్తం రూ. 65,486 కోట్ల రూపాయిలను కేటాయించడం విశేషం. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి రూ. 35,182 కోట్లు, జలవనరుల శాఖకు రూ. 16,852 కోట్లు, వ్యవసాయానికి రూ. 12,732 కోట్లు, వైద్య-ఆరోగ్యానికి రూ. 14, 132 కోట్లు కేటాయించారు. సెకండరీ ఎడ్యుకేషన్‌కు రూ. 22, 782 కోట్లు కేటాయించారు. అలాగే రాష్ట్రంలో వచ్చే ఏడాదిలో విద్యుత్ బిల్లులను పెంచబోమని, తద్వారా రైతులకు మరింత ప్రోత్సాహం లభించినట్లు అవుతుందన్నారు. ఈ బడ్జెట్‌లో ప్రధానంగా రైతులు, నిరుపేదలను, అట్టడుగు, బడుగు, బలహీనవర్గాల వారి ప్రయోజనాల కోసం పెద్దపీట వేస్తూ కేటాయింపులు చేయడం విశేషం. ముఖ్యంగా రాష్ట్ర రైతాంగాన్ని ఆదుకోవడానికి వీలుగా రూ. 5 వేల కోట్ల నిధులతో 'అన్నదాత సుఖీభవ' కొత్త పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి యనమల రామకృష్ణుడు శాసనసభలో ప్రకటించారు. అలాగే ముఖ్యమంత్రి - యువనేస్తం పథకం క్రింద ఇస్తున్న నిరుద్యోగ భృతిని ఇకపై రెట్టింపు (నెలకు రూ.2000) చేస్తూ తీసుకున్న నిర్ణయం లక్షలాది నిరుద్యోగుల పాలిట వరంగా మారింది. ఈ పథకం క్రింద ఇప్పటికే 4.39 లక్షల మంది నిరుద్యోగులు లబ్ధి పొందుతున్నట్టు మంత్రి యనమల వెల్లడించారు. రాష్ట్రంలో నిరుపేదలకు నివాస ప్రాంతాలను ఏర్పాటు చేయడానికి వీలుగా రూ.500 కోట్ల ఖర్చుతో భూములను కొనుగోలు చేసి అందించాలని నిర్ణయించిందని మంత్రి యనమల తెలిపారు. రూ. 150 కోట్లతో డ్రైవర్లకు ప్రత్యేక సాధికార సంస్థ ఏర్పాటు, ఎమ్ఎస్ఎమ్ఈ ప్రోత్సాహకాలకు రూ.400 కోట్లు, మున్సిపాల్టీలలో మౌలికసదుపాయాల కల్పనకు రూ.100 కోట్లు, క్షత్రియుల సంక్షేమానికి రూ. 50 కోట్ల నిధులతో కొత్త పథకాలను ప్రభుత్వం ప్రతిపాదిస్తోందని తెలిపారు. బడ్జెట్ ప్రసంగంలో గత నాలుగున్నర ఏళ్లలో తెలుగుదేశంపార్టీ పాలనలో సాధించిన విజయాలను సభ్యులకు వెల్లడించారు. శాసనసభలో ఏకపక్షంగా సాగిన బడ్జెట్ ప్రసంగంలో పూర్తిగా ప్రభుత్వం తన భవిష్యత్ పథకాలు, ఇప్పటి వరకూ వున్న పథకాలను లబ్ధిదారులకు భవిష్యత్‌లో కొనసాగింపుతో పాటు రైతులను ఆదుకోవడానికి పెద్దపీట వేయాలని నిర్ణయించిందని వెల్లడించారు. కొత్త రాష్ట్రం ఏర్పడిన అనంతరం నేటి వరకూ ప్రభుత్వం ఎదుర్కొన్న సమస్యలను సభ ముందు ఉంచడంతోపాటు రాష్ట్ర ఆర్థిక పురోగాభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం ఎప్పుడూ ముందంజలోనే ఉందని యనమల స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు ప్రణాళికలతో పాటు, ఆర్థికాభివృద్ధికి తీసుకోవాల్సిన కఠినమైన చర్యలను ఆచరించడం, ఆర్థికశాఖలో కీలక అంశాలల్లో అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించుకోవడంతోనే ఆర్థిక వృద్ధిరేటును సాధించడం సాధ్యమైందని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ లక్ష్యాలను పూర్తిగా సాధించే క్రమంలో హేతుబద్ధమైన క్రమబద్ధీకరణ, సరళీకరణ కావించుకొని ఐ.ఆర్.పి అప్లికేషన్‌ను ప్రవేశపెట్టిన మొట్టమెదటి రాష్ట్రంగా ఏపీ దేశచరిత్రను సృష్టించిందని ఆర్థికమంత్రి ప్రకటించారు. రిజర్వుబ్యాంక్ వారి 'ఈ-కుబేర్ 2.0' సాఫ్ట్‌వేర్ విధానాన్ని వినియోగించుకుంటూ బిల్లుల సమర్పణ, పరిశీలన, చెల్లింపులు క్రియలను కాగిత రహితంగా పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా నిర్వహించే విధానాన్ని ప్రవేశపెట్టిన ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అని ఆయన చెప్పారు. ఆర్థికశాఖ నియంత్రణలో పనిచేస్తున్న స్పెషల్ పర్పస్ వెహికల్ ఆంధ్రప్రదేశ్ సెంటర్ ఫర్ ఫైనాన్సియల్ సిస్టమ్స్ ఎండ్ సర్వీసుస్‌చే ప్రవేశపెట్టిన ఈ వ్యవస్థ స్థిరీకరణ దిశగా సాగుతోందని చెప్పారు. సీఎంఎఫ్ఎస్ ద్వారా పౌరుడు, వ్యాపారి లేదా ఉద్యోగి ప్రభుత్వంతో ఆన్‌లైన్‌లో ఎండ్ టు ఎండ్ వ్యవహారాలు జరిపే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలోని డ్వాక్రా మహిళలకు పసుపు-కుంకుమ పథకానికి రూ. 4000 కోట్లు, బీసీ సంక్షేమానికి రూ.8242 కోట్లు, గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.35,182 కోట్లు, చంద్రన్న బీమా పథకానికి రూ.354 కోట్లు, పశువుల ఇన్సూరెన్స్ పథకానికి రూ. 200 కోట్లు వృద్ధాప్య, వితంతు 'ఎన్టీఆర్ భరోసా' పెన్షన్లు రూ. 10, 401కోట్లు, డప్పు కళాకారుల పెన్షన్ 800 శాతం పెంపు రూ.108 కోట్లు, ఏపీ మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్ రూ. 500 కోట్ల నుండి రూ. వెయ్యి కోట్లకు పెంచుతూ బడ్జెట్ ప్రతిపాదనలను ఆర్థికమంత్రి యనమల సభ ముందుంచారు. ఏపీ ఆర్థికవృద్ధి వ్యవసాయ మరియు అనుబంధ రంగాల్లో ఎక్కువగా ఉంటుందని, కానీ పరిశ్రమలు, సేవా రంగాలకన్నా తక్కువ పన్నులు అందిస్తాయన్నారు. దీంతో రాష్ట్ర ఆర్థిక వృద్ధిరేటుతో సమానంగా పన్నుల ఆదాయం పెరగడం లేదు. ఆర్బీఐ అంచనాల ప్రకారం ఏపీ ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలపై వెచ్చించే వ్యయంలో 2018-19 మొదటి మూడు స్థానాలలో చోటు సంపాధించిందన్నారు. ప్రత్యేక హోదా లేని రాష్ట్రాల బడ్జెట్ 61.5 శాతం అభివృద్ధి కార్యక్రపమాలపై ఖర్చు చేస్తుండగా మన రాష్ట్రం బడ్జెట్‌లో 72.4 శాతం ఖర్చు చేస్తోందని ఆర్థికమంత్రి వెల్లడించారు. సంక్షేమ వ్యయంలో 51.1 శాతంతో అత్యుత్తమ స్థానంలో నిలిచామని ఇది తమ ప్రభుత్వ ఖర్చుత నాణ్యతను స్పష్టం చేస్తోందని ప్రకటించారు.



సమర్థంగా అప్పుల నిర్వహణ



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొ త్తం అప్పులు 2014-15 సంవ త్సరానికి గల రూ.1,48,744 కోట్ల రూపాయల నుండి 2017-18 నాటికి రూ. 2,23,706 కోట్లకు పెరిగాయని యనమల తెలిపారు. ఇది జీఎస్‌డీపీ 2014-15లో 28.33 శాతానికి సమా నం కాగా 2017-18లో 27.83 శాతానికి ఇది సమాన మని ఆర్థికమంత్రి స్పష్టం చేశారు. 2018-19లో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ 11.5 శాతం వృద్ధి చెందాలనే లక్ష్యం కాగా, 7.2 శాతాన్ని సాధించామని, ఇది దేశీయ రేటుకన్నా అధికంగా నమోదు అయ్యిం దన్నారు. వ్యవస్థాగత లోపాలను సరిదిద్దుకునే సామర్థ్యం తమ ప్రభుత్వానికి ఉందని రాబోయే సంవత్సరాల్లో సానుకూల ప్రభావం చూపిస్తూ మరింత వృద్ధిని సాధించగలమన్న ధీమాను ఆర్థికశాఖామంత్రి యనమల రామకృష్ణుడు వ్యక్తం చేశారు.

ఆరు కొత్త పథకాలు

1. రూ. 5000 కోట్లతో 'అన్నదాత సుఖీభవ'
2. రూ. 150 కోట్లతో డ్రైవర్లకు ప్రత్యేక సాధికార సంస్థ ఏర్పాటు
3. నిరుపేదల గృహావసరాలకు భూమి కొనుగోళ్లకు రూ.500 కోట్లు
4. ఎమ్ఎస్ఎమ్ఈ ప్రోత్సాహకాలకు రూ.400 కోట్లు
5. మున్సిపాల్టీలలో మౌలికసదుపాయాల కల్పనకు రూ.100 కోట్లు
6. క్షత్రియుల సంక్షేమానికి రూ. 50 కోట్లు

కె.వి.విష్ణురాజు జనసేనలోకి



సలహా మండలి చైర్మన్‌గా విష్ణురాజు

జనసేన సలహా మండలి చైర్మన్‌గా విష్ణురాజును పవన్‌కళ్యాణ్ నియమించారు. ఇందులో ఏడుగురు సభ్యులుంటారని పవన్ చెప్పారు. విద్యావేత్తలు, మేధావులు, సామాజికవేత్తల్తో ఈ కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ బృందానికి విష్ణురాజు నాయకత్వం వహిస్తారని ప్రకటించారు.

(మొదటిపేజీ తరువాయి)

పంపిణీ, ఆరోగ్య శిబిరాల ఏర్పాటు, గ్రామాల దత్తత, మంచినీటి ఉచిత సరఫరా వంటి పథకాల్తో ఆయన సేవా తత్పరత కొనసాగుతోంది. నాలుగుమాసాల క్రితం పశ్చిమలో పర్యటించిన పవన్‌కళ్యాణ్ భీమవరంలోని విష్ణు విద్యాసంస్థల్లో విద్యార్థుల్తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అదే సందర్భంలో ఆయన కొద్దిసేపు విష్ణురాజుతో మాట్లాడారు. ఇరువురి ఆలోచనాధోరణుల మధ్య భావసారూప్యత పవన్‌కు స్పష్టమైంది. సమాజ అభివృద్ధి కోసం విష్ణురాజు పడుతున్న తపనను పవన్ గుర్తించారు. అటువంటి విద్యాధికులు, మేధావులు రాజకీయాలకు దూరంగా ఉండిపోవడం సరికాదంటూ ఆనాడే పవన్ విష్ణురాజుతో పేర్కొన్నారు. జనసేనలోకి రావాల్సిందిగా ఆహ్వానించారు. పవన్ ఆహ్వానానికి సానుకూలంగా స్పందించిన విష్ణురాజు ఆ పార్టీలో చేరారు. పార్టీ అవసరాలకను గుణంగా ఏ బాధ్యత నిర్వర్తించేందుకైనా తన సంసిద్ధత వ్యక్తం చేశారు. పవన్ ఆలోచనా విధానాలు తనను ఆకర్షించా యని ఈ సందర్భంగా విష్ణురాజు స్పష్టం చేశారు. పవన్ వంటి నాయకుడి వల్లే రాజకీయాల్లో మార్పులు సాధ్యమన్నారు. పారదర్శక పాలన పవన్ వల్లే సాధ్యపడుతుందన్నారు. ఆలోచనాపరు లంతా జనసేనకు మద్దతియాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. విష్ణురాజు జనసేనలో చేరడం పశ్చిమ రాజకీయాల్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. ఆయన నేరుగా ఓ పార్టీలో చేరతారని ఇంతవరకు ఎవరూ ఊహిం చలేదు. రాజకీయాలకు ఆయన దూరంగా ఉండేవారు. తన విద్య, వ్యాపార విషయాలు మినహా మిగిలిన అంశాల్లో తలదూర్చేవారుకాదు. భీమవరం పరిసర ప్రాంతాల్లోని పలు గ్రామాల్లో ఆయన తరచూ పర్యటనలు చేసేవారు. అక్కడ మౌలిక సదుపాయాల మెరుగుకు తన ఫౌండేషన్ ద్వారా సహాయాలందించేవారు. విష్ణురాజు చేరికతో ప్రధాన పార్టీలు తెలుగుదేశం, వైకాపాలు రెండూ ఉలిక్కిపడ్డాయి. జిల్లాలోని దాదాపు 15నియోజకవర్గాల్లోనూ విష్ణురాజు ప్రభావముంటుందని అంచనాలేస్తున్నారు. జిల్లాలో జనసేన మరింత పుంజుకోవాడనికి విష్ణురాజు చేరిక ఉపకరిస్తుందని పరిశీలకులు భావిస్తున్నారు. విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ, అంజనీ ఫోర్ట్‌ల్యాండ్ వంటి 17సంస్థలకు ఆయన చైర్మన్‌గా ఉన్నారు. అమెరికాలోని మిచిగాన్ యూనివర్శిటీలో కెమికల్ ఇంజనీరింగ్ ఎమ్ఎస్ పూర్తి చేసిన ఆయన సిమెంట్, పాలిమర్స్, సిరామిక్ పరిశ్రమలకు సంబంధించి పలు పరిశోధనలు చేశారు. సొంతంగా అంజనీ ఫోర్ట్‌ల్యాండ్ సిమెంట్స్ సంస్థను నెలకొల్పారు. తాత పద్మభూషణ్ బివి రాజు వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్నారు.

బడ్జెట్ హైలైట్స్



అన్నదాత సుఖీభవ పథకానికి రూ.5వేల కోట్లు
ఆహార శుద్ధి పరిశ్రమలకు రూ.300 కోట్లు
మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్ రూ.1000 కోట్లు
వ్యవసాయ యాంత్రీకరణకు రూ.300 కోట్లు
పశుగ్రాసం అభివృద్ధికి రూ.200 కోట్లు
పశువుల బీమాకు రూ. 200 కోట్లు
చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహనికి రూ.400 కోట్లు
డ్రైవర్ల సాధికార సంస్థకు రూ.150 కోట్లు




పేదలకు ఇళ్ల స్థలాల సేకరణ నిమిత్తం రూ.500 కోట్లు
క్షత్రియుల సంక్షేమానికి రూ.50కోట్లు
వెనుకబడిన వర్గాల కార్పొరేషన్లకు రూ.3 వేల కోట్లు
బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ.100 కోట్లు
వ్యవసాయమార్కెటింగ్, కో-ఆపరేటీవ్‌కు రూ.12,732.97 కోట్లు
పాడి పశు సంవర్థక, మత్స్య శాఖకు రూ.2,030.87 కోట్లు
అటవీ పర్యావరణ, శాస్త్ర సాంకేతిక రంగాలకు రూ.491.64 కోట్లు
వెనుకబడిన తరగతుల సంక్షేమానికి రూ.8.,242.64 కోట్లు



నిరుద్యోగ భృతికి రూ. 1200 కోట్లు
ఉన్నత విద్యాశాఖకు రూ.3,171. 63 కోట్లు
సెకండరీ విద్యాశాఖకు రూ. 22, 783.37 కోట్లు
విద్యుత్, మౌలిక వనరులకు రూ.5,473.83కోట్లు




పౌరసరఫరాల శాఖకు రూ.3,763.42 కోట్లు
ఆర్థిక శాఖకు రూ.51,841.69 కోట్లు
సాధారణ పరిపాలన రూ.1,177.56 కోట్లు
వైద్యం, ఆరోగ్య, కుటుంబ సంక్షేమానికి రూ.10,032.15 కోట్లు
హోం శాఖకు రూ.6,397.94 కోట్లు



గృహ నిర్మాణానికి రూ.4,079.10 కోట్లు
జలవనరుల శాఖకు రూ.16,852.27కోట్లు
పరిశ్రమలు, వాణిజ్యానికి రూ.4,114.92 కోట్లు



ఐటీ కమ్యూనికేషన్‌కు రూ.1006.81 కోట్లు
కార్మిక ఉపాధి కల్పనకు రూ.1,225.75 కోట్లు
న్యాయశాఖకు రూ.918 కోట్లు
శాసనసభ వ్యవహారాల శాఖకు రూ.149.90 కోట్లు
పురపాలక పట్టణాభివృద్ధి శాఖకు రూ.7,979.34 కోట్లు



మైనార్టీ సంక్షేమానికి రూ.1,308.73 కోట్లు
ప్రభుత్వ రంగ సంస్థలకు రూ.2.56 కోట్లు
ప్రణాళిక విభాగానికి రూ.1,403.17కోట్లు
పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధికి రూ.35,182.61 కోట్లు
రెవెన్యూ శాఖకు రూ.5,546.94 కోట్లు



ఆర్టీజీఎస్‌కు రూ.172.12 కోట్లు
దివ్యాంగుల సంక్షేమానికి రూ.70 కోట్లు
కాపుల సంక్షేమానికి రూ.1000 కోట్లు
సౌకర్యాలకు ఎస్సీ కాంపోనెంట్ నుంచి రూ.600.56 కోట్లు
308 కాపు భవనాల నిర్మాణానికి రూ.123 కోట్లు



వైశ్యుల సంక్షేమానికి రూ.50 కోట్లు
రోడ్లు, భవనాలు, రవాణాశాఖకు రూ.5,382.83కోట్లు
క్రీడలు, సర్వీసులకు రూ.1,982.74కోట్లు
మైనార్టీలకు దుల్హన్ పథకానికి రూ.100 కోట్లు



చంద్రన్న పెళ్లి కానుక కింద ఎస్సీలకు రూ.128కోట్లు
చేనేతలకు రూ.225 కోట్లు
అన్న క్యాంటీన్ల నిర్వహణకు రూ.300 కోట్లు
డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాల పంపిణీకి రూ.1,100 కోట్లు
వృద్ధాప్య, వితంతు పింఛన్లకు రూ.10,401 కోట్లు




ఎన్టీఆర్ విదేశీ విద్య పథకానికి రూ.100 కోట్లు
విభిన్న ప్రతిభావంతుల పింఛన్లకు రూ.2,133 కోట్లు
ఉపాధి హామీ పథకానికి రూ.1000 కోట్లు

రైతుకు చేసిన మేలే చెప్పుకుంటా!

ఎన్డీయేలా మోసం చేయం

● అన్నదాతలను అన్ని విధాలుగా ఆదుకుంటాం ● వ్యవసాయంలో రెండంకెల వృద్ధి ● శాసనసభలో సీఎం చంద్రబాబునాయుడు స్పష్టీకరణ




అమరావతి, ఆంధ్రప్రభ : కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం మాదిరి మోసం చేయకుండా అన్నదాతను అన్ని రకాలుగా ఆదుకుంటామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడమే కాక రైతులకు భరోసా ఇస్తున్నామని చెప్పారు. ఐటీ నిపుణులు వ్యవసాయం చేసేందుకు ముందుకు రావడమే తమ పనితీరుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. రానున్న రోజుల్లో రైతులకు చేసిన మేలును చెప్పుకొని ఎన్నికలకు వెళతామని చంద్రబాబునాయుడు సభ్యుల హర్షధ్వానాల మధ్య స్పష్టం చేశారు. వ్యవసాయం, అనుబంధ రంగాల అభివృద్ధిపై శాసనసభలో జరిగిన లఘు చర్చలో ముఖ్యమంత్రి పాల్గొంటూ వ్యవసాయానికి సంబంధించి గత చరిత్రను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 2004 నుంచి 2014 మధ్య కాలంలో రైతులు అనేక ఒడిదుడుకులు ఎదుర్కొన్నారని, వ్యవసాయ రంగంపై ఆధారపడిన 62శాతం ప్రజల జీవనోపాధి వట్టిపోయిందన్నారు. విత్తనాలు, ఎరువులు లభ్యం కాక, పంట దిగుబడి లేక అనేక మంది ఆత్మహత్యలకు పాల్పడితే విద్యుత్ షాక్, పాము కాటు వంటి మరణాలు అనేకం సంభవించాయన్నారు. చివరకు కోనసీమ వంటి ప్రాంతంలో పంట విరామం ప్రకటించారంటే పరిస్థితి ఏ విధంగా ఉండేదో అర్థం చేసుకోవచ్చన్నారు. పాదయాత్రలో రైతుల కష్టాలు చూసి అధికారంలోకి వచ్చిన వెంటనే వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టానని, దేశంలోనే ఇది ప్ర ప్రథమమని చెప్పారు. వ్యవసాయ రంగంలో వృద్ధి రేటు దేశంలో 3.5శాతం ఉంటే రాష్ట్రంలో 11శాతం వృద్ధిరేటుతో మొదటి స్థానంలో ఉందన్నారు. కేంద్రం అన్ని రకాలుగా మోసం చేసినప్పటికీ రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటున్నామన్నారు. పంటకు మద్దతు ధర ఇవ్వడం, భూసార పరీక్షలు నిర్వహించి మైక్రో న్యూట్రియల్స్ ఇవ్వడం ద్వారా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేశామన్నారు. స్వాతంత్ర్యానంతరం రూ.24,500 కోట్లు రైతు రుణమాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం తమదేనని, భవిష్యత్‌లో రైతులకు మరింతగా ఆర్థికంగా బలోపేతం చేస్తామని హామీ ఇచ్చారు. రైతు రుణమాఫీ వద్దంటూ ప్రధాని, ఆర్బీఐ చెప్పినా తాను వెనకడుగు వేయలేదన్నారు. రానున్న రోజుల్లో కర్నూలులో ఏర్పాటు చేయనున్న మెగా సీడ్ పార్కు ప్రపంచానికి విత్తన సరఫరా చేయనుందన్నారు. ఇటీవల కేంద్రం ప్రధాని రైతు సమ్మాన్ ద్వారా ఐదెకరాలు ఉన్న వారికి రూ.6వేలు ఇవ్వనున్నట్లు చెపుతోందని, అంటే కేవలం రోజుకు రూ.16 ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. రైతులకు బిక్షం వేస్తారా? అంటూ ఆయన నిలదీశారు. తాము నెలకు రూ.2వేల చొప్పున పింఛన్ రూపంలో ఏడాదికి రూ.24వేలు ఇస్తున్నామని తెలిపారు. ఉద్యాన పంటలను ప్రోత్సహించడం ద్వారా రైతు పెట్టుబడిని తగ్గించి అధిక లాభాలు వచ్చేలా చేశామన్నారు. కరవు కాటకాలతో అలరారే రాయలసీమకు నదుల అనుసంధానం ద్వారా నీటిని సరఫరా చేసి ఉద్యాన పంటల హబ్‌గా మార్చామన్నారు. డ్రిప్, మైక్రో ఇరిగేషన్ ప్రోత్సహించడం ద్వారా నీటి పొదుపు చేసి రైతులకు మేలు చేశామన్నారు. వ్యవసాయంలో యాంత్రీకరణ తీసుకొచ్చి పెద్ద ఎత్తున వ్యవసాయ పరికరాలు అందించామన్నారు. వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం దేశంలో ఆంధ్రప్రదేశ్ మాత్రమేనన్నారు. ప్రకృతి సేద్యంలో ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఆంధ్రప్రదేశ్ ఉందన్నారు. రానున్న రోజుల్లో ప్రకృతి వ్యవసాయాన్ని కోటి ఎకరాలకు పెంచడంతో పాటు కోటి ఎకరాల్లో మైక్రో ఇరిగేషన్ చేపడతామన్నారు. తద్వారా నాణ్యమైన, కల్తీ లేని ఆహార పంటలను ప్రపంచానికి ఎగుమతి చేయబోతున్నామని తెలిపారు. మత్స్య, పాడి పరిశ్రమలో ప్రభుత్వ పురోగతిని సీఎం చంద్రబాబు వివరించారు. అంతకు ముందు వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పాడిపరిశ్రమ, మత్స్య శాఖల మంత్రి ఆదినారాయణ రెడ్డి తమ తమ రంగాల్లో ఇచ్చిన ప్రోత్సాహకాలు, సాధించిన అభివృద్ధి, రానున్న రోజుల్లో చేపట్టనున్న కార్యక్రమాలను వివరించారు. పలువురు ఎమ్మెల్యేలు దీనిపై మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న చర్యలను కొనియాడారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్
ఆంధ్రప్రభ
బుధవారం 6 ఫిబ్రవరి 2019

చరిత్రలో ఈరోజు


స్వేచ్ఛా న్యాయవాది!

6, ఫిబ్రవరి, 1931న స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ న్యాయవాది మోతీలాల్ నెహ్రూ మరణించారు. భారత జాతీయ కాంగ్రెస్‌కి రెండు సార్లు అధ్యక్షుడిగా వ్యవహరించిన మోతీలాల్ నెహ్రూ ఢిల్లీలోని కాశ్మీరీ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. కేంబ్రిడ్జ్‌లో బారిస్టర్ పట్టాను 1883లో అందుకున్న మోతీలాల్ అలహాబాద్ కేంద్రంగా న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. న్యాయవాదిగా విజయంతోపాటు విపరీతంగా ధనాన్ని ఆర్జించి, అలహాబాద్‌లోని సివిల్‌లైన్స్‌లో భారీ భవంతి కొనుగోలు చేసి దానికి ఆనంద భవన్ అని పేరు పెట్టారు. ఆ తరువాతి రోజుల్లో



ఇదే ఆనంద భవన్ సాతంత్ర్యోద్యకారుల కేంద్రంగా మారడం విశేషం. 1919లో ది ఇండిపెండెంట్ అనే దినపత్రికను ప్రారంభించారు. జలియన్‌వాలాబాగ్ ఉదంతంతో బ్రిటీషర్లపై విశ్వాసం సన్నగిల్లి.. గాంధీ మార్గంలోకి నడిచారు. స్వదేశీ భావనపై మహాత్మాగాంధీ మోతీలాల్ నెహ్రూలో అవగాహన పెంచారు. జలియన్‌వాలా బాగ్ ఘటనపై చిత్తరంజన్ దాస్, మహాత్మాగాంధీతో కూడుకున్న విచారణా సంఘంలో మోతీలాల్ కూడా సభ్యుడిగా ఉండడం విశేషం. 1919లోనే మోతీలాల్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడయ్యారు. 1922లో సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ఉపసంహరించుకున్న మహాత్మాగాంధీని మోతీలాల్ నెహ్రూ బాహాటంగానే విమర్శించారు. 1923లో దేశబంధు చిత్తరంజన్ దాస్‌తో కలిసి మోతీలాల్ నెహ్రూ స్వరాజ్ పార్టీని ఏర్పాటు చేశారు. సెంట్రల్ లెజిస్లేచర్ అసెంబ్లీలో విపక్షనాయకుడిగా వ్యవహరించిన మోతీలాల్ నెహ్రూ.. 1928లో తిరిగి కాంగ్రెస్‌లో చేరి ఆ పార్టీకి రెండోమారు అధ్యక్షుడయ్యారు. తన కుమారుడు జవహర్‌లాల్ నెహ్రూ రాజకీయ ప్రవేశంతో కాంగ్రెస్ అధ్యక్ష పదవిని 1929లో అప్పచెప్పారు. మోతీలాల్ నిర్ణయాన్ని గాంధీ సైతం ఆమోదించడం విశేషం. సత్యాగ్రహ ఉద్యమంలో జైలు శిక్ష అనుభవించిన మోతీలాల్ నెహ్రూ ఆరోగ్యం క్షీణించడంతో విడుదలయ్యారు. దేశంలో నెహ్రూ-గాంధీ కుటుంబానికి ఆద్యుడిగా మోతీలాల్ నెహ్రూ చరిత్రలో నిలిచిపోయారు.

దేశ విభజన వద్దన్న 'గాంధీ'?



దేశ విభజనను వ్యతిరేకించి, లౌకిక వాదాన్ని బలంగా నమ్మిన సరిహద్దు గాంధీగా మహాత్ముడితో పిలవబడ్డ ఖాన్ అబ్దుల్ గఫూర్ ఖాన్ పెషావర్ వ్యాలీలో 6, ఫిబ్రవరి, 1890లో జన్మించారు. ముస్లింలకు, హిందువులకు వేర్వేరు దేశాలన్న భావనను వ్యతిరేకించినా.. అహింసా విధానంలో గఫూర్‌ఖాన్ సంపూర్ణంగా గాంధీ మార్గాన్నే అనుసరించారు. 1930లో మహాత్మాగాంధీకి సలహాదారుగా వ్యవహరించిన ఖాన్, 1947లో పాకిస్థాన్ ఆవిర్భావం వరకు ఆయన వెన్నంటే ఉన్నారు. మతంతో పాటు మానవత్వాన్ని ప్రేమించే ఖాన్‌ను ఏ మ్యాన్ ఆఫ్ గాడ్ అని, ఏ సిటిజన్ ఆఫ్ వరల్డ్ అని పిలిచేవారు. పేదరికం పోవాలంటే అది చదువుతోనే సాధ్యమని నమ్మిన ఖాన్ 1910లోనే మసీదు పాఠశాలను ప్రారంభించారు. ఖాన్ స్థాపించిన పాఠశాలను బ్రిటీష్ ప్రభుత్వం 1915లో నిషేధించింది. దీంతో గాంధీ మార్గంలోకి వచ్చిన ఖాన్. రౌలత్ చట్టానికి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనల్లో చురుగ్గా పాల్గొన్నారు. దేశ విభజన జరిగాక పాకిస్థాన్‌లో పఠాన్ల హక్కుల కోసం పోరాటం సాగించారు. గఫూర్‌ఖాన్‌ను పాకిస్థాన్ భారతదేశ అనుకూలుడిగా ముద్ర వేసి పలుమార్లు జైలు పాలు చేసింది. ఆ తరువాత వైద్యం కోసం ఇంగ్లాండ్ వెళ్లారు. అక్కడి వైద్యులు అమెరికా వెళ్లమని ఇచ్చిన సలహాను పెడచెవిన పెట్టి ఆఫ్ఘనిస్తాన్ వెళ్లారు. అక్కడ జుల్ఫికర్ అలి భుట్టో ప్రభుత్వం గఫూర్ ఖాన్‌ను అరెస్ట్ చేసింది. ఆ తరువాత క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకున్నారు. 1985లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ శత వార్షికోత్సవాల్లో పాల్గొనడానికి భారత్ వచ్చారు. 1967లో అబ్దుల్ గఫూర్ ఖాన్‌కి జవహర్‌లాల్ నెహ్రూ పురస్కారం లభించింది. 1987లో భారతదేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న అందుకున్నారు. భారత రత్న అవార్డును పొందిన మొట్ట మొదటి విదేశీయుడుగా కూడా గఫూర్ ఖాన్ రికార్డు సృష్టించారు. 97యేళ్ల వయసులో జనవరి 20, 1988న పెషావర్‌లో సరిహద్దు గాంధీ తుదిశ్వాస విడిచారు.

ఎదగాలంటే సింగపూరే!



1819, ఫిబ్రవరి, 6వ తేదీన డచ్ ఈస్ట్ ఇండియాకి లెఫ్టినెంట్ గవర్నర్‌గా వ్యవహరించిన సర్ థామస్ బింగ్లే స్టామ్‌ఫోర్డ్ రాఫెల్స్ సింగపూర్‌ను, బ్రిటీష్ మలయాను ఏర్పాటు చేశారు. డచ్ పాలకుల చేతుల్లోంచి జావా దీవులను విముక్తి చేసి బ్రిటీష్ రాజ్యంలో కలిపిన రాఫెల్స్ ది హిస్టరీ ఆఫ్ జావా పుస్తకాన్ని కూడా రచించారు. రెండో ప్రపంచ యుద్ధంలో సింగపూర్ జపాన్ చేతుల్లోకి వెళ్లింది. ఆ తరువాత 1963లో బ్రిటీష్ వారి నుంచి సాతంత్ర్యం పొందింది. తొలినాళ్లలో మలేసియాలో భాగంగా ఉన్న సింగపూర్ సైద్ధాంతిక విభేదాలతో విడివడి 1965లో స్వతంత్ర్య దేశంగా ఆవిర్భవించింది. తొలినాళ్లలో సహజ వనరులు లేక నానా అవస్థలు పడ్డ సింగపూర్ ఆ తరువాత యావత్ ప్రపంచం తలెత్తుకొని చూసేలా అభివృద్ధి చెందింది. అభివృద్ధి చెందుతున్న దేశం హోదాను ఒకే తరంలో అభివృద్ధి చెందిన దేశంగా ఆవిర్భవించడానికి ఆ దేశాధ్యక్షుడు లీ కౌన్ కీలకపాత్ర పోషించారు. ఆర్థిక రంగంలో ఆసియా టైగర్‌గా సింగపూర్ నిలిచింది. ఇప్పుడు విద్య, వినోదం, ఆర్థిక రంగం, వైద్య సంరక్షణ, మానవ వనరులు, లాజిస్టిక్స్, వాణిజ్యం, రవాణ, తయారీ పరిశ్రమ, సాంకేతిక పరిజ్ఞానం రంగాల్లో సింగపూర్ అంతర్జాతీయ కేంద్రంగా ఎదిగింది. ఈ నగర రాజ్యం కీర్తి కిరీటంలో ఎన్నో బిరుదుల ఒద్దికగా ఒదిగిపోయాయి. సాంకేతికతకు సంసిద్ధంగా ఉన్న దేశంగా, పెట్టుబడులకు అత్యంత అనువైన దేశంగా, వరల్డ్ స్మార్ట్ సిటీ కంట్రీగా, ప్రపంచ సురక్షిత దేశంగా, మూడో అతి పెద్ద విదేశీ మారక మార్కెట్‌గా, మూడో అతి పెద్ద ఆయిల్ రిఫైనరీ, రెండో అతి ఎక్కువ రద్దీగా ఉండే కంటైనర్ రేవు ఉన్న దేశంగా ఎన్నో ప్రత్యేకతలను సింగపూర్ సొంతం చేసుకుంది.

ఆమెకి ఆస్తి ఉంటేనే ఓటు హక్కు



ఇప్పుడంటే పార్లమెంటులో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ అయితే ఉంది. కానీ, భారత దేశానికి ప్రజాస్వామ్యాన్ని పరిచయం చేసిన బ్రిటీష్ వారు మాత్రం ఆమెకి ఓటు హక్కునే అంత తేలిగ్గా కల్పించలేదు. 1918 వరకు బ్రిటీష్ మహిళలకు ఓటు హక్కే లేదు. 6వ తేదీ, ఫిబ్రవరి, 1918న బ్రిటన్ పార్లమెంటు ప్రజా ప్రతినిధ్య చట్టాన్ని తీసుకొచ్చింది. దీని ప్రకారం బ్రిటీష్ మహిళలకు ఓటు హక్కు ఇచ్చారు. అయితే ఓటు హక్కు పొందడానికి మహిళల వయసు కనీసం ముప్పై సంవత్సరాలు ఉండాలని నిబంధన పొందుపరిచారు. ముప్పై సంవత్సరాలే కాకుండా ఓటేసే మహిళలకు కనీస ఆస్తి అంటూ ఉండాలనే నిబంధన సైతం పొందుపరిచారు. అయిదు పౌండ్ల విలువ చేసే స్థలం కానీ, ఇళ్లు కానీ ఉంటేనే బ్రిటన్ మహిళలకు ఆ రోజుల్లో ఓటు హక్కు వస్తుంది. పురుషులకు మాత్రం 21 సంవత్సరాలుగా నిర్ణయించారు. ఈ చట్టం ఫలితంగా ఒక కోటి ఇరవై లక్షలా తొంభై వేల మందికి ఓటు హక్కు వచ్చింది. మహిళా ఓటర్లు 85 లక్షల మంది నమోదయ్యారు. 1928లో కానీ మహిళలకు సమాన ఓటు హక్కు బ్రిటన్‌లో దఖలు కాలేదు. 1928 చట్టంలో ఎలాంటి ఆస్తిపాస్తులు లేకపోయినా 21 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళా ఓటు హక్కుకు అర్హత కలిగి ఉండేలా నిబంధనలను సవరించారు. దీంతో బ్రిటన్ ఓటరు జాబితాలో అదనంగా మరో యాభై లక్షల మంది మహిళా ఓటర్లు చేరారు.

చట్టానిదే విజయం!

శారదా చిట్ ఫండ్ కుంభకోణంపై దర్యాప్తు చేస్తున్న సిబిఐ అధికారుల ఎదుట హాజరై, సహకరించాలని కోల్‌కతా పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. అదే సందర్భంలో ఆయనను అరెస్టు చేయవద్దంటూ సీబీఐని ఆదేశించింది. ఈ కారణంగా అటు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు మమతా బెనర్జీ, ఇటు కేంద్ర ప్రభుత్వమూ విజయం తమదేనంటూ ఎవరి మటుకు వారు ప్రకటనలు గుప్పిస్తున్నారు. వాస్తవానికి గోటితో పోయే దానికి గొడ్డలికి పని కల్పించినట్టు సీబీఐ అధికారులూ, రాజీవ్ కుమార్ వ్యవహరించడం వల్లనే ఇంత రాద్ధాంతం జరిగింది. సుప్రీంకోర్టు ఆదేశాలు ఎవరికీ అనుకూలమూ కాదు, ప్రతి కూలమూ కాదు. చట్టం తన పనితాను చేసుకుని పోయిన చందంగా ఉన్నాయి. రాజీవ్ కుమార్‌ని సీబీఐ అధికారులు అరెస్టు చేయకుండా ఆపగలిగామన్నది మమతా బెనర్జీ ఉద్దేశ్యం కావచ్చు. రాజీవ్ కుమార్ నివాసానికి ఆదివారం సీబీఐ అధికారులు వెళ్ళింది ఆయనను అరెస్టు చేయడానికి కాదు, ప్రశ్నించడానికి. 40 మంది సిబిఐ అధికారులూ, సిబ్బంది ఒకేసారి వెళ్ళడం వల్ల అరెస్టు చేసి తీసుకుని వెళ్ళడానికేమోనని పశ్చిమబెంగాల్ పోలీసులు అనుమానించి, సిబిఐ బృందాన్ని అడ్డుకున్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థ విధి నిర్వహణకు ఆటంకం కలిగించారంటూ బెంగాల్ పోలీసులపై కేంద్రం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు సూటిగా స్పందించలేదు. కేసు దర్యాప్తునకు సహకరించమని మాత్రమే రాజీవ్ కుమార్‌ని ఆదేశించింది.

అభియోగాలకు గురైనవారు తమపై దర్యాప్తును ఆపించేందుకు కోర్టులను ఆశ్రయించడం సర్వసాధారణం. కోల్‌కతాలో సీబీఐ అధికారులను పశ్చిమ బెంగాల్ పోలీసులు అడ్డుకున్న తీరు ఎంతమాత్రం ప్రజాస్వామ్య యుతంగా లేదు. చట్టం అమలుకు సహకరించాల్సిన ముఖ్యమంత్రి సీబీఐని అడ్డుకోవడానికి తానే దీక్షకు ఉపక్రమించడం ఎన్నడూ కనీవినీ ఎరుగనిది. తనకు సిబీఐ మీద కోపం లేదనీ, తన పోరాటం అంతా సీబీఐని దుర్వినియోగం చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోడీ పైనేనని మమత స్పష్టం చేస్తున్నారు. మోడీని రాజకీయంగా ఎదుర్కోవడానికి ఆమె ఇతర మార్గాలను అనుసరిస్తున్నారు. మోడీని గుజరాత్‌కి పంపే వరకూ విశ్రమించనని శపథం చేశారు. రాజకీయ ప్రత్యర్థిగా ఆమె చేసే ప్రకటనల పట్ల ఎవరికీ అభ్యంతరం లేదు. తమ విద్యుక్త ధర్మాన్ని నెరవేర్చేందుకు వచ్చిన సిబీఐ అధికారులను అడ్డుకోవడం చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నట్టు కాదా. ఇలాంటి ఆందోళనలు ఇతరులకు ఎలాంటి సంకేతాలు ఇస్తాయో బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రి పదవిలో ఉన్న మమతకు తెలియంది కాదు. ఆమె స్వతహాగా ఆవేశపరురాలు. దీర్ఘ కాలం ప్రతిపక్ష నాయకురాలిగా పోరాటాలకు అలవాటు పడిన ఆమె ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన తర్వాత కూడా అదే పంథాను అనుసరిస్తున్నారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసం, హక్కుల కోసం ఆమె కేంద్రంతో పోరాడటంలో తప్పు లేదు. అదే సందర్భంలో కేంద్ర సంస్థలు పనిచేసుకుని పోవడానికి అడ్డంకులు సృష్టించకుండా ఉండటం ముఖ్యమంత్రిగా ఆమె బాధ్యత. ఆ బాధ్యతను ఆమె విస్మరించారు. అలాగే, పోలీసు కమిషనర్ హోదాలో రాజీవ్ కుమార్ మమత దీక్ష వేదికను పాలు పంచుకోవడాన్ని కేంద్ర హోం శాఖ తీవ్రంగా పరిగణిస్తోంది. చట్టప్రకారం ఆయనపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కేంద్ర హోం శాఖ ఆదేశించింది. తెగే వరకూ లాగడమంటే ఇదే. ఇరువర్గాలూ పంతాలూ, పట్టుదలలకు పోవడం వల్ల వ్యవస్థపై జనానికి నమ్మకం సడలుతోంది. పెద్ద పదవులలో ఉన్న వారే చట్టాన్ని గౌరవించకపోతే, సామాన్యులు ఉల్లంఘిస్తే వారిని దండించే హక్కు ప్రభుత్వంలోని పెద్దలకు ఎక్కడ ఉంటుందన్న ప్రశ్న తలెత్తుతోంది. సిబీఐ నోటీసులు జారీ చేయకుండా యుద్ధానికి వచ్చినట్టు కోల్‌కతా వచ్చిందంటూ మమత ఆరోపిస్తున్నారు రాజీవ్ కుమార్‌కి పలు నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో కోల్‌కతా రావల్సి వచ్చిందని సీబీఐ అధికారులు అంటున్నారు. పోలీసుల సమన్లను సామాన్యుడు ఉల్లంఘిస్తే రాష్ట్ర పోలీసులు ఊరుకోరు. కేంద్ర దర్యాప్తు సంస్థ సమన్లను పోలీసు ఉన్నతాధికారి ఉల్లంఘిస్తే ఉపేక్షించడం న్యాయమా అన్న ప్రశ్న తలెత్తుతోంది. పోలీసు అధికారి అయినంత మాత్రాన ఆయన చట్టానికి అతీతుడా అన్న ప్రశ్న కూడా ఉదయిస్తోంది. ఏ విధంగా చూసినా ఈ వ్యవహారంలో బెంగాల్ పోలీసులూ, సీబీఐ అధికారులూ అతిని ప్రదర్శించడం వల్లనే ఇంత రచ్చ జరిగింది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ జోక్యం చేసుకోకుండా ఉంటే, పరిస్థితి వేరుగా ఉండేది. చట్ట ప్రకారం సీబీఐ ముందుకు వెళ్లేది. మమత జోక్యం వల్ల దీనికి రాజకీయ రంగు వచ్చింది. చట్టాన్ని ఎవరు ఉల్లంఘించినా శిక్షార్హులే కానీ, ఆధునిక కాలంలో రాజకీయాన్ని అడ్డుపెట్టుకుని చట్టం నుంచి తప్పించుకునే యత్నాలకు అందరూ ఒడిగడుతున్నారు. రాజకీయాల్లో ఉంటే తప్పులు చేసినా, ఎదుటి వారికి రాజకీయ దురుద్దేశ్యాలను ఆపాదించి బయటపడవచ్చునని అనుకుంటున్నారు. అలాగే, కేంద్రం కూడా సీబీఐని స్వతంత్రంగా పనిచేసుకోనివ్వకుండా తరచూ జోక్యం చేసుకోవడం వల్ల సీబీఐ విశ్వసనీయత దెబ్బతింది. సిబీఐ చట్ట ప్రకారం ముందుకు వెళ్ళినా, రాజకీయ ఒత్తిళ్ళకు లోనై తమను ప్రశ్నించేందుకు ముందుకు వస్తోందంటూ రాజకీయ నాయకులు ఆరోపిస్తున్నారు. ఇంతకీ చిట్‌ఫండ్ వ్యవహారంపై సిబీఐ దర్యాప్తును మమత అడ్డుకోవడానికి కారణం తమ పార్టీ ఎంపీల ప్రమేయం ఉండటం వల్లనే. తమపార్టీ ఎంపీల పై వచ్చిన అభియోగాలను నివృత్తి చేసుకోవల్సిన అవసరం ఆమెకు లేదా? సీబీఐ దర్యాప్తునకు సుప్రీంకోర్టు ఆదేశించినా, రాష్ట్ర ప్రభుత్వం తరపున సిట్ దర్యాప్తు జరిపించావమని అనడం ఏపాటి న్యాయం? సర్వోన్నత న్యాయస్థానాన్ని గౌరవించడం ఇలాగేనా?

గుజరాత్ నమూనా ఏదీ?

అయిదేళ్ల పాలనలో తాను హామీ ఇచ్చిన గుజరాత్ నమూనాను ప్రధాని మోడీ దేశవ్యాప్తంగా అమలుచేయగలిగారా? ఆయన చెబుతున్న గుజరాత్ నమూనా ఏమిటి? అసలది గుజరాత్‌లో ఎంతవరకు విజయం సాధించింది? లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అందరిలోనూ తొలుస్తున్న ప్రశ్నలివి.

సాధారణంగా రాజకీయ నాయకులకు, బడా వ్యాపారవేత్తలకు సత్సంబంధాలుంటాయి. ప్రధాని మోడీ ఈ విషయంలో అందరికన్నా ముందుంటారని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఆయన జాతీయ రాజకీయ రంగ ప్రవేశం చేయగానే గుజరాత్ అభివృద్ధి నమూనా అనే అందమైన దృశ్యాన్ని ప్రపంచం ముందు ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. ఇది సహజంగానే అందరికీ ఆసక్తి కలిగించే అంశం. మొదటినుంచి వ్యాపారం అంటే గుజరాత్ అనేంతగా గుజరాతీయులకు, వ్యాపారానికి అవినాభావ సంబంధం ఉన్న నేపథ్యంలో ప్రధాని మోడీ అందరినీ సునాయాసనంగా నమ్మించగలిగారు. వాస్తవానికి నరేంద్ర మోడి గుజరాత్ పగ్గాలు చేపట్టకముందే గుజరాత్ ఆర్థికంగా చాలా ముందంజలో ఉండేది. ఎంతో అభివృద్ధి చెందిన తూర్పు ఆసియాకి ఏమాత్రం తీసిపోకుండా అప్పట్లోనే గుజరాత్‌లో వినూత్న ప్రయోగాలు చేపట్టారు. అయితే అప్పట్లో రాజకీయ వాతావరణం భిన్నంగా ఉండేది. అప్పటి ప్రాంతీయ రాజకీయాలకు, ఆర్థిక వ్యవస్థకు మంచి సంబంధాలుండేవి. పరస్పరం కలిసి పనిచేసేవారు. 2000 సంవత్సరంలో మోడి ప్రవేశపెట్టిన ఆర్థిక విధానం ఆ స్నేహపూరిత వ్యాపార వాతావరణానికి కొత్త రూపం తెచ్చింది. 2001 నుంచి 2014 వరకు గుజరాత్‌కు ముఖ్యమంత్రిగా ఉన్న మోడి గుజరాత్ మోడల్‌పై ప్రత్యేక దృష్టిపెట్టి దాన్నొక మెగా ఈవెంట్‌గా ప్రపంచం దృష్టిలో నిలిపారు. అయితే కేవలం పెద్ద కార్పొరేట్ సంస్థలు మాత్రమే దీనితో లబ్ది పొందాయన్న అభిప్రాయం సర్వత్రా నెలకొన్నది. ప్రభుత్వానికి(మోడీకి), పెద్ద వ్యాపార సంస్థలకు రాష్ట్రప్రభుత్వానికి మధ్య సత్సంబంధాలు మాత్రం పెరిగాయి. అలా పెద్ద సంస్థలతో ప్రభుత్వ స్నేహం వలన ఆర్థిక వ్యవస్థకే కాదు సమాజానికి కూడా మంచి జరగలేదు. ఎందుకంటే చిన్న కంపెనీలతో పోలిస్తే పెద్ద కంపెనీలలో ఉద్యోగులు తక్కువమంది ఉంటారు. రాష్ట్ర అభివృద్ధి పేరుతో కేవలం పెద్ద కంపెనీలకు పెద్ద పీట వేయడం వలన ఉపయోగం లేదన్నది గుజరాత్ మోడల్ ద్వారా రుజువైంది. బిజెపి చేతిలోకి రాష్ట్రం వెళ్లకముందు, 1980లలో అంతకుముందు ముఖ్యమంత్రులు సామాజిక స్థితిగతులు, పరిస్థితులకు తగినట్లుగా సామాజిక విధానాలకు తగినట్లుగా ఉదారవాద నిర్ణయాలు తీసుకునేవారు. రిజర్వేషన్ల ఆధారంగా ప్రభుత్వం నుంచి సానుకూల ప్రతిస్పందనలుండేవి. ఏవిధమైన వివక్షలు ఉండేవి కావు. తర్వాత 90లలో కొత్త పాలసీ తీసుకువచ్చారు. కొత్తగా పెట్టిన పరిశ్రమలలో స్థానికులకు 80 శాతం ఉద్యోగాలివ్వాలి. అంతేకాదు. ఉన్న ఉద్యోగాలలో 50 శాతం



పోస్టులు మేనేజర్లు, సూపర్‌వైజర్లుగా స్థానికులకే ఇవ్వాలి. వెనకబడిన ప్రాంతాలలో తప్పనిసరిగా ఉపాధి అందేలా చూడటం ఆ పాలసీ లక్ష్యం. అలా ఉన్న గుజరాత్ ఉద్యోగ వ్యవస్థలో, 2003 లో మోడి ఆధ్వర్యంలో పారిశ్రామిక విధానం అమలు జరిగినప్పుడు అంతకుముందు ఉన్న సానుకూల పరిస్థితులు తారుమారయ్యాయి. వాస్తవానికి మోడీ మోడల్ ఉద్దేశ్యం ఏంటంటే, బయటి వ్యక్తుల నుంచి రాష్ట్రంలోకి పెట్టుబడులు రావాలి. కొత్త పెట్టుబడులు, పరిశ్రమలతో రాష్ట్రం అభివృద్ధి చెందాలి. అటువంటి వాతావరణం రాష్ట్రంలో ఏర్పడాలి. కాని వాస్తవంలో మార్కెట్ సానుకూల వాతావరణానికి బదులు వ్యాపార సానుకూల వాతావరణం ఏర్పడింది. పరిశ్రమలు పెట్టాలనుకున్నవారికి కష్టకాలం ఎదురైంది. వారు మార్కెట్ ధర కంటే ఎక్కువ ధరకు భూములు కొనుక్కోవలసి వచ్చింది. మార్కెట్ అనుకూల ఆర్థిక వ్యవస్థ లేదు కాబట్టి రాష్ట్రంలో నూతన ప్రయోగాలు జరగలేదు. ఎక్కువ పరిశ్రమలు రాలేదు. అనుకూలమైన మార్కెట్ పరిస్థితులుంటేనే సామాన్య ప్రజల అభివృద్ధి జరుగుతుంది. ఇంకోవైపు బడా కంపెనీల వ్యాపారం బాగా పెరిగింది. వ్యాపారానుకూల వాతావరణం ఉండటంతో రాజకీయనాయకులు రంగప్రవేశం చేశారు. తమ అనుయాయులతో కంపెనీలు ఏర్పాటు చేయించారు. గుజరాత్‌లో ఒకప్పుడు అంబానీ లాటి పెద్ద వ్యాపారులతోపాటు చిన్న, మధ్యతరహా వ్యాపారాలకు ఊతం దొరికేది. అవి అభివృద్ధి చెందడానికి బలమైన, సానుకూల వాతావరణం ఉండేది. కాని తర్వాత పరిస్థితులు తారుమారయ్యాయి.

మోడీ మంచి వ్యాపారవేత్త అయిన ముఖ్యమంత్రిగా ఎంతోమందిని ఆకర్షించారు. ఏడాది విడిచి ఏడాది వైబ్రెంట్ గుజరాత్ పేరుతో అప్పట్లో మోడీ ప్రభుత్వం యావత్‌దేశాన్ని ఆకర్షించేది. ఆ సదస్సులకు హాజరయ్యే పారిశ్రామికవేత్తలు వేదికల మీద మోడీని ప్రశంసలతో ముంచెత్తేవారు. ముఖేష్, అనిల్ అంబానీలు, శశి రుయా, గౌతమ్ అదాని, ఇంకా చాలామంది ఆ జాబితాలో ఉంటారు. కాని ప్రశంసలు అందుకన్నరీతిలో మోడీ విదేశీ పెట్టుబడులను మనదేశానికి తేలేకపోయారు. 2000 నుంచి 2012 వరకు గుజరాత్‌కు కేవలం 4.5 శాతం మాత్రమే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చాయి. ఇంకోపక్క గుజరాత్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, 99 ఏళ్ల కోసం భూములను ఇండస్ట్రియల్ యూనిట్లకు లీజుకు ఇచ్చి సెజ్‌లను ఆరంభించింది. అది 21,308 హెక్టార్లకు పెరిగింది. మెగా ప్రాజెక్టుల మీద దృష్టి కేంద్రీకరించిన గుజరాత్ మోడల్ కేవలం పెద్ద కంపెనీల మీద మాత్రమే ఆధారపడింది. దానివలన అభివృద్ధి రేటు పెరిగింది కాని ఉద్యోగాలు మాత్రం ఎక్కువగా సృష్టించలేకపోయింది. అభివృద్ధిలో 1990లోనే గుజరాత్ దేశంలో అన్ని రాష్ట్రాలకంటే అగ్రపథాన ఉన్న గుజరాత్ ఇప్పుడు మనదేశ పారిశ్రామిక ఉత్పత్తిలో కేవలం 20 శాతం, టెక్స్‌టైల్ ఉత్పత్తిలో 24 శాతం, ఫార్మాస్యూటికల్స్ ఉత్పత్తి 35 శాతం, పెట్రోకెమికల్ ఉత్పత్తిలో 51 శాతం, ఎగుమతుల్లో 22 శాతం నడుస్తోంది.

పెద్ద కంపెనీలు పెట్టుబడులు భారీగా పెడతాయి. కాని దానికి తగ్గట్టు ఉద్యోగాలు ఉన్నాయా అంటే అది ప్రశ్నార్థకం. ఉదాహరణకు పెట్రోకెమికల్ ఇండస్ట్రీ ఇంకా కెమికల్ ఇండస్ట్రీలు మంచి పనితీరు చూపిస్తాయి. వరుసగా 34 శాతం, 15 శాతం ఉత్పత్తి చూపాయి. కాని అవి ఎంతమాత్రం ఉద్యోగాలు సృష్టించే పరిశ్రమలు కావు. ఉత్పత్తి రంగం మాత్రమే ఎక్కువమందికి పనిచూపించగలవు. వేతనాల విషయంలో కూడా గుజరాత్ బాగా వెనకబడిపోయింది. పెద్ద పరిశ్రమలతో పోలిస్తే చిన్న పరిశ్రమల్లో కార్మికవర్గం నాలుగింతలు ఎక్కువగా ఉంటుంది. చిన్న, మధ్యతరహా పరిశ్రమలు తగ్గిపోవడానికి, పరిశ్రమల ఆర్థిక సమస్యలకు పాక్షిక కారణం జిల్లాస్థాయి కోఆపరేటివ్ బ్యాంకుల పతనం. చిన్నవాటికి అంత విలువ ఇవ్వక్కరలేదనే ఉద్దేశ్యంతో బిజెపి ప్రభుత్వం కోఆపరేటివ్ బ్యాంకులకు సహాయం చెయ్యలేదు. అంతేకాదు. దాని వెనక రాజకీయ కారణమూ ఉంది. గుజరాత్‌లో కో ఆపరేటివ్ బ్యాంకులను స్థాపించింది కాంగ్రెస్ కాబట్టి నిర్లక్ష్యవైఖరి అవలంబించారు.

రాష్ట్ర బిజెపికి అనుగుణంగా జాబ్ రేట్ పెరగడంలేదనేదే కాకుండా నాణ్యమైన ఉద్యోగాల సృష్టికూడా జరగట్లేదని జాబ్ మార్కెట్ పరిస్థితి చూస్తే అర్థం అవుతుంది. ఉదాహరణగా మళ్లీ నానో ప్లాంట్ ఉద్యోగుల విషయమే తీసుకుంటే మొత్తం 2200 మంది ఉద్యోగుల్లో కేవలం 430 మాత్రమే పర్మనెంట్ వర్కర్లు. వారి జీతం 2016 లో 12,500 ఉంది. అంటే అనధికార కార్మికులు నెలకు 3,300 రూపాయల కంటే తక్కువ సంపాదిస్తున్నారు. గుజరాత్‌లో 2000 సంవత్సరం మొదట్లో ఉధృతంగా మార్పులు వచ్చాయి. రాష్ట్రానికి మరింతమంది పెట్టుబడిదారులను తేవడానికి, తనని తాను వికాస పురుషుడిగా చెప్పుకోవడానికి, ముఖ్యంగా గుజరాత్ ఒక్కటే దేశంలో అభివృద్ధి పథంలో నడుస్తున్న రాష్ట్రంగా అనడానికి నరేంద్రమోడి తాపత్రయపడ్డారు. మోడి చూపిన మేజిక్‌ఫిగర్ చూసి అందరూ అంతా నిజమనుకున్నారు. మోడీ నమూనా వలన గుజరాత్ ఆర్థిక వ్యవస్థకు, సమాజానికి, పర్యావరణానికి మంచి జరుగుతుందనే ఊహలుండేవి. కాని చిన్న, మధ్య తరహా పరిశ్రమలను పణంగా పెట్టి ముందుగా పెద్ద పరిశ్రమలు అభివృద్ధి చెందాయి. గుజరాత్‌కి ఏదైనా మంచి జరిగింది అంటే అది 1980లలోనే. తర్వాత కాదు. చివరగా గుజరాత్ ప్రభుత్వం చేసిన ఇంకో పని, పెద్ద పరిశ్రమలు పర్యావరణ పరిరక్షణకు, పరిశ్రమలు అనుసరించవలసిన నియమాల ఒత్తిడికి లోను కానక్కరలేదనే భరోసా ఇవ్వడం. 2015 లో పటేల్‌లు ప్రభుత్వ కోటాలో తమకు ఉద్యోగాలు రావాలని గొడవచేశారు. అంత భారీగా జరిగిన ప్రదర్శనలు చూస్తే మంచి ఉద్యోగాల అవసరం యువతకు ఎంత ఉందో అర్థం అవుతుంది. దాని తర్వాతనే 2017 లో స్థానిక ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాలలో బిజెపి ఓడిపోయింది. రైతులు, వృత్తి కళాకారులు, చిన్న పరిశ్రమల వారి వ్యతిరేకత ఆ రకంగా వ్యక్తమైంది. మొత్తం మీద ఇది ఆర్థిక, సామాజిక, రాజకీయాంశాలతో ముడిపడిన అంశం. సామాన్యుడు తన నిత్య జీవనభుక్తి గురించి మాత్రమే ఆలోచించే నేపథ్యంలో మోడీ మోడల్ ఎన్నికల రాజకీయాల్లో ఎలాంటి ప్రభావాన్ని చూపుతుందన్నది ప్రశ్న!

-శ్రీదేవి కవికొండల

పెట్టుబడి సాయం రైతుకి ఉపశమనం

వ్యవసాయరంగానికి భారత ఆర్థిక వ్యవస్థలో ఈనాటికి ప్రముఖ స్థానం ఉంది. ఇటీవలి కాలంలో రైతులు అనేక కష్టనష్టాలకు గురౌతున్నారు. వ్యవసాయ వ్యయం భారీగా పెరిగింది. పెట్టుబడికి తగిన రాబడి రాకపోవడం వలన, అతివృష్టి అనావృష్టి వల్ల, సకాలంలో ఎరువులు క్రిమిసంహారక మందులు లభించక, సరైన సమయంలో అవసరమైన రుణం లభించక రైతులు అనేక కష్టనష్టాలకు గురౌతున్నారు. కొన్ని సందర్భాలలో అప్పుల బాధలు పడలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఏడాదిన్నర వ్యవధిలో దేశవ్యాప్తంగా రైతులు 18 సార్లు రోడ్డున పడి ఆందోళనలకు దిగడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నాయి. తమిళనాడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, తెలంగాణా రాష్ట్రా లకు చెందిన 184 రైతు సంఘాలు దేశవ్యాప్త నిరసనలకు దిగడంతో రైతన్నల ఆగ్రహ జ్వాలలు ఢిల్లీ పీఠాన్ని తాకాయి. ఇటీవల హిందీ బెల్ట్ లోని మూడు రాష్ట్రా ల్లో బిజెపి పరాజయానికి కొంతమేర అన్నదాతల ఆగ్రహం కారణమని నిర్ణయానికొచ్చిన కేంద్ర ప్రభుత్వం వారిని మంచి చేసుకోవడం కోసం అనేక రకాల పథకాలపై అధ్యయనం చేసి చివరకు తెలంగాణ, ఒడిశా రాష్ట్రా లు అమలు చేస్తున్న పెట్టుబడి సాయమే మంచిదన్న నిర్ణయానికి రావడం జరిగింది.

2019 - 20 తాత్కాలిక బడ్జెట్‌లో రైతుల సంక్షేమం కోసం కొత్త పథకం ప్రతిపాదించారు. విత్తనాలు, ఎరువులు, పనిముట్లు, కూలీలు వంటి పెట్టుబడి వ్యయాలు సమకూర్చుకునేందుకు పేద రైతులకు ఆదాయ మద్దతు కల్పించాల్సిన అవసరం నెలకొన్న పరిస్థితుల్లో ప్రధానమంత్రి కిసాన్ నిధి పేరిట ప్రత్యేక పథకాన్ని రూపొందించారు. రైతులు అప్పుల బారిన పడకుండా పరిహరించడం రుణదాతలు వలలో చిక్కుకోకుండా చూడడం ఈ పథకం ఉద్దేశం. చిన్న, మధ్య తరహా రైతులకు ఆర్థిక సహాయం అందచేయడమే ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం ఆశయం. ఈ పథకం ప్రకారం చిన్న, సన్నకారు రైతులకు లాభం చేకూరుతుంది. ఐదు ఎకరాల లోపు వ్యవసాయ భూకమతాలను కలిగి ఉన్న రైతులకు ఈ పథకం వర్తిస్తుంది. ఈ పథకం ప్రకారం ఐదు ఎకరాల లోపు వ్యవసాయ భూమి కలిగి ఉన్న చిన్న, సన్నకారు రైతులకూ ప్రతి సంవత్సరం రూ.6000/- ల ఆర్థికసాయం మూడు దఫాలుగా చెల్లించడం జరుగుతుంది. ఈ నగదును నేరుగా కేంద్ర ప్రభుత్వం రైతులకు బదిలీ చేస్తుంది. 2018 డిసెంబర్ నుండి ఇది అమలులోకి వస్తుంది. కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని అమలు చేయడం వలన కేంద్ర ప్రభుత్వంపై సంవత్సరానికి 75 వేల కోట్ల మేర భారం పడుతుంది. 2018 - 19 ఆర్థిక సంవత్సరానికి 20 వేల కోట్లు, 2019- 20 ఆర్థిక సంవత్సరానికి 75 వేల కోట్ల రూపాయలను బడ్జెట్‌లో ప్రతిపాదించారు.

తెలంగాణాలో 47.08 లక్షల మంది రైతులకు లాభం:

కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద తెలంగాణా రాష్ట్రంలో 47.08 లక్షలమంది సన్న చిన్నకారు రైతులు రూ.2,824 కోట్ల పెట్టుబడి సాయం పొందనున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పెట్టుబడి పథకం వల్ల తెలంగాణ రాష్ట్రంలోని 90 శాతం మంది రైతులకు ఆర్థిక ప్రయోజనం కలుగుతుంది. వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం తెలంగాణాలో మొత్తం రైతుల సంఖ్య 57.24 లక్షలు కాగా అందులో ఐదు ఎకరాలలోపు భూ కమతాలను కలిగి ఉన్న సన్న, చిన్నకారు రైతుల సంఖ్య 47.08 లక్షలు. అంటే సుమారు 90 శాతం మంది సన్న, చిన్నకారు రైతులలో అత్యధికంగా ఎకరం లోపు భూమి ఉన్నవారు 14.86 లక్షలమంది. తెలంగాణా రాష్ట్రంలో 1040 కోట్ల ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా సన్న, చిన్నకారు రైతుల అధీనం లో 95.59 లక్షలు అంటే 68.5 శాతం ఉంది.

తొలిసారిగా తెలంగాణాలో:

భారతదేశంలో కష్టాలలో ఉన్న రైతులకూ ఆర్థిక సహాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముందుగా గుర్తించింది. తెలంగాణా రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వం తొలిసారిగా రైతులకు ఆర్థికంగా సహాయం చేయడం కోసం రైతు బంధు పథకాన్ని ప్రవేశపెట్టింది. రాష్ట్రంలోని కరీంనగర్ జిల్లా లాలపల్లి - ఇందిరానగర్ గ్రామంలో 2018 మే 10న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకంలో భాగంగా ఎకరానికి 4 వేల రూపాయల చొప్పున ఖరీఫ్, రబీ సీజన్‌లలో 8 వేల రూపాయలను పెట్టుబడి సాయంకింద చెక్కుల రూపంలో రైతులకు పంపిణీ చేశారు. అయితే తెలంగాణా రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఈ పెట్టుబడి సాయాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలలో ప్రభుత్వం జమచేసింది. తెలంగాణ రాష్ట్రంలో రైతు బంధు పథకం అమలు కోసం సుమారు 58 లక్షల మంది రైతులకు కొత్త పట్టాదార్ పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. సాగు భూమి ఉన్న ప్రతి రైతు ఈ పథకం కింద లబ్ది పొందడానికి అర్హుడు. తెలంగాణా ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బంధు పథకానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రతిపాదించిన ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి తేడా ఉంది. రైతు బంధు పథకం అమలుకోసం తెలంగాణా రాష్ట్రప్రభుత్వం ప్రతి సంవత్సరం సుమారు 15 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంది. కేంద్రం రైతులకు ఆర్థికసాయం కింద ఇచ్చేది దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రా లకు కలిపి 75 వేల కోట్ల రూపాయలు. తెలంగాణా రాష్ట్రంలో అమలవుతున్న రైతు బంధు పథకం వైపు ఇతర రాష్ట్రా లు ఆసక్తి కనబరుస్తున్నాయి. ఇప్పటికే ఇదే తరహా పథకాన్ని ఒడిశా, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాలు కొన్ని మార్పులతో ప్రవేశపెట్టాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉద్దేశాలు ఏమైనప్పటికీ తెలంగాణ రైతులకు మాత్రం రెండు కోణాల్లో లబ్ది చేకూరనుంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం తాత్కాలిక బడ్జెట్‌తో ప్రకటించినా ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి తెలంగాణ ప్రభుత్వం అమలు పరుస్తున్న రైతు బంధు పథకాల ద్వారా కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుంది. (5) ఐదెకరాల లోపు వ్యవసాయ భూమి కలిగిఉన్న ప్రతి రైతుకూ ప్రతి ఏటా రూ.6 వేల చొప్పున నగదు లభిస్తుంది. మనదేశంలో మొత్తం 26 కోట్ల 30 లక్షల మంది రైతులు ఉన్నారు. 2016 - 17 నాబార్డ్ ఆర్థిక సర్వే ప్రకారం ఒక్కో రైతు కుటుంబంపై రూ.1.04 లక్షల అప్పు భారం ఉంది. దేశం మొత్తంమీద సగం కంటే ఎక్కువ మంది రైతులు అప్పుల్లో కూరుకుపోయినట్లు నేషనల్ శాంపిల్ సర్వే (ఎన్ఎస్ఎస్ఓ) ప్రకటించింది. అనేక సందర్భాలలో రైతులు పండించిన పంటలకు డిమాండ్ లేకపోవడం వలన రైతులకు ఆశించిన ధర లభించడంలేదు. ప్రస్తుతం మహారాష్ట్రలో ఉల్లి పండించిన రైతులు ఇటువంటి సమస్యలనే ఎదుర్కొంటున్నారు. అవసరమైనన్ని గోదాములు, శీతల గిడ్డంగులు లేకపోవడంతో పంట ఉత్పత్తులు ఎక్కువ కాలం నిల్వచేసుకునే అవకాశం లేదు.

-డాక్టర్ పి.మోహన్ రావు, 9949595509


కవి సామ్రాట్ నోరి నరసింహ శాస్త్రి

నేడు 120వ జయంతి

తెలుగులో కవి సామ్రాట్‌లు ఇద్దరే ఉన్నారు. నోరి నరసింహశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ. నోరి నరసింహశాస్త్రి 1900 సంవత్సరం ఫిబ్రవరి 6వ తేదీన గుంటూరులో పండిత వంశంలో జన్మించారు. ఆయన బీఏ బిఎల్ పట్టా పొంది రేపల్లెలో న్యాయవాదిగా ప్రసిద్ధి చెందారు. ఆయన తెలుగు, సంస్కృతం, ఆంగ్లం, కన్నడ భాషల్లో పండితుడు. కథలు, నవలలు, నాటికలు, పద్యకావ్యాలు రాశారు. ఆ రోజుల్లో భారతి పత్రికలో సాహితీ వ్యాసాలు అనేకం రాశారు. ఆయన రాసిన చారిత్రక నవలల్లో రుద్రమదేవి, మల్లారెడ్డి, నారాయణ భట్టు, కవిసా ర్వభౌముడు, కవి ద్వయం ముఖ్యమై నవి. ఆయన రచనలు ఇతర భాషల్లోకి కూడా అనువదింపబడ్డాయి. ఆయన రాసిన గ్రంథాల్లో వాఘీరా (అజంతా గుహల గురించి), సర్పశాస్త్రం, కవిద్వయం (పోతన శ్రీనాధుడు) దేవీ భాగవతం, భాగవతావతరణం వంటివి కూడా ప్రసిద్ధమైనవి. ఆంధ్రప్రదేశ్, కేంద్ర సాహిత్య అకాడమీ శాస్త్రిగారి రచనలను శ్లాఘిస్తూ బహుమతులను అందజేశాయి. 1978 జనవరి 3వ తేదీన ఆయన కాలధర్మం చెందారు. ఆయన కుమారుడు సుబ్రహ్మణ్య శాస్త్రి నోరి నరసింహ శాస్త్రి చారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేసి ఎన్నో ఆధ్యాత్మిక గ్రంథాలను ప్రచురించారు.. ఆర్ష, సంస్కృతీ సంప్రదాయాల గురించి విశేషంగా ప్రచారం చేస్తున్నారు. ఏటా నరసింహశాస్త్రి గారి జయంతిని నిర్వహించి ఏటా ఒక్కొక్క పండితుణ్ణి సన్మానిస్తున్నామన్నారు. ఇంతవరకూ నోరి నరసింహశాస్త్రి ట్రస్టు పురస్కారాలను అందుకున్న వారిలో రావూరి భరద్వాజ, ముదిగొండ శివప్రసాద్, కపిలవాయి లింగమూర్తి, ధారా రామనాథ శాస్త్రి, అనుమాండ్ల భూమయ్య, రవ్వాశ్రీహరి, అక్కిరాజు రమాపతిరావు, గొల్లపూడి మారుతీరావు, వెలగా వెంకటప్పయ్య, రావి గౌరీ నాగేశ్వరీదేవి, ఓగేటి ఇందిరాదేవి, ఎంవిఆర్ శాస్త్రి, కసిరెడ్డి వెంకటరెడ్డి, పోతుకూచి సాంబశివరావు, గరిమెళ్ళ సోమయాజులు, మంగళగిరి ప్రమీలా దేవి, చింతల పాటి నరసింహ దీక్షిత శర్మ కోడూరు భాస్కరరెడ్డి, ప్రభృతులు ఉన్నారు.నరసింహ శాస్త్రి గారి 120వ జయంతి సందర్భంగా 2019 సంవత్సరానికి శ్రీ పాదుక కొల్లూరు అవతార శర్మగారికి నరసింహశాస్త్రి గారి పురస్కారాన్ని అందజేస్తారు. ప్రోత్సాహక పురస్కారాన్ని రాంభట్ల వేంకటరాయ శర్మగారికి అందజేస్తారు. బుధవారం (6.2.19) సాయంత్రం హైదరాబాద్ త్యాగరాజ గానసభలో రిటైర్డ్ జస్టిస్ ఎ రామలింగేశ్వరరావు అధ్యక్షతన జరిగే పురస్కారాలను అందజేస్తామని నోరి సుబ్రహ్మణ్య శాస్త్రి ఒక ప్రకటనలో తెలిపారు.



వైద్య ఆరోగ్యశాఖకు రూ.10,032 కోట్లు



అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి యనమల రామకృష్ణుడు మంగళవారం శాసనసభలో ప్రవేశపెట్టిన 2019-20 బడ్జెట్‌లో రాష్ట్రవైద్య ఆరోగ్యశాఖకు గత ఏడాది కంటే 18.53 శాతం అదనపు నిధులతో రూ. 10,032 కోట్లు కేటాయిస్తున్నటు ప్రకటించారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో ఈశాఖకు రూ.8,463.51 కోట్ల నిధులు మంజూరు చేయగా, ఆశాఖలో వివిధ కార్యక్రమాల అమలు చేయడంతోపాటు అదనపు నిధులను ఖర్చుచేయడంతో రూ.8,910.18 కోట్లు ఖర్చు అయ్యింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజారోగ్యాన్ని మరింత మెరుగైన స్థితికి తీసుకురావాలన్న ఉద్దేశంతోనే కాకుండా చిన్నపాటి ఖర్చులను కూడా తగ్గించుకోవాలన్న సంకల్పంతో అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేయడం ప్రారంభించారు. ఎన్టీఆర్ వైద్యసేవ పథకం ద్వారా రూ.5,330 కోట్లను 12 లక్షల మంది వ్యాధిగ్రస్తులకు ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.2.5 లక్షల నుండి రూ.5 లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. 2014-15 తో పోలిస్తే ఈ బడ్జెట్ కేటాయింపులు రెట్టింపు కావడం విశేషం.

రాష్ట్ర అటవీశాఖకు ఈ ఏడాది కేటాయింపులను తగ్గిస్తూ మంత్రి యనమల బడ్జెట్‌లో ప్రతిపాదనలను సిఫార్సు చేశారు. గత ఏడాది రూ.523.77 కోట్లు కేటాయించగా దానిలో 463.45 కోట్లు మాత్రమే నిధులను ఖర్చు చేసింది. దీంతో కేటాంపులతో పోలిస్తే నిధులు మిగులు ఉండటంతో 2019-20 ఆర్థిక సంవత్సరానికి -6.08 శాతం నిధుల్లో కోత విధించారు. పర్యావరణం, అటవీ, సైన్స్‌అండ్ టెక్నాలజీశాఖలకు ఈ బడ్జెట్‌లో రూ.491.93 కోట్లను కేటాయించారు.

ప్రజాపంపిణీ వ్యవస్థకు ఊతం

రాష్ట్రప్రజాపంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి వీలుగా రాష్ట్రప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.3,763.42 కోట్ల నిధులు మంజూరు చేసింది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 7.67 శాతం అధిక నిధులను కేటాయించింది. రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పౌష్టిక ఆహారాన్ని అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం నూతన విధానాలను, ఆన్‌లైన్ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంతో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ప్రజాపంపిణీ వ్యవస్థలో కేవలం 2.68 కోట్ల మంది మాత్రమే లబ్ధిచేకూర్చగా, రాష్ట్రప్రభుత్వం అదనంగా 1.52 కోట్ల మందికి ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకుంది. కొత్తగా 24 లక్షల కొత్త రేషన్‌కార్డులను జారీ చేసింది.

14న బసవతారకం క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు శంకుస్థాపన



అమరావతి, ఆంధ్రప్రభ : అమరావతిలో బసవ తారకం క్యానర్సర్ ఇన్‌స్టిట్యూట్ శంకుస్థాపనకు ముహూర్తం ఖరారు అయింది. ఈ నెల 14న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తుళ్లూరు లో ఈ ఆసుపత్రి నిర్మాణానికి ఉదయం 8గంటలకు భూమి పూజ చేయనున్నారు. ఇప్పటికే ప్రభుత్వం క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణానికి 15ఎకరాల భూమిని కేటాయించింది. మంగళవారం అసెంబ్లీ సమావేశాలకు వచ్చిన బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో చైర్మన్ , మేనేజింగ్ ట్రస్టీ, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మంత్రులకు, ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలను కలిసి ఆసుపత్రి శంకుస్థాపన కార్యక్రమానికి ఆహ్వానించారు.

సంక్షేమాంధ్ర లక్ష్యంగా బడ్జెట్

ఎస్సీ సబ్‌ప్లాన్‌కు రూ.14,367 కోట్లు

అమరావతి, ఆంధ్రప్రభ : నవ్యాంధ్ర ప్రదేశ్‌లోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా చంద్రబాబు ప్రభుత్వం తాజా బడ్జెట్ కేటాయింపులను చేపట్టింది. స్త్రీ, శిశు, దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమం కోసం గత ఏడాది కంటే 13.32 శాతం అధిక నిధులతో రూ.3,408.66 కోట్లను కేటాయించడం జరిగింది. రాష్ట్రంలోని మెజారిటీ వర్గాలకు ధీటుగా మైనారిటీలు కూడా రాణించాలన్న సంకల్పంతో గతంలో ఎన్నడూలేని విధంగా రూ.1,308.73 కోట్లను చంద్రబాబు సర్కార్ కేటాయించింది. ముఖ్యంగా దళిత, గిరిజన జాతుల సమగ్రాభివృద్ధి కోసం దేశానికే ఆదర్శవంతమైన సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో ఎస్సీ సబ్‌ప్లాన్‌కు రూ.14,367 కోట్లు, ఎస్టీ సబ్‌ప్లాన్‌కు రూ.5,385 కోట్లను కేటాయింపులు జరిపి అణగారిన జాతుల జీవితాల్లో నూతన వెలుగులను నింపింది. యువతపైనే రాష్ట్ర భవిష్యత్ ఆధారపడి ఉందని గ్రహించిన పాలకులు 45 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని నిర్ణయించడంతోపాటు నైపుణ్య శిక్షణలను పెంపొందించేందుకు రూ.458.66 కోట్లను కేటాయించి స్వయం ఉపాధి దిశగా వారిని ప్రోత్సహించే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది.

ఆహార శుద్ధి పరిశ్రమలతో

రైతుల ఆదాయం రెట్టింపు: మంత్రి అమర్నాథరెడ్డి

అమరావతి, ఆంధ్రప్రభ : ఆహారశుద్ధి పరిశ్రమలతో రైతుల ఆదాయం రెట్టింపు అవుతుందని పరిశ్రమల శాఖా మంత్రి ఎన్ అమర్నాథ రెడ్డి అన్నారు. మంగళవారం సచివాలయంలోని నాలువ బ్లాక్ సమావేశ మందిరంలో రాష్ట్రంలోని ఫుడ్ పార్కు పనుల పురోగతిపై మంత్రి ఫుడ్ పార్కుల యాజమాన్యాలు, ఫుడ్ ప్రాసెసింగ్ సీఈవో వైయస్ ప్రసాద్, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్‌కు ఎక్కువ అవకాశాలున్నాయన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను స్థాపించడం వల్ల రైతుల ఆదాయం రెట్టింపు అవుతుందన్నారు. అందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిశ్రమలపై ప్రత్యేక దృష్టిసారించారన్నారు. ప్రత్యేక పాలసీని తీసుకురావడం ద్వారా పారిశ్రామిక వేత్తలు పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. ఆర్థికంగా కష్టాల్లో ఉన్నప్పటికీ రైతుల ఆదాయం రెట్టింపుచేసి ఆహార శుద్ధి పరిశ్రమలకు సబ్సిడీలు ఆలస్యం కాకుండా ఇస్తున్నామన్నారు. 2014 నుండి ఇప్పటి వరకు రాష్ట్రంలో ఆహార శుద్ధి పరిశ్రమలకు రూ. 350 కోట్ల సబ్సిడీ విడుల చేశామని తెలిపారు. కాబట్టి ఫుడ్ పార్కులను త్వరితగతిన అభివృద్ధి చేయాలని, ఏమైనా ఆటంకాలు ఎదురైతే వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు తాను చొరవ చూపుతానని హామీ ఇచ్చారు. దీనికి ఫుడ్ పార్కుల యాజమాన్యాల నుండి సహకారం అవసరమని తెలిపారు. ఉత్తర కోస్తాలో జీడిపప్పు యూనిట్లు ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్నాయన్నారు. అందుకే ఈ యూనిట్లు స్థాపించేవారికి 25 శాతం సబ్సిడీ ఇవ్వాలనే ప్రతిపాదనను పరిశీలిస్తున్నామని మంత్రి వెల్లడించారు.

సర్వం కల్తీల మయం!

మండలిలో ఎమ్మెల్సీ శమంతకమణి

అమరావతి, ఆంధ్రప్రభ : ప్రజలు తీసుకునే ఆహారం అంతా కల్తీల మయం అయిందని, దీని నియంత్రణకు ప్రభుత్వం తీసుకున్న చర్యలేంటో చెప్పాలని ఎమ్మెల్సీ శమంతకమణి మంగళవారం మండలిలో ప్రశ్నించారు. ఆహారంలో పోషక విలువలు పెంపు పథకాల్లో అవినీతి చోటుచేసుకుంటుందంటూ ధ్వజమెత్తారు. పాలు, కారం, పసుపు, కందిపప్పు, నూనె, నెయ్యి అన్ని కల్తీల మయం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బూజు పట్టిన చికెన్, మటన్ తినడం వల్ల ప్రజలకు అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనే దుస్థితి నెలకొందన్నారు. ప్రధానంగా విజయవాడకల్తీలకు అడ్డాగా మారిందని ఆరోపించారు. కల్తీ ఆహార పదార్థాల వల్ల మానవ జీవన ప్రమాణాలు నానాటికి దిగజారే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ల సంఖ్య తక్కువగా ఉందంటూ ఆ శాఖ అధికారులు తనిఖీల జోలికే వెళ్లడం లేదని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం ఫుడ్ ఇన్‌స్పెక్టర్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఇదే అంశంపై మరో ఎమ్మెల్సీ వితపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మరో 15ఏళ్ళ తర్వాత ప్రతీ ఒక్కరూ ఏదో ఒక అనారోగ్య సమస్యను ఎదుర్కొనే పరిస్థితి ఉందంటూ వైద్య నిపుణులు చేస్తున్న హెచ్చరికను సభ దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుతం క్యాన్సర్ కేసులు అధికంగా నమోదవుతున్నాయని, దీనిని గుర్తించడంతో పాటు ఎందుకు ఇలా జరుగుతుందో కారణాలు అన్వేషించాలని సూచించారు. ఈ అంశంపై పౌరసరఫరాల శాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ ఈ అంశం వైద్య,ఆరోగ్య శాఖ పరిధిలోకి వస్తుందని తెలిపారు. కాగా రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు కాకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమర్నాథ్‌రెడ్డి ఘాటైన ఆరోపణలు చేశారు.



6న మండలి చైర్మన్ ఎన్నిక నోటిఫికేషన్

ఆంధ్రప్రదేశ్ శాసనమండలి చైర్మన్ ఎన్నిక సంబంధించి బుధవారం నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. ఆ వెంటనే నామి నేషన్ ల స్వీకరణ , పరిశీలన చేసి 7న చైర్మన్ ను అధికారికంగా ప్రకటించనున్నారు. గతంలో మండలి చైర్మన్ గా నియమితులైన ఎన్.ఎం.డి ఫారుఖ్ ను మంత్రి వర్గంలో తీసుకోవడంతో చైర్మన్ ఎంపిక అనివార్యంగా మారింది. ఇప్పటి వరకు ఎమ్మెల్సీ , విప్ గా వ్యవహరిస్తున్న షరీఫ్ ను కొత్త చైర్మన్ గా నియమించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవం కానుంది. ఈ నెల 7వ తేది ఉదయం 11గంటలు ఎమ్మెల్సీ షరీఫ్ మండలి చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించనున్నారు.

నియంతృత్వానికి రోజులు

దగ్గరపడ్డాయి



- ప్రధాని మోడీపై టీడీపీ ఎంపీల తీవ్ర విమర్శలు
- జంతర్ మంతర్ వద్ద ఎంపీ మాగంటీ బాబు దీక్ష


న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ప్రత్యేక హోదా సహా విభజన హామీల అమలు విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును నిరసిస్తూ తెలుగుదేశం పార్టీ ఎంపీలు దేశ రాజధానిలో నిరసన ప్రదర్శన చేపట్టారు. తొలుత పార్లమెంట్ ఆవరణలోని మహాత్మ గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టిన ఎంపీలు, ప్రత్యేక హోదా తమ హక్కంటూ నినదించారు. అనంతరం 1వ నెంబర్ గేట్ దగ్గర ఎంపీలు లోపలకు వెళ్లే మార్గాన్ని అటకాయిస్తూ కాసేపు ఆందోళన చేశారు. అనంతరం అక్కణ్ణుంచి ఎంపీలంతా జంతర్ మంతర్ దీక్షా స్థలికి చేరుకున్నారు. పుట్టిన రోజు సందర్భంగా ఏలూరు ఎంపీ మాగంటి వెంకటేశ్వర రావు (బాబు) దీక్ష చేపట్టాలని ముందే నిర్ణయించుకున్నారు. తమ పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం గతంలో పుట్టినరోజు నాడు దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే. అదే బాటలో తాజాగా ఎంపీ కే. రామ్మోహన్ నాయుడు పార్లమెంట్ ఆవరణలోనే తన పుట్టినరోజు నాడు దీక్ష చేశారు. ఇప్పుడు మాగంటి బాబు కూడా వారి బాటలో ఒక్కరోజు దీక్ష చేపట్టారు. ఆయన దీక్షకు మద్దతుగా సొంత నియోజకవర్గం నుంచి సుమారు 500 మంది నేతలు, అభిమానులు, కార్యకర్తలు ఢిల్లీ చేరుకున్నారు. దీంతో దీక్షా స్థలం జనంతో కిక్కిరిసిపోయింది. మిగతా ఎంపీలు అక్కడికి చేరుకోవడంతో మరింత ఆవేశంతో బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రత్యేక హోదా ఇచ్చి తీరాల్సిందేనని డిమాండ్ చేశారు. అనంతరం కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతి రాజు, రామ్మోహన్ నాయుడు, బుట్టా రేణుక తదితరులు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింప జేశారు. అనంతరం ఎంపీలందరూ మీడియాతో మాట్లా డారు. 60వ ఏట అడుగుపెడుతూ జన్మదిన వేడుకలను కుటుంబ సభ్యులతో ఘనంగా నిర్వహించుకోవాల్సిం దిపోయి ఇలా ఎండలో కూర్చుని ధర్నా చేయాల్సిన ఖర్మ ఎందుకొచ్చిందని మాగంటి బాబును ఉద్దేశించి మాట్లాడుతూ ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి అన్నారు. దున్న పోతు మీద వర్షం కురిసిన చందంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు.

కొడుకును ప్రధాన మంత్రిని చేయాలన్న ఆలోచనతో రాష్ట్రాన్ని ముక్కలు చేసిన సోనియా గాంధీ తర్వాత ఆమె ముక్కలైందని జేసీ వ్యాఖ్యానించారు. మరో 20, 25 ఏళ్లు రాష్ట్రంలో కాంగ్రెస్ ఊసే ఉండదని సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రత్యేక హోదా ఇస్తారన్న ఆశతోనే రాహుల్ గాంధీని ప్రధానిని చేయడం కోసం చంద్రబాబు ఉరుకులు పరుగులు పెడు తున్నారని దివాకర్ రెడ్డి వ్యాఖ్యానించారు. కానీ చంద్రబాబు ఆశలు అడియాసల వుతాయనిపిస్తోందని ఆయన అన్నారు. రైల్వే జోన్ వల్ల రాష్ట్రానికి ఏమీ లాభం లేదని మరోమారు వ్యాఖ్యానించి జేసీ కలకలం సృష్టించారు. జోన్ ఇస్తే మహా అయితే రూ. 10 కోట్ల విలువైన ఒక భవంతి, ఓ పది మంది గుమస్తా ఉద్యోగాలు వస్తాయన్నారు. జోన్ ఇవ్వడం వల్ల కేంద్రానికి ఏమాత్రం నష్టం లేదని తెలిపారు.రాష్ట్ర ప్రతిపక్ష నేత జగన్మోహన్ రెడ్డికి కూడా దివా కర్ రెడ్డి చురకలు వేశారు. జగన్ ఒక తిక్కోడని, చం ద్రబాబు పెన్షన్లతో ఆబాల గోపాలం ఆనందంలో ఉంటే జగన్ విమర్శిస్తున్నారని మండిపడ్డారు. పెన్షన్లకు చంద్ర బాబు డబ్బులు ఎక్కణ్ణుంచి తీసుకొస్తారో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు.చంద్రబాబు అందించే సంక్షేమ ప్రభుత్వం కావాలా లేక హైదరాబాద్‌లో చిప్పకూడు తినే వ్యక్తి అందించే పాలన కావాలో ప్రజలే తేల్చుకోవాలని అంటూ జేసీ జగన్మోహన్ రెడ్డిపై పరోక్షంగా మండిపడ్డారు.

అప్పు చెల్లించలేదనే

హతమార్చారు!

- జయరామ్ హత్యకేసు దర్యాప్తు ముగింపు
- రాకేష్‌రెడ్డి సహా ఇద్దరి అరెస్టు
- శిఖా చౌదరి పాత్రలేదన్న ఎస్పీ త్రిపాఠి
- ఇద్దరు పోలీసుల పాత్రపై తెలంగాణా ప్రభుత్వానికి సమాచారం



అమరావతి, ఆంధ్రప్రభ: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఎన్నారై పారిశ్రామికవేత్త చిగురుపాటి జయరామ్ హత్య కేసు దర్యాప్తుకు పోలీసులు తెరదించారు. తీసుకున్న అప్పు తిరిగివ్వకపోవడంతోనే పథకం ప్రకారం జయరామ్‌ను హత్య చేసినట్లు నిర్ధారించారు. హైదరాబాద్‌కు చెందిన రాకేష్ రెడ్డిని ప్రధాన నిందితునిగా పేర్కొని అరెస్టు చేయడంతో పాటు సహకరించిన ఆరోపణలపై డ్రైవర్ శ్రీనివాస్‌ను కూడా అరెస్టు చేశారు. తొలి నుంచి వస్తున్న ఆరోపణలకు బలం చేకూర్చుతూ జయరామ్ మేనకోడలు పులివర్తి మాధురి అలియాస్ శిఖా చౌదరికి హత్యతో సంబంధం లేదని నిర్ధారించారు. నందిగామలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల అరెస్టును కృష్ణా ఎస్పీ సర్వశ్రేష్ఠ త్రిపాఠీ నిర్ధారించారు. హత్యకు సంబంధించిన పూర్వాపరాలను వెల్లడించారు. ఈ నెల 1న నందిగామ మండలం ఐతవరం సమీపంలో జయరామ్ మృతదేహం వెలుగు చూసిన తర్వాత సమాచారాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేసి నందిగామ రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆపై పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు మృతదేహం అప్పగించడంతో పాటు అన్ని కోణాల్లో దర్యాప్తు చేశామన్నారు. ఇందు కోసం ఆరు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి హైదరాబాద్‌లో సోదాలు నిర్వహించామన్నారు. ఈ క్రమంలోనే పలువురిని అదుపులోకి తీసుకొని విచారించామని, జయరామ్ కుటుంబ సభ్యుల నుంచి వివరాలు కూడా సేకరించామన్నారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం, పంచాయితీలు చేసే రాకేష్‌రెడ్డి హత్యకు సూత్రధారిగా దర్యాప్తులో నిర్ధారణ అయ్యిందన్నారు. గతంలో ఫ్యాక్టరీ వివాదం జరిగినప్పుడు రెండు దఫాలుగా రూ.6కోట్లు రాకేష్‌రెడ్డి వద్ద జయరామ్ అప్పుగా తీసుకున్నట్లు తెలిపారు. అప్పట్లో అమెరికా నుంచి జయరామ్ సూచన మేరకు శిఖా చౌదరిని కలవడం జరిగిందని, ఇప్పుడు వారిద్దరి మధ్య సంబంధాలు లేవని ఎస్పీ చెప్పారు. పలుమార్లు తీసుకున్న సొమ్ము తిరిగి ఇవ్వాలంటూ జయరామ్‌పై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే ఇండియాకు వచ్చిన జయరామ్‌ను మహిళ పేరిట సిమ్ తీసుకొని చాటింగ్ ద్వారా గత నెల 30న జూబ్లిహిల్స్‌లోని తన ఇంటికి రప్పించి నిర్బంధించారన్నారు. తన వద్ద తీసుకున్న రూ.6 కోట్లను వడ్డీతో సహా చెల్లించాలని ఒత్తిడి చేసినట్లు విచారణలో తేలిందన్నారు.

ఈ క్రమంలోనే డబ్బుల కోసం జయరామ్ స్నేహితులకు ఫోన్ చేయించగా కేవలం రూ.6లక్షలు మాత్రమే సమకూర్చినట్లు చెప్పారు. 31వ తేదీ ఉదయం 11గంటల వరకు ఎదురు చూసినప్పటికీ డబ్బుల వ్యవహారం తేలకపోవడంతో రాకేష్‌రెడ్డి దాడి చేశారన్నారు. ముఖంపై బలంగా కొట్టడంతో సోఫాపై పడిన జయరామ్‌ను ముఖం అదిమిపట్టి ఊపిరాడకుండా చేసి హత్య చేసినట్లు తెలిపారు. అక్కడి నుంచి నందిగామ వద్దకు తీసుకొచ్చి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో కారుతో సహా మృతదేహాన్ని అక్కడే వదిలేశారని, బస్సులో రాకేష్‌రెడ్డి తిరిగి హైదరాబాద్ వెళ్లిపోయాడని చెప్పారు. ఇందుకు సంబంధించి టోల్‌గేట్ల వద్దనున్న సీసీటీవీ ఫుటేజ్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఎస్పీ ఆగ్రహం

జయరామ్ హత్య సమయంలో పలు వివరాలు అడిగిన విలేకరులపై ఎస్పీ త్రిపాఠి ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరిని తప్పించారనే ఆరోపణలపై తమ విచారణలో వెలుగు చూసిన ఆధారాలకు అనుగుణంగానే నిందితులను అరెస్టు చేశామన్నారు. దర్యాప్తులో శిఖా చౌదరి పాత్ర ఉన్నట్లు నిర్ధారణ కాలేదన్నారు. ఇంకా విచారణ ముగించలేదని చెపుతూ మరెవరి పాత్ర అయినా ఉంటే తప్పకుండా అరెస్టు చేస్తామని, వదలమని స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో నందిగామ డీఎస్పీ బోస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తలొగ్గండి!

(మొదటిపేజీ తరువాయి)

రాజీవ్ కుమార్ ఎలాంటి కారణాలు చూపలేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గగోయ్ నేతృత్వంలోని జస్టిస్ దీపక్ గుప్తా, జస్టిస్ సంజీవ్ ఖన్నాలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఒక వేళ శారదా చిట్ ఫండ్ స్కాంకు సంబంధించిన కీలక ఆధారాలను సీపీ రాజీవ్ కుమార్ నాశనం చేశారని తేలితే ఆయనపై కఠిన చర్యలు తీసుకునేలా తామే ఆదేశిస్తామని స్పష్టం చేసింది. సీబీఐ విచారణకు రాజీవ్ పూర్తిగా సహకరిస్తారని తాము భావిస్తున్నట్లు వెల్లడించింది.

సీబీఐ తరపున వాదనలు వినిపించిన అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్,సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా రాజీవ్ కోల్‌కతా సీపీ రాజీవ్ కుమార్ సీబీఐ విచారణకు సహకరించడం లేదని ఆరోపించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు శారదా చిట్ ఫండ్ స్కాంపై సీబీఐ దర్యాప్తు చేస్తుండగా.. గతంలో దర్యాప్తు అధికారిగా ఉన్న కోల్‌కతా సీపీ ఈ కేసుకు సంబందించిన వివరాలను సీబీఐతో పంచుకునేందుకు ఇష్టపడటం లేదని తెలిపారు. సీపీని విచారించేందుకు కోల్‌కతాలోని ఆయన నివాసానికి వెళ్లిన 25 మంది సీబీఐ అధికారులను అక్కడి పోలీసులు బలవంతంగా బస్సులో ఎక్కించి పోలీస్ స్టేషన్‌కు తరలించారని వివరించారు. సీబీఐ జాయింట్ డైరెక్టర్ వికాస్ సింగ్ నివాసాన్ని కూడా బెంగాల్ పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకొవడం గర్హనీయమైన చర్యగా పేర్కొన్నారు.పశ్చిమ బెంగాల్ పోలీసుల తరపున న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ సుప్రీంకోర్టులో వాదనలు వినిపిస్తూ.. అటార్నీ జనరల్ వ్యాఖ్యలను ఖండించారు. కోల్‌కతా పోలీసులను వేధించేందుకే కేంద్ర ప్రభుత్వం సీబీఐని వాడుకుంటోందని ఆరోపించారు. చిట్‌ఫండ్ స్కాంపై విచారణకు ఏర్పాటు చేసిన సిట్ కు ప్రస్తుత కోల్‌కతా సీపీ సారథ్యం వహించారని.. విచారణ నిస్పక్షపాతంగా జరిగినట్లు నాడు సర్వోన్నత న్యాయస్థానమే కితాబిచ్చిందని గుర్తు చేశారు. ఈ కేసులో ఇరువర్గాల వాదనలు విన్న ధర్మాసనం వివాదానికి గల పూర్వపరాలు గురించిన వివరాలను ఈ నెల 18 లోగా తెలియ జేయాలని పశ్చిమబెంగాల్ డీజీపీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది..



కోల్‌కతా సీపీపై క్రమశిక్షణా చర్యలు..?

కోల్‌కతా సీపీ రాజీవ్ కుమార్‌పై వేటు పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. సీపీపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పశ్చిమబెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. మమతా బెనర్జీతో పాటు సీపీ రాజీవ్ కుమార్ కూడా ధర్నాలో కూర్చున్నట్లు తమకు సమాచారం అందిందని.. ఇలాంటి విషయాలు ప్రవర్తనా నియమావళికి వ్యతిరేకమని స్పష్టంచేసింది. అఖిల భారత సర్వీసుల ప్రవర్తనా నియమావళికి ఇలాంటివి విరుద్ధమని హోంశాఖ తన లేఖలో పేర్కొంది.

మమత దీక్ష విరమణ

కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్‌ను అరెస్ట్ చేయవద్దంటూ సుప్రీం కోర్టు ఇచ్చినఆదేశాలను పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ స్వాగతించారు. ధర్మాసనం నిర్ణయం తమ నైతిక విజయంగా అభివర్ణించారు. మోడీకి వ్యతిరేకంగా వెళ్లేందుకు ఎవరూ సాహసించకున్నా.. రాజ్యాంగాన్ని కాపాడే ఉద్దేశంతో తాము ఐక్య పోరాటానికి శ్రీకారం చుట్టామన్నారు. మేమెప్పుడూ చట్టాన్ని గౌరవిస్తాం. ప్రజాస్వామ్య మూలాలను నాశనం చేయాలని ఎవరైనా ప్రయత్నిస్తే పోరాటం చేస్తాం.

శారదాచిట్ ఫండ్ స్కాంలో సీబీఐ విచారణకు బెంగాల్ పోలీసులు మొదటి నుంచి సహకరిస్తూనే ఉన్నారని...రాజకీయ కక్షసాధింపుతోనే మోడీ ప్రభుత్వం సీబీఐని వాడుకుంటోందని తెలిపారు.

ఏపీ పోలీసులపై

నమ్మకం లేదు

- జయరాం భార్య పద్మశ్రీ సంచలన ఆరోపణ
- విలువైన వస్తువులు మాయమయ్యాయని హైదరాబాద్ పోలీసులకు ఫిర్యాదు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఎక్స్‌ప్రెస్ టీవీ అదినేత, కోస్టల్ బ్యాంకు డైరెక్టర్ హత్యకేసును దర్యాప్తు చేయడంలో ఏపీ పోలీసులు విఫలమయ్యారని జయరామ్ సతీమణి పద్మశ్రీ సంచలన ఆరోపణ చేశారు. హత్య కేసులో శిఖాచౌదరి ప్రమేయం లేదని దాదాపుగా క్లీన్ చిట్ ఇచ్చిన నేపథ్యంలో జయరాం భార్య పద్మశ్రీ జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్లోతన తన అడ్వకేట్, తండ్రి పిచ్చయ్యాచౌదరితో కలిసి వెళ్లి ఫిర్యాదు చేశారు. జయరాం హత్య హైదరాబాద్‌లోనే జరిగిందని ఇక్కడే విచారణ జరపాలని పద్మశ్రీ పోలీసుల కిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. శిఖాచౌదరి, మరో వ్యక్తి కలిసి జయరాం బెడ్‌రూమ్‌లోకి వచ్చి విలువైన వస్తువులు తీసుకెళ్లారని పద్మశ్రీ పోలీసులకు అందజేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. శిఖాచౌదరి ఏపీ పోలీసులను ప్రభావితం చేసి ఉండొచ్చన్న విలేకరుల ప్రశ్నకు మాత్రం అయి ఉండొచ్చు అని పద్మశ్రీ సమాధానమిచ్చింది. తన భర్త జయరాంను అత్యంత కిరాతకంగా హత్య చేశారని ఆ ఫిర్యాదులో పేర్కొంది. తెలంగాణ పోలీసుల మీద నాకు అపారమైన నమ్మకం ఉందని ఆమె ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా, హత్య కేసులో శిఖా చౌదరి పాత్ర ఏమిటన్నదానిపై అది పోలీసుల దర్యాప్తులో తేలే అంశమని నర్మగర్భంగా చెప్పింది. శిఖాచౌదరి మరో వ్యక్తితో వచ్చి జయరాం బెడ్‌రూమ్‌లో జొరబడి పదెకరాల ల్యాండ్‌కు సంబంధించి, జయరాం కంపెనీలకు చెందిన ఇతరత్రా డాక్యుమెంట్లను తీసుకుని వెళ్లిందని పద్మశ్రీ పేర్కొంది. అదే క్రమంలో శిఖాపై అనుమానం కలిగించే రీతిలో ఏపీ పోలీసులను శిఖాచౌదరి ప్రభావితం చేసిందన్న పదం వాడటం ఇక్కడ గమనించదగిన పరిణామం.

పోలీస్ ప్రమోషన్లపై శ్వేతపత్రం

ఓటమి భయంతోనే జగన్ అసత్య ఆరోపణలు: హోమంత్రి చిన్నరాజప్ప

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో జరిగిన పోలీస్ ప్రమోషన్లలో ఎలాంటి అవకతవకలు అక్రమాలు జరగలేదని, నిబంధనల ప్రకారమే పదోన్నతులు జరిగాయని అవసరమైతే శ్వేతపత్రం విడుదలకు కూడా సిద్ధమేనని హోం శాఖ మంత్రి చిన్నరాజప్ప అన్నారు. విపక్ష నేత జగన్ ఈసీకి చేసిన ఫిర్యాదులపై ఆయన మండిపడ్డారు.

మంగళవారం సాయంత్రం సచివా లయంలోని ఆయన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన పెన్షన్లు, నిరుద్యోగ భృతి పెంపు, మహిళలకు పసుపు-కుంకుమ పథకం కింద రూ.10వేలు తదితర కార్యక్రమాలతో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ తిరిగి విజయం సాధిస్తుందని తాను ఓటమి పాలవుతాననే భయంతోనే జగన్ అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. ప్రమోషన్లకు సంబంధించి సుప్రీం కోర్టు మార్గ దర్శకాల ప్రకారమే చేయడం జరిగిందన్నారు. డీజీపి, ఇంటిలిజెన్స్ చీఫ్‌ల పై జగన్ చేసిన ఆరోపణలను ఆయన తిప్పి కొట్టారు. కులాలకు, మతాలకు అతీతంగా ఉద్యోగులు పనిచేస్తారన్న విషయాన్ని విపక్ష నేత గుర్తెరగాలన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడడంలో డీజీపీ సమర్థ వంతంగా పనిచేస్తున్నాడని మంత్రి చిన్నరాజప్ప కితాబిచ్చారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే జగన్ సరికొత్త వివాదాన్ని తెరపైకి తెచ్చారని ఆరోపించారు. జగన్ ఈసీకి చేసిన ఫిర్యాదులపై చర్చించడానికి సిద్ధమేనని హోంమంత్రి సవాలు విసిరారు. కేంద్ర ప్రభుత్వం అగ్రకులాలకు ప్రకటించిన 10 శాతం రిజర్వేషన్లు 5 శాతం కాపులకు కేటాయిస్తూ అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టనున్నట్లు చిన్న రాజప్ప వెల్లడించారు.

ఆర్టీసీ చర్చలు సఫలం

(మొదటిపేజీ తరువాయి)

కె.అచ్చెన్నాయుడు చర్చలు జరిపారు. కార్మికులకు తాత్కాలికంగా 25 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చేందుకు అంగీకరించారు. భవిష్యత్‌లో ఎన్జీవోలతో సమానంగా ఫిట్‌మెంట్ ఇచ్చేందుకు మంత్రి హామి ఇవ్వడంతో సమ్మె విరమిస్తున్నట్లు ఐకాస నేతలు తెలిపారు. దీని వల్ల ప్రభుత్వంపై రూ. 750 కోట్ల భారం పడుతుంది. ఇప్పటికే సంస్థ నష్టాల్లో ఉన్న సంగతి తెలిసిందే. యాజమాన్యం పొదుపు చర్యల వల్ల నష్టాలను తగ్గిస్తూ వస్తున్నారు. డీజిల్ ధరలు పెరగడంతో నష్టాలను తగ్గించుకోలేపోతున్న సంగతి విధితమే. ఆర్టీసీలో 62 శాతం ఉన్న ఆక్యుపెన్సీ రేటును 80 శాతానికి చేర్చడంతో సంస్థ కొంత ఇబ్బందుల నుంచి బయ టపడిందని ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. పాత బకాయిలను 2020 నాటికి చెల్లించాలని కార్మికులు కోరారని,దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. సంస్థ నష్టాల్లో ఉన్నా కూడా ప్రజలపై భారం మోపలేదన్నారు. ఈ చర్చల్లో సంస్థ వీసీ, ఎండీ సురేంద్రబాబు, ఇయు,కార్మిక పరిషత్ సహా 9 కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు.



న్యాయ పోరాటం చేస్తా



లండన్ : లిక్కర్‌కింగ్ విజయ్‌మాల్యాను భారత్ అప్పగింత ఫైల్‌పై బ్రిటన్ హోంమంత్రి ఆదివారం నాడు సంతకాలు చేయడంతో.. మాల్యాను భారత్‌కు రప్పించడానికి భారత్ ప్రభుత్వం కూడా చకాచకా పావుతు కుదుపుతోంది. తాజా పరిణామాలపై విజయ్‌మాల్యా స్పందిస్తూ.. బ్రిటన్ ప్రభుత్వం ఆర్డర్‌పై తాను సుదీర్ఘకాలం పాటు న్యాయపోరాటం చేస్తానని ట్వీట్ చేశారు. డిసెంబర్ 10,2018న వెస్ట్‌మినిస్టర్ మేజిస్ట్రేట్ కోర్టు మాల్యాను భారత్‌కు అప్పగించవచ్చునని తీర్పు ఇచ్చిన వెంటనే . తాను హైకోర్టు అప్పీలకు వెళదామనుకున్నానని, అయితే తాజాగా బ్రిటన్ హోంసెక్రటరీ తనను భారత్‌కు అప్పగించడానికి ఆమోదం తెలపడంతో తాను ఇక ఎలాంటి జాప్యం చేయకుండా హోంసెక్రటరీ ఆర్డర్‌ను సవాలు చేస్తూ పై కోర్టుకు వెళతానని ట్వీట్ చేశారు. కోర్టుకు దరఖాస్తు చేసుకున్నా తర్వాత ఇరువర్గాల వాదనలను కోర్టు వింటుందని, బ్రటిన్ హైకోర్టు అడ్మనిస్ట్రేటివ్ కోర్టులో ఈ విచారణకు కొన్ని నెలల సమయం పడుతుంది. ఇదిలా ఉండగా బ్రిటన్‌కు చెందిన జైరివాలా అండ్ కంపెనీ భాగస్వామి సరోస్ జైరివాలాకూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. బ్రిటన్ హైకోర్టులో మాల్యా అప్పీలుకు వెళితే కనీసం ఐదు నుంచి ఆరు నెలల సమయం పడుతుందన్నారు. బ్రిటన్ హైకోర్టులో కానీ, సుప్రీంకోర్టులో కానీ ప్రజాప్రయోజనాల కేసుకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తాయని.. మిగిలిన కేసులకు ఎక్కువ సమయం తీసుకుంటుందని వారు చెబుతున్నారు. ఇక మాల్యా విషయానికి వస్తే కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ పేరుతో వేలాది కోట్ల రూపాయల రుణాలుతీసుకొని ఎగ్గొట్టి బ్రిటన్‌లో తలదాచుకుంటున్నారు.

రేటింగ్‌కు గండి!

- మూడీస్ ఇన్వెస్టర్ సర్వీసెస్ హెచ్చరిక
- వరుసగా రెండు సంవత్సరాల పాటు ద్రవ్యలోటు పెరిగితే రేటింగ్ నెగెటివ్
- పొంచివున్న ప్రమాద ఘంటికలు



న్యూఢిల్లీ : కేంద్రంలోని నరేంద్రమోడీ సర్కార్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పెద్దెత్తున తాయిలాలు ప్రకటించడంతో భారత్ క్రెడిట్ రేటింగ్‌కు గండిపడుతుందని మూడీస్ ఇన్వెస్టర్ సర్వీసెస్ మంగళవారం నాడు హెచ్చరించింది. 2019-20 ఆర్థిక సంవత్సరం మధ్యంతర బడ్జెట్‌లో ప్రభుత్వం సన్నకారు రైతులకు ఆదుకునేందుకు ఏడాదికి రూ.6,000 నగదు మద్దతు ప్రకటించడంతో పాటు మధ్య తరగతికి పెద్దమొత్తంలో పన్ను రాయితీలు ప్రకటించడంతో ద్రవ్యలోటు ఏర్పడుతుంది. వరుసగా రెండు సంవత్సరాల పాటు ద్రవ్యలోటు ఏర్పడితే భారత్ క్రెడిట్ రేటింగ్‌లో కోత పడుతుందని మూడీస్ ప్రభుత్వానికి గుర్తు చేసింది.

వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ ఆర్థికమంత్రి పీయూష్‌గోయల్ 2019 మార్చితో ముగిసే ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు లక్ష్యం అంచనా కంటే కాస్తా ఎక్కువగా 3.6 శాతానికి ఎగబాకుతుందని చెప్పారు. అలాగే మార్చి 2020 నాటికి ఇది మరింత పెరిగి జీడీపీలో 3.6 శాతానికి ఎగబాకే అవకాశాలున్నట్లు ఆర్థికవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

ఈ ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు పెరిగిపోవడానికి ప్రధాన కారణం ప్రభుత్వం సంక్షేమ పథకాల కోసం పెద్దమొత్తంలో వ్యయం చేయడంతో పాటు మధ్యతరగతిని ప్రసన్నం చేసుకోవడానికి పన్నుల్లో పెద్దమొత్తంలో రాయితీలు ప్రకటించడంతో ద్రవ్యలోటు పెరిగిపోతుంది. అదేసమయంలో సావరిన్ రేటింగ్ నెగెటివ్ అవుతుందని మూడీస్ వివరించి చెప్పింది.

వరుసగా గత రెండు సంవత్సరాల నుంచి ద్రవ్యలోటు విపరీతంగా పెరిగిపోతోందని, తమ అంచనా ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం ద్రవ్యలోటు లక్ష్యం చేరుకోవడం అతి పెద్ద సవాలని పేర్కొంది. తమ అంచనా ప్రకారం మధ్య కాలికానికి కూడా పరిస్థితులు గాడినపడేపరిస్థితి కనిపించడం లేదని పేర్కొంది.

ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకులకు సరిపడేంత మూలధనం సమకూర్చలేకపోవడంతో కూడా క్రెడిట్ నెగెటివ్‌కు మారే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపింది. 2019-20 మధ్యంతర బడ్జెట్‌లో ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకులకు మూలధనం సమకూర్చే అంశం ప్రస్తావించలేదని గుర్తు చేసింది. అదే విధంగా గత ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో ప్రభుత్వరంగానికి చెందిన అతి పెద్ద నాన్ లైఫ్ బీమాకంపెనీలను విలీనం చేస్తామని ప్రకటించింది. ఈ బడ్జెట్‌లో దాని ఊసేలేదు. దీంతో ఈ మూడు బీమా కంపెనీల విలీనం ఉంటుందా లేదా అనేది ప్రశ్నగా మారిందని మూడీస్ ఇన్వెస్టర్ సర్వీసెస్ నోట్ వివరించింది.

మధ్యంతర బడ్జెట్‌లో రియల్‌ఎస్టేట్ రంగానికి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంది. దీంతో స్థిరాస్తి రంగానికి డిమాండ్ పెరుగుతుందని వెల్లడించింది.

అలాగే ప్రభుత్వరంగానికి చెందిన చమురు సహజ వాయువు కంపెనీల నుంచి పెద్దమొత్తంలో డివిడెండ్ సేకరించి అదే సమయంలో ఈ కంపెనీల నుంచి పెట్టుబడుల ఉపసంహరించాలని ప్రభుత్వం యోచిస్తోందని, దీంతో పాటు ఇంధనంతోపై సబ్సిడీలు ఇవ్వడం కూడా రేటింగ్‌కు నెగెటివ్‌కు దారి తీస్తుందని వివరించింది.

క్రెడిట్ రేటింగ్ పెరిగేందుకు దారి తీసే అంశాల విషయానికి వస్తే ప్రభుత్వం మౌలికరంగానికి చెందిన ప్రాజెక్టులపై పెద్దమొత్తంలో వ్యయం చేయడం ఒక్కటే క్రెడిట్ రేటింగ్ పెరగడానికి దారి తీస్తుందని ప్రభుత్వం మౌలికరంగంపై 2018 ఆర్థిక సంవత్సరం నుంచి 2019 ఆర్థిక సంవత్సరం వరకు మౌలికరంగంపై పెట్టుబడుల కోసం ఒక ప్రణాళికను రూపుదిద్దింది. వాటిలో ముఖ్యంగా జాతీయ రహదారులు, రైల్వేలపై పెద్దమొత్తంలో వ్యయం చేయాలని నిర్ణయించింది. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే లక్ష్యంతో రైతులకు, మధ్య తరగతికి వరాల జల్లు కురిపించారు. దీంతో బ్యాంకులు, గృహాలు తనఖా పెట్టుకొని రుణాలు ఇచ్చే కంపెనీల క్రెడిట్ అనుకూలంగా ఉంటుందని మూడీస్ నివేదికలో వెల్లడించింది.

మూడీస్ రేటింగ్ క్రెడిట్ నెగెటివ్ గురించి వివరిస్తూ.. వరుసగా గత రెండు సంవత్సరాల నుంచి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ద్రవ్యలోటు లక్ష్యాన్ని చేరుకోవడంతో విఫలం అవుతోందని, దీని వల్ల సావరిన్ క్రెడిట్ రేటింగ్ నెగెటివ్‌కు చేరుతుందని హెచ్చరిస్తోంది. ఇక్కడ ద్రవ్యలోటు గురించి వివరంగా చెప్పాలంటే సాధారణంగా ప్రతి ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్‌లో ద్రవ్యలోటు లక్ష్యం అంచనా వేసుకుంటారు. ఒక ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వానికి రెవెన్యూ ద్వారా సమకూరే ఆదాయం .. అదే సమయంలో ప్రభుత్వం చేసే వ్యయం. ప్రభుత్వానికి రెవెన్యూ తగ్గి.. వ్యయం పెరిగితే బాండ్ల ద్వారా నిధులు సేకరించుకుంటుంది. దాన్నే ద్రవ్యలోటు అంటారు.. అది మన జీడీపీలో ఎంత శాతం అనేది లెక్కగడతారు. ఈ ఆర్థిక సంవత్సరం ద్రవ్యలోటు జీడీపీలో 3.3 శాతానికి పరిమితం చేయాలనుకున్నా.. అదీ దాటిపోయి 3.4 శాతానికి చేరుకొనే అవకాశాలున్నాయి.. అదే విధంగా 2020 నాటికి ద్రవ్యలోటును 3 శాతం లక్ష్యంగా నిర్ణయించుకున్నా.. తాజా బడ్జెట్‌లో పెద్దమొత్తంలో మోడీ సర్కార్ వరాలు కురిపించడంతో ద్రవ్యలోటు లక్ష్యం అంచనా కంటే మరింత పెరిగి 3.6 శాతానికి చేరినా ఆశ్చర్యం లేదని ఆర్థికవేత్తలు అంటున్నారు.

ఒక వేళ రేటింగ్ నెగెటివ్ అయితే ఏమిటనే ప్రశ్నకు ... విదేశీ ఇన్వెస్టర్లు భారత్‌లో పెట్టుబడులు పెట్టడానికి వెనుకంజ వేస్తారు. అప్పుడు వృద్ధి రేటు నెమ్మదిస్తుంది. ఆర్థిక వ్యవస్థ కుదేలవుతుంది. సాధారణంగా మన ఆర్థికమంత్రులు.. గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీలను మచ్చిక చేసుకొని తమ దేశ రేటింగ్ పెంచాలని కోరుతుంటాయి. కాబట్టి ప్రభుత్వాలు ఓట్ల కోసం ఉదారంగా వరాలు ప్రకటించేముందు దేశసావరిన్‌రేటింగ్‌ను కూడా దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకుంటే బాగుంటుందనే ఆర్థికవేత్తల అభిప్రాయం.

వడ్డీ రేట్లలో కోత! ఎస్‌అండ్‌పీ అంచనా

ముంబై : వరుసగా గత కొన్ని నెల నుంచి ద్రవ్యోల్బణం అదుపులోకి వస్తుంటడంతో రిజర్వుబ్యాంకు వడ్డీరేట్లు తగ్గించడానికి అవకాశాలు మరింత మెరుగుపడ్డాయని ఎస్‌అండ్‌పీ గ్లోబల్ రేటింగ్ మంగళవారం నాడు పేర్కొంది. ముడిచమురు ధరలు తగ్గముఖం పట్టడంతో పరిస్థితులు అనుకూలంగా మారాయని అంచనా వేస్తోంది. మంగళవారం నుంచి రిజర్వుబ్యాంకు ఆరవ ద్వైమాసిక పరపతి సమీక్ష మొదలైంది. కొత్తగా ఆర్‌బీఐ గవర్నర్‌గా శక్తికాంతదాస్ నేతృత్వంలో సమావేశాలు మొదలైనాయి. ఫిబ్రవరి 7వ తేదీన పరపతి సమీక్ష వివరాలు వెల్లడవుతాయి. ఎస్‌అండ్‌పీ గ్లోబల్ రేటింగ్ ఆర్థికవేత్త విష్‌రుట్ రాణా.. మాట్లాడుతూ.. ప్రస్తుతం ద్రవ్యోల్బణం పూర్తి స్థాయిలో అదుపులో ఉందని, అంచనా కంటే చాలా తక్కువగా ఉందని, ముఖ్యంగా ఆహార ఉత్పత్తి పెరగడంతో పాటు ముడిచమురు ధరలు అక్టోబర్ నుంచిచూస్తే 20 శాతం తగ్గాయి. కాబట్టి రిర్వుబ్యాంకు వడ్డీరేట్లు తగ్గించడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయని ఆయన వివరించారు. డిసెంబర్‌లో జరిగిన ఆర్‌బీఐ ద్రవ్యపరపతి సమీక్షలో వడ్డీరేట్లలో ఎలాంటి మార్పులు జరగలేదు. అయితే ద్రవ్యోల్బణం తగ్గితే వడ్డీరేట్లతో కోత విధిస్తామని హామీ ఇచ్చింది. ఆహారం, ఇంధనం ధరలు తగ్గముఖం పట్టడంతో రిటైల్ ద్రవ్యోల్బణం డిసెంబర్ చివరి నాటికి 18 నెలల కనిష్టానికి 2.19 శాతానికి టోకు ద్రవ్యోల్బణం 8 నెలల కనిష్ఠానికి 3.80 శాతానికి దిగివచ్చింది.

సత్తా చాటిన పీఎన్‌బీ

- పీఎన్‌బీ లాభం రూ.246.51 కోట్లు
- క్యూ3లో 7.12 శాతం వృద్ధి
- నీరవ్ సంక్షోభం ఇక చరిత్రే!



ముంబై : ప్రభుత్వరంగానికి చెందిన పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికం నికరలాభంలో 7.12 శాతం వృద్ధితో రూ.246.51 కోట్లు ఆర్జించింది. మొండిబకాయిలకు కేటాయింపు గణనీయంగా తగ్గించుకుంది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.230.11 కోట్లు నష్టాన్ని చూపించింది. వజ్రాల వ్యాపారి నీరవ్‌మోడీ బ్యాంకును సుమారు రూ.14,356 కోట్ల వరకు ముంచిన విషయం తెలిసిందే. అయితే మొత్తం ఆదాయంలో 2.64 శాతం క్షీణించి రూ.14,854.24 కోట్లకు దిగిరాగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.15,257.5 కోట్లని ఒక ప్రకటనలో తెలిపింది. ఫలితాలపై బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో సునీల్ మెహతా స్పందిస్తూ.. కంపెనీ ఫలితాలు తిరిగి గాడినపడ్డాయన్నారు. నీరవ్‌మోడీ మోసం కేసు తర్వాత బ్యాంకు నిబద్ధతతో పనిచేసి బ్యాంకును తిరిగి పట్టాలపై తేవాలనే అకుంఠ దీక్షతో పనిచేసి ఎట్టకేలకు తిరిగి లాభాలబాట పట్టించామని మెహతా అన్నారు. ఆస్తుల నాణ్యత గురించి ప్రస్తావిస్తూ.. గరిష్ఠ ఎన్‌పీఏ 16.33 శాతానికి ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో 12.11 శాతంగా నమోదైంది. అయితే నికర ఎన్‌పీఏ మాత్రం 8.22 శాతానికి దిగిరాగా... క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో 8.90 శాతమని పీఎన్‌బీ బీఎస్‌ఈకి సమాచారం అందించింది. ఇక మొండిబకాయిలకు కేటాయింపుల విషయానికి వస్తే రూ.2,753.84 కోట్లు కాగా క్రితం ఏడాది రూ.4,666.68 కోట్లని తెలిపింది. క్యూ3లో మొండిబకాయిలు రూ.2,565.77 కోట్లుగా నమోదు కాగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.2,996.42 కోట్లని తెలిపింది. బీఎస్‌ఈ దీని షేరు 1.98 శాతం పెరిగి రూ.74.60 వద్ద ట్రేడ్ అయ్యింది.

గెయిల్ లాభంలో 33 శాతం

న్యూఢిల్లీ : గెయిల్ ఇండియా లిమిటెడ్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికం నికరలాభంలో 33 శాతం వృద్ధితో రూ.1681.23 కోట్లు ఆర్జించగా..క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.1,262.22 కోట్లని ఒక ప్రకటనలో వెల్లడించింది. తొమ్మిది నెలల కాలానికి చూస్తే నికరలాభం 36 శాతం వృద్ధితో రూ.4,903 కోట్లకు చేరింది. ఫలితాలపై సీఎండీ బీసీ త్రిపాటి సంతృప్తిని వ్యక్తం చేశారు. కాగా కంపెనీ బోర్డు మధ్యంతర డివిడెండ్‌ను షేరుపై రూ.6.25 ప్రకటించింది.

టెక్‌మహీంద్రా లాభం రూ.1203 కోట్లు

న్యూఢిల్లీ : ఐటి కంపెనీ టెక్ మహీంద్రా డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికం నికరలాభంలో 27.5 శాతం వృద్ధితో రూ.1,203 కోట్లు ఆర్జించింది. రెవెన్యూ విషయానికి వస్తే 15 శాతం వృద్ధితో రూ.8,944 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.7,776 కోట్లని తెలిపింది. డిసెంబర్ త్రైమాసికంలో కంపెనీ రెవెన్యూ 5 బిలియన్ డాలర్ల మైలురాయిని దాటిందని కంపెనీ ఎండీ, సీఈవో సీపీ గుర్నాని తెలిపారు. డిసెంబర్ చివరి నాటికి కంపెనీలో ఉద్యోగుల సంఖ్య 121,842 అని చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ మనోజ్‌భట్ అన్నారు.

మారికోలాభంలో 13 శాతం అప్

న్యూఢిల్లీ : ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం మారికో డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికం నికరలాభంలో 12.72 శాతం వృద్ధితో రూ.251.7 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.223.28 కోట్లని బీఎస్‌ఈకి సమాచారం అందించింది. మొత్తం ఆదాయం విషయానికి వస్తే రూ.1,882.54 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.1,642.49 కోట్లని తెలిపింది. ఇదిలా ఉండగా కంపెనీ ఈ ఆర్థిక సంవత్సరానికి రెండవ మధ్యంతర డివిడెండ్ షేరుపై రూ.2.75 ప్రకటించింది. బీఎస్‌ఈలో దీని షేరు 0.40 శాతం పెరిగి రూ.368 వద్ద ముగిసింది.

అపోలో టైర్స్ లాభంలో 19 శాతం డౌన్

న్యూఢిల్లీ : అపోలో టైర్స్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికం నికరలాభంలో 19.18 శాతం క్షీణించి రూ.198 కోట్లకు దిగివచ్చింది. దీనికి ప్రధాన కారణం కమాడిటి ధరలు పెరగడమేనని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నికరలాభం రూ.245 కోట్లు ఆర్జించింది. అమ్మకాలు మాత్రం 16 శాతం పెరిగి రూ.4,655 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.4,016 కోట్లని ప్రకటనలో వివరించింది. ఫలితాలపై కంపెనీ చైర్మన్ ఓన్‌కార్ ఎస్ కన్వర్ స్పందిస్తూ.. ప్రపంచంలోని అన్నీ మార్కెట్లో వాల్యూమ్స్ గణనీయంగా పెరిగాయి. అయితే ముడి పదార్థాల ధరలు పెరగడంవల్ల .. ముఖ్యంగా క్రూడాయిల్ పెరగడంతో దాని ప్రభావం లాభాలపై పనిచేసిందన్నారు. ప్రస్తుతం ముడిపదార్థాల ధరలు కాస్తా తగ్గముఖం పట్టాయి కాబట్టి రాబోయే త్రైమాసికాల్లో లాభాలు గణనీయంగా పెరుగుతాయని ఆయన అన్నారు. బీఎస్‌ఈలో దీని షేరు 0.17 శాతం పెరిగి రూ.200.70 వద్ద ట్రేడ్ అయ్యింది.

టీజీబీఎల్ లాభం రూ.121 కోట్లు

న్యూఢిల్లీ : టాటాగ్లోబల్ బేవరేజ్ లిమిటెడ్ (టీజీబీఎల్) డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో ఏకీకృత నికరలాభంలో 34.81 శాతం క్షీణించి రూ.121.32 కోట్లకు దిగివచ్చింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.186.11 కోట్లు నికర లాభాన్ని ప్రకటించినట్లు బీఎస్‌ఈకి సమాచారం అందించింది. మొత్తం ఆదాయం మాత్రం 10.52 శాతం పెరిగి రూ.1935.17 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.1750.94 కోట్లని తెలిపింది. డిసెంబర్ త్రైమాసికంలో అమెరికా మార్కెట్లో పన్ను చట్టంలో మార్పు తీసుకువచ్చినందు వల్ల సుమారు రూ.53 కోట్లు పన్ను చెల్లించాల్సి వచ్చిందని ప్రకటనలో వివరిణ ఇచ్చింది. బీఎస్‌ఈలో దీని షేరు 7.64 శాతం క్షీణించి రూ.185 వద్ద ట్రేడ్ అయ్యింది.

సేవల రంగం ఢమాల్

- వరుసగా రెండో నెల బలహీనమే



న్యూఢిల్లీ : సేవల రంగం వరుసగా రెండో నెల జనవరిలో కూడా మందగమనంలో కొట్టుమిట్టాడింది. కంపెనీలు ఉద్యోగులను పెద్దమొత్తంలో రిక్రూట్ చేసుకున్నా దానికి తగ్గట్టు ఆర్డర్లు మాత్రం తగ్గముఖం పట్టాయని నిక్కీ ఇండియా సర్వీసెస్ బిజినెస్ యాక్టివిటి సూచిని బట్టి తెలుస్తోంది. జనవరిలో సూచి 52.2 పాయింట్లకు దిగిరాగా.. డిసెంబర్‌లో 53.2 పాయింట్లుగా నమోదైంది. సేవల రంగం కాస్తా బలహీనపడ్డా... గత ఎనిమిది నెలల నుంచి 50 పాయింట్లపైనే నమోదవుతుండటం గమనార్హం. పీఎంఐ 50 పాయింట్లపైన నమోదైతే ఫర్వాలెదని.. తగ్గిందంటే మందగమనంలో కొట్టుమిట్టాడుతున్నట్లేనని ఐహెచ్‌ఎస్ మార్కిట్ ప్రిన్సిపల్ ఆర్థికవేత్త పోల్లాయన్నా డీ లిమా తాజా నివేదికలో పేర్కొన్నారు. సేవల రంగం ఊపందుకోకపోయినా.. ఉద్యోగావకశాలు ఈ రంగంలో బాగా మెరుగుపడ్డాయని లిమా తెలిపారు. ధరల విషయానికి వస్తే ధరల్లో ఎలాంటి మార్పుల్లేవు. ప్రస్తుతం ద్రవ్యోల్బణం అదుపులో ఉన్నందువల్ల రిజర్వుబ్యాంకు ఈ నెల 7వ తేదీన ప్రకటించబోతున్న ద్రవ్యపరపతి సమీక్షలో వడ్డీరేట్లలో ఎలాంటి మార్పులు చేయదని యధావిధిగా కొనసాగించవచ్చునని అంచనా వేసింది.

వచ్చే ఏడాది వృద్ధిరేటు 7.5శాతం

- బడ్జెట్‌లో అన్నీ వర్గాలకు లబ్ధి
- ద్రవ్యోల్బణం అదుపులోనే
- సుభాష్‌చంద్ర గార్గ్



న్యూఢిల్లీ : వచ్చే ఆర్థిక సంవత్సరం 2019-20లో జీడీపీ వృద్ధిరేటు 7.5 శాతానికి చేరుకోవచ్చునని ఆర్థికమంత్రిత్వశాఖ అంచనా వేస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధిరేటు అంచనా 7.2 శాతంగా నమోదు కావచ్చునని భావిస్తోంది. 2016-17లో వృద్ధిరేటు 8.2 శాతం సాధించింది. ఆ సంవత్సరం ప్రభుత్వం రూ.500, రూ.1,000 పెద్దనోట్లను రద్దు చేసింది.

వచ్చే ఆర్థిక సంవత్సరం 2019-20లో సాధారణ వృద్ధిరేటు 11.5 శాతం సాధించవచ్చునని ఊహిస్తున్నామని, తమ అంచనా మాత్రం వాస్తవ వృద్ధిరేటు 7.5 శాతం, ద్రవ్యోల్బణం 4 శాతమని.. ఈ రేటు సమంజసమని భావిస్తున్నామని ఆర్థికవ్యవహారాల కార్యదర్శి సుభాష్‌చంద్ర గార్గ్ అన్నారు. మధ్యంతర బడ్జెట్ ప్రసంగంలో పీయూష్‌గోయల్ దేశ ఆర్థిక వ్యవస్థ పునాదులు పటిష్టంగా ఉన్నాయని.. అత్యధిక వృద్ధిరేటు సాధించే సత్తా భారత్‌కు ఉందన్నారు. గత ఐదు సంవత్సరాల నుంచి చూస్తే పెట్టుబడులకు భారత్ అనుకూలంగా ఉందని ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వచ్చిందని.. ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థ బలంగా స్థిరంగా ఉందన్నారు. ప్రపంచంలో శరవేగంగా దూసుకుపోతున్న ఆర్థిక వ్యవస్థలో భారత్ అగ్రస్థానంలో ఉందని గార్గ్ అన్నారు. గత ఐదు సంవత్సరాల రికార్డును పరిశీలిస్తే.. గతంలో ఏ ప్రభుత్వమూ సాధించని విధంగా జీడీపీ వృద్ధిరేటులో దూసుకుపోయామని గార్గ్ గుర్తు చేశారు. 1991 నుంచి భారత ప్రభుత్వం సంస్కరణలకు పెద్దపీట వేసిందని.. అటు తర్వాత నుంచి దేశాన్ని పాలించిన ఏ ప్రభుత్వం ఈ స్థాయిలో వృద్ధిరేటును సాధించలేకపోయిందన్నారు. 2019-20 బడ్జెట్ గురించి వివరిస్తూ.. దేశంలోని మారుమూల ప్రాంతాల్లో నివసించే వారికి ఏదో ఒక విధంగా లబ్ధి చేకూరేలా బడ్జెట్‌ను రూపొందిచామన్నారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తూ.. ఉదారంగా రాయితీలు ఇవ్వలేదని.. దీర్ఘకాలంలో సంపద సృష్టించడంతో పాటు ప్రజలకు మెరుగైన జీవితాలను అందించాలనే ఉద్దేశంతో పెద్దమొత్తంలో రాయితీవలు ఇవ్వడం జరిగిందని.. రాయితీల వల్ల మరింత ఉత్పాదకత పెరుగుతుదని గార్గ్ వివరించారు. ఈ బడ్జెట్‌లో ఆసక్తికరమైన అంశం ఏమిటంటే ఆర్థిక క్రమశిక్షణను పాటించామని, లేదంటే ద్రవ్యోల్బణం పెరిగిపోతుందన్నారు. అదేసమయంలో ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షిస్తున్నామన్నారు. దీనికి ఉదాహరణగా గ్రామీణ కనెక్టివిటిని బలోపేతం చేయడంతో పాటు గ్రామీణ విద్యుద్దీకరణ, దేశంలో నివసించే ప్రతి ఒక్కరికి గృహ సదుపాయం కల్పించి దిశగా ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటోందని గార్గ్ వివరించారు.

బ్రిటన్ బిల్‌గేట్స్...రుబెన్‌సింగ్

రూ.50 కోట్లు ఖర్చుతో రోల్స్‌రాయస్ కార్ల కొనుగోలు



లండన్: భారత సంతతికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త రుబేన్‌సింగ్ బ్రిటన్‌లో ఆయనను బిల్‌గేట్స్ ఆఫ్ బ్రిటన్‌గా సంబోధిస్తుంటారు. ఇటీవల కాలంలో ఇంటర్నెట్‌లో ఆయన అప్‌డేట్ చేసిన కొన్ని ఫోటోలు టాక్ ఆఫ్ ది టౌన్‌గా యువతలో అలజడి సృష్టించాయి. ఇంతకు ఈ హల్‌చల్‌కు కారణం ఏమిటంటే ఆయన ఏకంగా రూ.50 కోట్లు ఖర్చు పెట్టి రోల్స్ రాయిస్ కార్లు కొనుగోలు చేయడమే.సింగ్ విషయానికి వస్తే ఆయన ఆల్‌డే పీఏ కాంటాక్ట్‌సెంటర్ కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈవో కూడా.. సింగ్ తాజా కార్ల కలెక్షన్స్‌లో రోల్స్ రాయిస్ కలెక్షన్స్ వాటిలో మూడు పాంథేమ్ లగ్జరీ సెడాన్స్, మూడు కుల్లీనాన్ లగ్జరీ ఎస్‌యూవీలు వాటి పేర్లు రుబీస్, సఫైర్స్, ఎమర్లాడ్స్. సింగ్ కార్ల కలెక్షన్స్‌లో అత్యంత ఖరీదైంది రోల్స్‌రాయిస్ ఫాంథెమ్, ఎస్‌యూవీలో కుల్లీనియన్ అత్యంత ఖరీదైంది. ఈ కార్లను ఆయా కార్ల కంపెనీలకు చెందిన సీఈవోలే సింగ్ ఇంటికి తీసుకెళ్లి డెలివరీ ఇచ్చారని మీడియాలో కథనాలు వచ్చాయి. తాజా కార్ల కలెక్షన్స్ ఆయన వద్ద ప్రస్తుతం రోల్స్ రాయిస్ మోడల్ కార్ల సంఖ్య 20కి చేరుకుంటాయని చెబుతున్నారు. లగ్జరీ కార్లంటే సింగ్‌కు మహాపిచ్చి. సూపర్ లగ్జరీ కార్లు.. బుగ్గాటీ వేరాన్, పోర్షే 918 స్పైడర్, పాగానీ హుయారా, లాంబోర్గిని హురికేన్, ఫెరారీ ఎఫ్12 బెర్లిట్టా అనే కార్లు ప్రపంచంలో అతి కొద్ది మంది వద్ద మాత్రమే ఉంటాయి. వాటిలో మన ఇండియన్ సింగ్ ఒక్కడు.

స్వల్ప లాభాలతో సరి!

- సెన్సెక్స్ 34పాయింట్ల వృద్ధి
- అందరి దృష్టి ఆర్‌బీఐ సమీక్షపై...



ముంబై: స్టాక్ మార్కెట్లు బుధవారం స్వల్పలాభాలతో ముగిశాయి. ట్రేడింగ్ మాత్రం మందకొడిగా కొనసాగింది. ఇన్వెస్టర్లు మార్కెట్లకు దూరం గా ఉన్నారు. రిజర్వు బ్యాంకు ద్రవ్యపరపతి సమీక్ష మొదలైంది. గ్లోబల్ మార్కెట్ల నుంచి అనుకూలమైన సంకేతాలు రాకపోవడంతో దేశీయ మార్కెట్లకు బలహీనంగా ట్రేడ్ అయ్యాయి. ట్రేడింగ్ సరళిని గమనిస్తే.. ఉదయం ట్రేడింగ్ మందకొడిగానే ప్రారంభమైంది. మార్కెట్ ముగిసే నాటికి సెన్సెక్స్ 34.07 పాయింట్ల లాభంతో 36,616.81 వద్ద, నిఫ్టీ 22.10 పాయింట్ల లాభంతో 10,934.35 వద్ద ముగిశాయి. లాభపడిన షేర్లలో హీరోమోటోకార్ప్, ఇండస్‌ఇండ్ బ్యాంకు, బజాజ్‌ఆటో, మారుతి, ఎంఅండ్‌ఎంలు 2.66 శాతం వరకు లాభపడిన వాటిలో ఉన్నాయి. దీనికి వ్యతిరేకంగా టాటామోటార్స్, కోల్ ఇండియా, ఒఎన్‌జీసీ, టాటాస్టీల్, ఎస్ బ్యాంకు, సన్‌ఫార్మా, ఐటీసీ, ఐసీఐసీఐ బ్యాంకు షేర్లు 2.63 శాతం వరకు నష్టపోయిన వాటిలో ఉన్నాయి. ఇన్వెస్టర్లు ఆర్‌బీఐ పరపతి సమీక్షలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూస్తున్నారు. మంగళవారం నుంచి ఈ సమీక్ష మొదలైంది. మూడు రోజుల పాటు సమీక్ష కొనసాగుతుంది. ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చింది కాబట్టి వడ్డీరేట్లు తగ్గిస్తుందన్న అంచనా ఒకటైతే.. మరోవైపు ముడిచమురు ధరలు పెరిగితే పరిస్థితి ఏమిటనే ప్రశ్న ఉదయిస్తోంది.దీంతో వడ్డీరేట్లను యధాతథంగా కొనసాగించే అవకాశాలున్నాయన్న వాదన కూడా వినిపిస్తోంది. మొత్తానికి మార్కెట్లు ఒడిదుడుకులకు గురికావచ్చునని .. ఇలాంటి సమయంలో ఇన్వెస్టర్లు అందుబాటులో ఉన్న ఆటో, ప్రైవేట్ బ్యాంకు షేర్లను కొనుగోలు చేసుకోవచ్చునని సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా విదేశీ పోర్టుపోలియో ఇన్వెస్టర్లు సోమవారం నాడు రూ.112.13 కోట్ల షేర్లు విక్రయిస్తే.. దేశీయ సంస్థాగత మదుపరులు నికరంగా రూ.65.22 కోట్ల షేర్లు విక్రయించినట్లు బీఎస్‌ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయి. గ్లోబల్ మార్కెట్ల విషయానికి వస్తే మిశ్రమ స్పందన కనిపించింది.

బీహెచ్‌ఈఎల్ లాభం రూ.192 కోట్లు



న్యూఢిల్లీ : ప్రభుత్వరంగానికి చెందిన ఇంజినీరింగ్ దిగ్గజం బీహెచ్‌ఈఎల్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికం నికరలాభంలో 25.30 శాతం వృద్ధితో రూ.191.95 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.153.9 కోట్లని ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇదిలా ఉండగా కంపెనీ బోర్డు మధ్యంతర డివిడెండ్‌ను షేరుకు రూ.0.80 పైసలు ప్రకటించింది, ఫిబ్రవరి 21, 2019 నాటికి ఖాతాలో జమ అవుతాయి. ఫలితాలపై సీఎండీ అతుల్ సోబ్తి మాట్లాడుతూ.. కంపెనీ వ్యూహాత్మంగా కొత్త వ్యాపారాల్లోకి ఎంట్రీ ఇవ్వడంతో పాటు ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేయడం, దీంతో పాటు వ్యయ నియంత్రణకు పాల్పడ్డంతో దాని ప్రభావం లాభాలపై కనిపించందన్నారు. విద్యుత్ రంగంలో కాకుండా విద్యుతేర రంగంలో కూడా బీహెచ్‌ఈఎల్ సత్తా చాటులోందని సోబ్తి పేర్కొన్నారు.



బడ్జెట్ 2019-20

ఎవరేమన్నారు?!



'అన్నదాత సుఖీభవ' చరిత్రాత్మకం - మంత్రి సోమిరెడ్డి

అమరావతి, ఆంధ్రప్రభ : 'అన్నదాత సుఖీభవ' ఒక చారిత్రాత్మక నిర్ణయమని రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం శాసనసభలో ఓట్ ఆన్ ఎకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం ఆయన మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ మంత్రి యనమల బడ్జెట్ చరిత్రాత్మక బడ్జెట్ అని, ఇది ఆడపడుచులకు, రైతాంగానికి, వృద్ధులకు మేలు చేసేవిధంగా ఉందని కొనియాడారు. గత బడ్జెట్ కంటే 18శాతం పెంపుదలతో రూ.2.26 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టామని, రైతుకు వెన్నుదన్నుగా నిలిచేందుకు రూ.5000 కోట్లతో అన్నదాత సుఖీభవ అనే కార్యక్రమం చేపట్టామన్నారు. రైతుల భవిష్యత్తు గురించి ఆలోచించి మద్దతు ధరకోసం రూ.1000కోట్లు, పంటభీమా ఇన్స్యూరెన్స్ కింద రూ.200 కోట్లు కేటాయించామన్నారు. ఫుడ్ ప్రాసెస్ కింద రూ.400 కోట్లు, హార్టికల్చర్ కింద రూ.200కోట్లు, చేపల పెంపకం కోసం రూ.200 కోట్లు కేటాయించామని తెలిపారు. జీడీపీలో 32శాతం వ్యవసాయ రంగం నుండి ఆదాయం వస్తోందని, రైతులను దృష్టిలోపెట్టుకొని పలు పథకాలు చేపట్టామన్నారు. డ్రైవర్ల సాధికారత సంస్థను ఏర్పాటు చేశామని, నిరుద్యోగ భృతిని రూ.1000 నుండి రూ.2000 వేలకు పెంచామన్నారు. రాష్ట్రంలో ఆడపడుచుల గురించి ఆలోచించి పసుపు-కుంకుమ మొదటి, రెండవ విడత కింద రూ.18000 వేలు మరలా రూ.4వేల కోట్లు కేటాయించామని తెలిపారు. ప్రధాని మోడీ రైతులకు రూ.6వేలను మూడు దఫాలుగా ఇస్తారంట అని ఎద్దేవా చేశారు. తాము వృద్ధులకు ఇచ్చే పెన్షన్ సంవత్సరానికి రూ.24వేలు అవుతుందని, ఎన్టీఆర్ భరోసా పెన్షన్ నగదుతో రైతుకు రెండెకరాల కౌలు వస్తుందన్నారు. మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణాలో కంటే లోటు బడ్జెట్‌లో వున్న ఏపీలో ఎక్కువ సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయని, తాము చర్చకు కూడా సిద్ధమేనని స్పష్టంచేశారు.

హామీలు నెరవేర్చే బడ్జెట్: మంత్రి జవహర్



జనాభా దామాషా ప్రకారం ప్రజల అవసరాల మేరకు హామీలు నెరవేర్చే విధంగా ఈ ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ఉందని మంత్రి కొత్తపల్లి శామ్యూల్ జవహర్ చెప్పారు. ఆయన మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ, ప్రజల ఆశలకు అనుగుణంగా, రైతులకు మేలుచేసే విధంగా ఈ బడ్జెట్ రూపకల్పన చేశారన్నారు. మేనిఫెస్టోలో ఉన్న అన్ని అంశాలను అమలుచేశామని, అప్పులు ఉన్నా ఆర్థిక క్రమశిక్షణ పాటించామని చెప్పుకొచ్చారు. రైతులకు రుణాలు రద్దు, మహిళలకు పసుపు-కుంకుమ, వృద్ధులకు పెన్షన్లు వంటి పథకాలు ప్రవేశ పెట్టిన సంక్షేమ ప్రభుత్వం చంద్రబాబు నాయుడు నేతృత్వం లోని తెలుగుదేశం పార్టీ అన్నారు. ఈ బడ్జెట్‌తో రాష్ట్రంలోని అన్ని వర్గాలకు లబ్ధి చేకూరుతుందన్నారు.

నోరు అదుపులో పెట్టుకో !: బుద్దా వెంకన్న



జీవీఎల్ నరసింహారావు నోరు అదుపులో పెట్టుకోవాలని మండలి విప్ బుద్దా వెంకన్న హెచ్చరించారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాలకు ముందు ఆయన మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఒకవైపు జగన్, మరోవైపు జీవీఎల్ నరసింహారావులు రాజకీయాలను తుంగలో తొక్కి మాట్లాడుతున్నారన్నారు. జీవీఎల్ నోరు అదుపులో పెట్టుకోకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని వార్నింగ్ ఇచ్చారు. ఇప్పటి వరకూ వైసీపీలోనే పిచ్చోళ్లు ఉన్నారనుకుంటే ఇప్పుడు జీవీఎల్ లాంటి పిచ్చోళ్లు బీజేపీలో కూడా ఉన్నారని అర్థమైందన్నారు. ఉద్యోగస్తులకు వారి సర్వీసు ఆధారంగానే పదోన్నతులు వస్తాయన్న సంగతి తెలియకుండా అడ్డదారిలో పదోన్నతులు వచ్చాయంటూ మాట్లాడం అనాలోచిత చర్య అని జగన్‌ను ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు. ఒక వేళ పదోన్నతుల్లో అవినీతి, అక్రమాలు చోటుచేసుకుంటే వారే కోర్టుకు వెళ్తారని అలాంటిది జరగలేదంటే పదోన్నతులన్నీ సక్రమమే కదా అంటూ వెంకన్న వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ వ్యవస్థల మీద నమ్మకం లేని జగన్‌కు రాష్ట్ర ముఖ్యమంత్రి కావాలనే కల మాత్రం బాగుందన్నారు. అది జరిగేపని కాదని ఆయన గుర్తించాలని అన్నారు.

కేంద్ర పథకాలతోనే అవార్డులు: సోము వీర్రాజు



రాష్ట్రానికి 600 పైచిలుకు అవార్డులు వచ్చినట్లు ప్రభుత్వ పెద్దలు గొప్పలు చెప్పుకుంటున్నారని, అవన్నీ కేంద్ర ప్రభుత్వ పథకాల నిర్వహణ వల్ల వచ్చినవే నని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. ఆయన మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ, ఈ రాష్ట్రప్రభుత్వం చేపట్టి విజయం సాధించి, అవార్డులు పొందిన విషయమేమీ లేదంటూ ఎద్దేవా చేశారు. కేంద్రం ఇచ్చిన నిధులతో తైతక్కలాడి ఆ కేంద్రాన్నే విమర్శించడం దిగజారుడు రాజకీయాలను నిదర్శనమన్నారు. మంగళవారం ప్రవేశ పెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ కేవలం ఎన్నికల బడ్జెట్‌గా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం కిసాన్ సమ్మాన్ కింద ఇస్తున్న సాయాన్ని విమర్శిస్తున్న తెలుగుదేశం పెద్దలు 2014లో ప్రకటించిన రుణమాఫీ ఇంకా రెండు విడతల మొత్తాన్ని ఎందుకు చెల్లించలేదో కూడా చెబితే బాగుంటుందన్నారు. చెప్పిన హామీలను నెరవేర్చని బీజేపీపై విమర్శలు చేసే హక్కు టీడీపీకి లేదన్నారు.

ప్రధాన రంగాలకు కేటాయింపులేవీ?: పీడీఎఫ్ ఎమ్మెల్సీలు

రాష్ట్రప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ప్రధాన రంగాలకు కేటాయింపులెక్కడా కనిపించలేదని మండలి పీడీఎఫ్ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రమణ్యం ఆరోపించారు. సమావేశాలు ముగిసిన అనంతరం ఆయన పీడీఎఫ్ ఎమ్మెల్సీలు బొడ్డు నాగేశ్వరరావు, రాము సూర్యారావు, యండపల్లి శ్రీనివాస రెడ్డిలతో కలిసి మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడారు. గతం కంటే 18.38 శాతం బడ్జెట్ పెరిగినట్లు చెబుతున్నా... ప్రధాన రంగాలకు కేటాయింపులు మాత్రం జరగలేదన్నారు. ముఖ్యంగా విద్యారంగానికి గత ఏడాది 12.79 శాతం కేటాయిస్తే ఈ ఏడాది 11.48 శాతం కేటాయించారన్నారు. గతం కంటే ఎక్కువ కేటాయించాల్సిన రంగానికి తగ్గించి కేటాయించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఉన్నత విద్యకు రూ. 3 వేల కోట్లు కేటాయించారని, ఇవి ఉద్యోగుల జీతభత్యాలకే సరిపోతాయన్నారు.

ఒక్క విద్యారంగానికే కాకుండా ఆరోగ్య, సాంఘిక సంక్షేమం, మహిళా సంక్షేమం వంటి రంగాలకు కూడా కేటాయింపుల్లో అన్యాయం జరిగిందన్నారు. ప్రభుత్వ గొప్పలు చెప్పుకుంటున్న స్కిల్ డెవలప్‌మెంట్‌కు కేటాయింపులు తగ్గాయన్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)పై గత సమావేశాల్లో పట్టుబట్టి పెద్ద చర్చ జరిపించామన్నారు. దానిపై కమిటీ వేశామని చెప్పి దాని ఊసే ఎత్తలేదన్నారు. అలాగే ఉద్యోగస్తులు ఎదురుచూస్తున్న మధ్యంతర భృతి (ఐఆర్) మాటే ఎత్తలేదన్నారు. కనీసం పీఆర్సీ విషయంపై ఒక్క ముక్క కూడా లేదన్నారు. కేవలం ఎన్నికల కోసం అరకొరగా కొన్ని రంగాలకు ఇచ్చి కీలక రంగాలను విస్మరించారన్నారు. రేపటి నుండి సీపీఎస్ రద్దు కోరుతూ వాయిదా తీర్మానం ఇచ్చి తమ పోరాటాన్ని ఉధృతం చేయ బోతున్నామని పీడీఎఫ్ ఎమ్మెల్సీలు స్పష్టం చేశారు.



మత్స్య వర్సిటీకి గ్రీన్ సిగ్నల్

- రూ.300 కోట్లతో ఏర్పాటు: మంత్రి ఆదినారాయణరెడ్డి



అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్ర విభజన అనంతరం ప్రభుత్వం ఉన్నత విద్యకు పెద్దపీట వేస్తోంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రానికి అనేక ప్రభుత్వ, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు తరలి వచ్చాయి. రాష్ట్రాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యానికి అనుగుణంగా ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో నూతనంగా మత్స్య, సముద్ర విశ్వవిద్యాలయం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు మంగళవారం పశుగణాభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి ఆదినారాయణ విశ్వవిద్యాలయ ఏర్పాటుకు అనుమతిస్తూ లెటరాఫ్ ఇండెంట్ జారీ చేశారు. ఈ మేరకు ఉత్తర్వులను మంత్రి ప్రైవేట్ యాజమాన్య ప్రతినిధికి మంగళవారం సచివాలయంలో అందజేశారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం సమీపంలో 150 ఎకరాల్లో రూ.300 కోట్ల వ్యయంతో ఏర్పాటు కానున్న ఈ విశ్వవిద్యాలయం దేశంలో మూడోది కావడం విశేషం. తమిళనాడు, కేరళ తరువాత రాష్ట్రంలో తొలిసారిగా ఈ తరహా విశ్వవిద్యాలయం ఏర్పాటవుతుంది. ఈ ఏడాది విద్యా సంవత్సరం ఆరంభం నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. ఈ విశ్వవిద్యాలయంలో గ్రాడ్యుయేషన్, పీజీ కోర్సులతో పాటు పిహెచ్‌డి, ఎంబిఏ, మెరైన్, లా కోర్సులు కూడా నిర్వహిస్తారు. గ్రాడ్యుయేషన్, పీజీ కోర్సులకు ఎంసెట్ ద్వారా ప్రవేశాలు కల్పించనున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో ఏర్పాటావుతున్న ఈ విశ్వవిద్యాలయంలో 51 శాతం వాటాతో ఉద్దరాజు ఆనందరాజు ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ముందుకు రాగా ప్రభుత్వం వాటా 49 శాతం ఉంటుందని మంత్రి ఆదినారాయణ ఈ సందర్భంగా పేర్కొన్నారు. మత్స్య, విజ్ఞాన శాస్త్ర గ్రాడ్యుయేషన్‌లో బ్యాచులర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్, బీటెక్‌లో పోర్టు, హార్బర్ ఇంజనీర్, ఫుడ్ ప్రాసెసింగ్ ఇజనీరింగ్, న్యావల్ ఆర్కిటెక్చర్, ఎన్విరాన్‌మెంటన్ కోర్సులు ఉంటాయని మంత్రి మీడియాకు తెలిపారు.

ఆదాయ, వ్యయాలకు పొంతన లేదు

- వైకాపా అధికార ప్రతినిధి పార్థసారథి



అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ కాదని, ఓటమి భయం బడ్జెట్ అని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కొలుసు పార్థసారథి ఎద్దేవా చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మరో మూడు నెలల్లో ఓటమి పాలై ఇంటికి వెళ్తున్నాం కాబట్టి వాస్తవ ఆదాయాలు, వ్యయాలతో సంబంధం లేకుండా మంత్రి యనమల రామకృష్ణుడు బడ్జెట్ ప్రవేశపెట్టారన్నారు. మరోవిధంగా చెప్పాలంటే జగన్ ప్రకటించిన నవరత్నాలను కాపీ కొడుతూ కూడా చాలా పథకాలను ప్రకటించారన్నారు. బీసీ కులాలకు కార్పొరేషన్ ప్రకటించడం అలాంటిదేన్నారు. బడ్జెట్‌ను బాధ్యతా యుతంగా తయారు చేయాల్సిన ప్రభుత్వం ఏమాత్రం జవాబుదారీతనం లేకుండా ప్రవర్తించిందన్నారు. ఆదాయాలను ఎక్కువచూపడం, మనల్ని ఎవరు ప్రశ్నిస్తార్లే అన్నట్లుగా బడ్జెట్ తయారుచేశారన్నారు. మొత్తం ఆదాయం 2017-18లో రూ.1,91,950 కోట్లు ఉంటే రూ.1,95,727 కోట్లు చూపించి ఈఏడాది రూ. 2,25,705 కోట్లు వస్తుందని చూపారన్నారు. అంటే రూ. 30 వేల కోట్లు ఎలా అదనంగా వస్తుందో చెప్పలేదన్నారు. రెవెన్యూ వ్యయం, క్యాపిటల్ వ్యయం రెండు కలిపితే మొత్తం వ్యయం వస్తుందన్నారు. ఇక్కడ రెవెన్యూ వ్యయం రూ. 1.8 లక్షల కోట్లు, క్యాపిటల్ వ్యయం రూ. 29 వేల కోట్లుగా చూపారని, మొత్తం కలిపితే రూ. 2.09 లక్షల కోట్లు అవుతుందన్నారు. కానీ, బడ్జెట్ మాత్రం రూ. 2.26 లక్షల కోట్లుగా చూపారన్నారు. అన్ని రంగాల కేటాయింపులను చూస్తే కాకిలెక్కలతో బడ్జెట్ తయారుచేశారని స్పష్టంగా అర్థమౌతుందన్నారు.

ఇది అంకెల గారడీ

- రావెల కిషోర్‌బాబు

అమరావతి, ఆంధ్రప్రభ: ఇది అంకెల గారడీ బడ్జెట్ అని జనసేన పార్టీ పేర్కొంది. కేవలం ప్రజల్ని మధ్య పెట్టడానికి చేసే ప్రయత్నంగా బడ్జెట్ కేటాయింపులున్నాయని ఆ పార్టీ నాయకులు, మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు పేర్కొన్నారు. ప్రభుత్వ కాలపరిమితి మరో మూడు నెలల్లో ముగుస్తుందని, కానీ పూర్తి స్థాయిలో బడ్జెట్ ప్రవేశపెట్టడడం రాజ్యాంగ విరుద్ధం అన్నారు. ఓట్-ఆన్-అకౌంట్ బడ్జెట్ ప్రకారం కేవలం జీతభత్యాలు,అత్యవసర ఖర్చులకు సంబంధించి మాత్రమే బడ్జెట్ కేటాయింపులు చేయాలన్నారు. కానీ ప్రజల్ని మధ్యపెడుతూ ఓట్ల రాజకీయం చేశారన్నారు. ఇప్పటికే అప్పులు రూ. 1.36 లక్షల కోట్లకు పెరిగాయన్నారు. సగటు తలసరి అప్పుల భారాన్ని ప్రజలపై రుద్దటం బాధ్యతరాహిత్యమన్నారు. రెవెన్యూ వ్యయం రూ. 1,80,369 కోట్ల అంచనా వేశారు కానీ అది ఏ రూపంలో ఎంత రెవిన్యూ ఎలా వస్తుందో పేర్కొనలేదన్నారు. లోటు బడ్జెట్‌ను ప్రతిసంవత్సరం పెంచుకుంటూ పోతే దీనికి అంతం ఎక్కడ అని ప్రశ్నించారు.

సుప్రీం తీర్పు మమతకు చెంపపెట్టు

- త్వరలో చంద్రబాబుకూ తప్పదు భంగపాటు
- బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు హెచ్చరిక

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: సీబీఐ విచారణను అడ్డుకుంటున్న వ్యవహారంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు బెంగాల్ సీఎం మమత బెనర్జీకి చెంపపెట్టు లాంటిదని భారతీయ జనతా పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు తీర్పు అనంతరం ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్లో మీడియాతో మాట్లాడిన జీవీఎల్, కోర్టు తీర్పుతో మమత నాటకానికి తెరపడిందని అన్నారు. సీబీఐ కంట పడకుండా తమ పోలీస్ అధికారి రాజీవ్ కుమార్‌ను కాపాడాలని మమత ఎంత ప్రయత్నించినా కుదరలేదని, సుప్రీం తీర్పుతో అది విఫలయత్నంగా మారిందని అన్నారు. మమతకు మద్ధతుగా ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేక విమానంలో వెళ్లి బిల్డప్ ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో సీబీఐ అడుగుపెట్టకుండా పులిని చూసి నక్క వాతపెట్టుకున్న చందంగా ఆంధ్రప్రదేశ్‌ను చూసి బెంగాల్ కూడా అనుమతి నిరాకరించిందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో చంద్రబాబు కూడా మమత ధోరణిని అవలంబిస్తున్నారని, కాబట్టి త్వరలోనే చంద్రబాబు సైతం భంగపడక తప్పదని జీవీఎల్ నరసింహారావు అన్నారు.

మేమిచ్చే నోటీసులకు భయపడి నాపై నోటీసులు

మరోవైపు సభా హక్కుల ఉల్లంఘన నోటిసీలుపై కూడా జీవీఎల్ నరసింహారావు స్పందించారు. బీజేపీ సభ్యులను సీఎం బెదిరించడంపై తాము నోటీసులు ఇస్తామన్న భయంతోనే టీడీపీ నేతలు తనపై నోటీసులిస్తున్నారని వివరించారు. తాను అసెంబ్లీ మొత్తాన్ని ఎక్కడా తప్పుబట్టలేదని, సభా నాయకుడిగా ఉన్న ముఖ్యమంత్రి మాట్లాడిన తీరుపై మాత్రమే తాను స్పందించానని వెల్లడించారు. రాజ్యసభ సభ్యుడిగా తనకు నోటీసు ఇవ్వాలంటే కచ్చితంగా పార్లమెంట్ ద్వారానే ఇవ్వాల్సి ఉంటుందని జీవీఎల్ స్పష్టం చేశారు. అసెంబ్లీ స్పీకర్ నేరుగా పార్లమెంట్ సభ్యులకు నోటీసులు ఇవ్వలేరని తెలిపారు. తనకు నోటీసు ఇవ్వాలంటే అది రాజ్యసభ ద్వారానే సాధ్యపడుతుందని వివరించారు. పార్లమెంట్ ప్రివిలేజ్ కమిటీలో సభ్యుడిగా ఉన్న తాను ఈ నోటీసుల్లో ఏమాత్రం పసలేదని చెప్పగలనని వ్యాఖ్యానించారు. తమ సభ్యులను బెదిరించిన ముఖ్యమంత్రి కచ్చితంగా క్షమాపణ చెప్పాల్సిందేనని జీవీఎల్ అన్నారు. చంద్రబాబే బీజేపీ ఎమ్మెల్యేలను రాష్ట్రంలో తిరగనివ్వమని బెదిరించారని గుర్తుచేశారు. కాబట్టి ఆయన వ్యాఖ్యలే సభా హక్కుల ఉల్లంఘన కిందికి వస్తాయని, ఆయనకే నోటీసులు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు.



జీవీఎల్‌పై హక్కుల నోటీసు

అమరావతి, ఆంధ్రప్రభ : పార్లమెంటు ఎగువ సభలో సభ్యునిగా ఉంటూ శాసన సభ ప్రతిష్టను దిగజార్చే విధంగా సభాధ్యక్షుడిని కించపరుస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావుపై చర్యలు తీసుకోవాలంటూ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చారు. శాసనసభ 169వ నిబంధన కింద స్పీకర్‌కు నోటీసు అందజేసి సభా హక్కుల కమిటీకి పంపాల్సిందిగా కోరారు. విష్ణుకుమార్ రాజు, మాణిక్యాల రాజు వ్యవహారంలో ఈ నెల 2న ముఖ్యమంత్రిని అసెంబ్లీ రౌడీ అంటూ జీవీఎల్ నరసింహారావు వ్యాఖ్యానించినట్లు తెలిపారు. శాసనసభ నిబంధనలకు ఇది పూర్తిగా విరుద్ధమని చెపుతూ ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. సభ్యుడు ఇచ్చిన నోటీసుపై నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటానని స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు పేర్కొన్నారు.

నేడు వైకాపా శంఖారావం

- తిరుపతిలో ఆరంభం
- బూత్ కమిటీలతో జగన్ ముఖాముఖి
- రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం మీదుగా పయనం

తిరుపతి, ఆంధ్రప్రభ బ్యూరో: రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బుధవారం నగరా మోగించనుంది. ఈ కార్యక్రమానికి 'సమర శంఖారావం' అని నామకరణం చేశారు. ఈ కార్యక్రమాన్ని బుధవారం రాయలసీమలోని తిరుపతి నుండి ప్రారంభించేందుకు అధినేత వైయస్ జగన్ సమాయత్తమయ్యారు. ఆనవాయితీగా తిరుపతిలో నిర్వహించనున్న జిల్లాస్థాయి సమావేశంలో వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఎన్నికల శంఖారావాన్ని పూరించనున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టడంతో పాటు 2019 సార్వత్రిక ఎన్నికలకు పార్టీని సర్వసన్నద్ధం చేసే లక్ష్యంతో ఈ శంఖారావం సభలను నిర్వహించనున్నారు. తిరుపతిలో జరగబోయే ఈ సమావేశంతో జగన్ పర్యటన ప్రారంభం కానుంది. అక్కడి నుండి కడప, అనంతపురం, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల మీదుగా కొనసాగనుంది. రాష్ట్రంలో గత నాలుగైదేళ్లుగా తెలుగుదేశం ప్రభుత్వంతో ప్రధాన ప్రతిపక్షంగా పోరాడుతున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రానున్న ఎన్నికలకు సమాయత్తమవుతుంది. వాస్తవానికి ఆపార్టీ అధినేత జగన్ 2017 లోనే నవరత్నాల పేరుతో రూపొందించిన హామీలపత్రం ద్వారా ఎన్నికల పోరుకు లాంఛనంగా శ్రీకారం చుట్టారు. జిల్లాలవ్యాప్తంగా వివిధ వర్గాల సమస్యలను గుర్తించి ఆ హామీలకు జత చేసి ఎన్నికల మేనిఫెస్టో తయారు చేయాలనే లక్ష్యంతో 2017 నవంబరు మొదటి వారంలో తిరుమలేశుని దర్శించుకుని కడప జిల్లా ఇడుపులపాయలోని తన తండ్రి సమాధి వద్ద నుండి ప్రజా సంకల్ప పాదయాత్రను ప్రారంభించారు. 2003లో తన తండ్రి వైయస్ రాజశేఖర రెడ్డి తరహాలోనే తిరుపతి స్వామి వారి దర్శనానంతరం ప్రారంభించిన పాదయాత్ర ముగింపు సందర్భంగా గత నెలలో తిరుమలేశుని దర్శించుకోవడంతో ముగించారు. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో పార్టీని సమాయత్తం చేయడానికి ఈనెల 6న రాష్ట్రవ్యాప్త సమర శంఖారావం సమావేశాలకు జగన్ తిరుపతి నుండే శ్రీకారం చుడుతున్నారు. ఈనెల మూడోవారం వరకూ కొనసాగనున్న ఈ సమావేశాల పరంపరను 6వ తేదీ సాయంత్రం 4 గంటలకు తిరుపతి నగర శివార్లలోని యోగానంద ఇనిస్టిట్యూట్ సమీపంలో నిర్వహించే చిత్తూరు జిల్లా సమావేశంలో ప్రారంభిస్తున్నారు. ఈ సమావేశంలో చిత్తూరు జిల్లాకు చెందిన 14 నియోజకవర్గాల నుండి బూత్ కమిటీ సభ్యుల నుండి నియోజకవర్గాల సమన్వయకర్తలు, పార్టీ శాసన సభ్యుల వరకు పాల్గొంటారు. సమావేశం ముగిసిన తరువాత జగన్ కడప వెళ్లి 7వ తేదీ ఆ జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఆపై అనంతపురం, కర్నూలు మీదుగా నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో పర్యటిస్తూ ఆయా జిల్లాల్లో సభలు నిర్వహించనున్నారు. సమర శంఖారావం పేరుతో నిర్వహించే ఈ సమావేశాల పరంపరలో భాగంగా పార్టీని ఎన్నికలకు సన్నద్ధం చేయడంతోపాటు ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యపర్చాల్సిన తీరుపై పార్టీ వర్గాలకు ఆయన దిశానిర్దేశం చేయనున్నారు. ఈనెల 17న ఏలూరులో నిర్వహించతలపెట్టిన బీసీ డిక్లరేషన్ సభను విజయవంతం చేయడానికి కూడా జిల్లా పార్టీ వర్గాలను సమాయత్తం చేయనున్నారు. తిరుపతిలో జరగనున్న సమర శంఖారావం సమావేశానికి జిల్లా నలుమూలల నుండి పార్టీవర్గాలను తరలించడానికి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.



తిరుపతి, రేణిగుంట ప్రాంతాల్లో నేటి జగన్ పర్యటన సమరశంఖారావానికి సిద్ధమైన ఏర్పాట్లు, వేదిక, స్వాగత తోరణాలు

వైసీపీలోకి ఖలీల్‌బాషా

- తనయులతో జగన్ సమక్షంలో చేరిక



కడప, ప్రభన్యూస్, బ్యూరో : జగన్ సొంత జిల్లాలో వైసీపీ మరింత బలోపేతంపై గురిపెట్టింది. సమీకరణలపై దృష్టిసారించిన వైసీపీ తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీ నేతల్ని పార్టీలో చేర్చుకుంటోంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ మంత్రి రామచంద్రయ్య, తెలుగుదేశం పార్టీకి చెందిన రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డిని పార్టీలోకి ఇటీవలే చేర్చుకుంది. తాజాగా కడపకు చెందిన మైనార్టీ నేత మాజీ మంత్రి డాక్టర్ ఖలీల్ బాషకు కూడా వైసీపీ కండువా కప్పింది. ఖలీల్ బాష తన ముగ్గురు తనయులతో కలసి మంగళవారం జగన్ నివాసంకు వెళ్ళి ఆయన వద్దే పార్టీలో చేరారు. మరల తెలుగుదేశానికి దగ్గరై ఆ పార్టీలో కొనసాగుతూ వస్తున్నారు. కడప పార్లమెంటు టిక్కెట్ తనకు గానీ, తన తనయుడు సోహైల్‌కు గానీ ఇవ్వాలని పార్టీనుంచి ఆశించారు. అయితే వారికి అవకాశం ఇవ్వలేదు. కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ మంత్రి అహ్మదుల్లాలు ఆయన తనయుడు అష్రఫ్‌ను పార్టీలో చేర్చుకుంది. ఆశావహులతో అధిష్టానం మాట్లాడలేదు. దీంతో అశావహులతోపాటు ఖలీల్‌బాష కూడా అసంతృప్తికి గురయ్యారు. ఆయనను మూడు రోజుల క్రితం వైసీపీ నేతలు మాజీ ఎంపీ అవినాష్‌రెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్యే అజంద్‌బాషలు కలసి మాట్లాడి పార్టీలోకి ఆహ్వానించడంతో మంగళవారం ఆయన జగన్ సమక్షంలో పార్టీలో చేరారు. ఆయనతో పాటు తనయుడు సొహైల్, సిద్దూ, తోషిబ్‌లు కూడా పార్టీలో చేరారు. ఈ కార్యక్రమానికి కడప ఎమ్మెల్యే అంజద్‌బాష కూడా హాజరయ్యారు.

మైనార్టీలకు ప్రాధాన్యం లేదు: ఖలీల్‌బాష

తెలుగుదేశం పార్టీలో మైనార్టీలకు ప్రాధాన్యం లేదు. కాబట్టే వైసీపీలో చేరానని మాజీ మంత్రి ఖలీల్‌బాష తెలిపారు. సీఎం చంద్రబాబు 2014 లో రాష్ట్రంలో ఒక్కసీటు కూడా మైనార్టీలకు ఇవ్వలేదని అయినా అధికారంలోకి వచ్చారని భావిస్తూ మైనార్టీలకు ప్రాధాన్యం ఇవ్వలేదని పేర్కొన్నారు. జగన్ సమక్షంలో తాను ఎలాంటి డిమాండ్ పెట్టలేదని తన పిల్లల భవిష్యత్తు చూసుకోవాలని చెప్పానని, నా సర్వీస్‌ను పార్టీకి ఉపయోగిస్తున్నానని తగిన ప్రాధాన్యం ఇవ్వాలని కోరినట్లు ఆయన తెలిపారు.

దక్షిణ మధ్య రైల్వే
T.N.No.B-SG-P-T-9-IPS-2018-19 Dt.01.02.2019
దిగువ తెలిపిన పనుల కొరకు భారత రాష్ట్రపతి తరపున సిగ్నల్ & టెలికాం (ప్రాజెక్ట్), దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ వారు బహిరంగ టెండరు/సింగిల్ ప్యాకెట్ టెండరింగ్ విధానంలో ఇ-టెండరు కోరుతున్నారు.



బడ్జెట్ 2019-20

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి పెద్దపీట

• రూ.35,182.61 కోట్లు కేటాయింపు • గతం కంటే 50.10 శాతం పెంపు! • డప్పు కళాకారులకు 800శాతం పెంపు

అమరావతి, ఆంధ్రప్రభ : ఓట్ ఆన్ ఎకౌంట్ బడ్జెట్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకి పెద్దపీట వేశారు. గతేడాది రూ.23,439.21 కోట్లు కేటాయించగా వాటికి అదనంగా రూ.31, 208.82 కోట్లు ఖర్చు పెట్టారు. ఈఏడాది ఏవిభాగానికి లేనంతగా భారీ కేటాయింపులు చేశారు. గతంలో కేటాయించిన నిధులను 50.10 శాతానికి పెంచి రూ.35,182.61 కోట్లను కేటాయించారు. అదేవిధంగా బడ్జెట్‌లో డప్పు కళాకారులకు అగ్రతాంబూలం లభించింది. గతేడాది రూ.12 కోట్లు కేటాయించగా ఈఏడాది ఆనిధులను భారీస్థాయిలో 800శాతం పెంచి రూ.108 కోట్లు కేటాయించింది. డ్వాక్రా మహిళలకు పసుపు-కుంకుమ కింద గత సంవ త్సరం రూ.1700కోట్లు కేటాయించగా దానిని 135.29శాతం పెంచి రూ.4000కోట్లు కేటాయించింది. వీటితోపాటు డ్వాక్రాలో మహిళలకు వడ్డీలేని రుణాలకు గతేడాది రూ.1000 కోట్లు కేటాయించగా 10శాతం పెంచి రూ.1100కోట్లు కేటాయించారు. అదేవిధంగా ఎన్టీఆర్ పెన్షన్ కింద వృద్ధులకు, వితంతువులకు ఇచ్చే



పింఛన్ నగదును రెట్టింపు చేసిన నేపథ్యంలో వాటికోసం బడ్జెట్లో ఎక్కువ మొత్తంలో కేటాయింపులు చేశారు. గతేడాది వీటికోసం రూ.4200కోట్లు కేటాయిం చగా వాటిని 147.64శాతం పెంచి రూ.10,401.05కోట్లు కేటా యింపు చేశారు. వీటితోపాటు విభిన్న ప్రతిభావంతు లకు గతేడాది రూ.740కోట్లు కేటాయించగా ఈఏడాది 188.33 శాతానికి పెంచి రూ.2133.62కోట్లు చేశారు. ఎయిడ్స్ రోగులకు ఇచ్చే పెన్షన్‌కు గతేడాది రూ.38కోట్లు కేటాయించగా వాటిని 163.67శాతం పెంచి రూ.100కోట్లు కేటాయించింది. కల్లుగీత కార్మికులకు ఇచ్చే పెన్షన్‌కు గతంలో రూ.22కోట్లు కేటాయింపు జరిపిన ప్రభుత్వం దానిని 246.85శాతానికి పెంచి రూ.76.31కోట్లు కేటాయిం చారు. ఉపాధి హామీ పథకానికి గతంలో రూ.750కోట్లు కేటాయించగా వాటిని 33.33శాతానికి పెంచి రూ.1000కోట్లు కేటాయించారు. అదేవిధంగా గ్రామీ ణ ప్రాంతాల్లో అనుసంధాన రహదారుల కోసం గతేడాది రూ.230కోట్లు కేటాయిం చగా వాటి శాతాన్ని 44.02కు పెంచి 331.24కోట్లు కేటాయించారు. ఎన్ఆర్ఈజీపీ పనులకు గతంలో రూ.100కోట్లు కేటాయించగా వాటిని 24.05శాతం పెంచి రూ.124కోట్లు, పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో రహదారుల ఖర్చుల కింద రూ.25కోట్లు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం ఈఏడాది రెట్టింపు చేసి రూ.5 0కోట్లు చేశారు. పంచాయితీరాజ్ రహదారులను పునర్నిర్మించడానికి గతేడాది రూ.25 కోట్లు కేటాయించిన నేపథ్యంలో వాటిని రెట్టింపు చేసి రూ.50కోట్లు కేటాయించారు. వీటితోపాటు మహిళా శిశు, దివ్యాంగులు, వృద్ధులకు గతంలో రూ.3007.97కోట్లు కేటాయింపు చేయగా రూ.2226.41కోట్లు మంజూరు చేయగా, ఈఏడాది 13.32 శాతం పెంచి రూ.3408.66 కోట్లు కేటాయించారు. వీటితోపాటు దివ్యాంగుల సంక్షే మానికి గతంలో రూ.35కోట్లు కేటాయించగా వాటిని రెట్టింపు చేస్తూ నిర్ణయం తీసు కున్న ప్రభుత్వం రూ.70కోట్లు కేటాయించింది. రాష్ట్ర ఐటీ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగా నికి గతంలో రూ.1006.90 కోట్లు కేటాయించి రూ.954.55కోట్లు మంజూరు చేశారు. ఈఏడాది గతం కంటె ఒక శాతం తగ్గించి రూ.1006.81కోట్లు కేటాయించడం గమనార్హం.

కార్పొరేషన్లు లేని వర్గాలకు ప్రాధాన్యం

సీఎం చంద్రబాబు ఆదేశం

అమరావతి, ఆంధ్రప్రభ : కొత్తగా ఏర్పాటయిన బీసీ కార్పొరేషన్ల పరిధిలోకి రాని, కార్పొరేషన్లు లేని బీసీలకు ప్రభుత్వ ఆర్థిక పథకాల అమలులో అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన బుధవారం తన కార్యాలయం నుంచి ఒక ప్రకటనను విడుదల చేశారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని సీఎం భరోసా ఇచ్చారు. పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం చేస్తున్న బీసీ కార్పొరేషన్ ద్వారా అమలు జరుగుతున్న ఆర్థిక చేయూత కార్యక్రమాలతో బీసీ కార్పొరేషన్ల పరిధిలోకి ఇంకా తీసుకురాని బీసీ సామాజిక వర్గాలయిన సూర్య బలిజ, కూరాకుల, అచ్చుకట్లవాండ్ల, జక్కల సామాజిక వర్గాలకు ఎక్కువ ప్రాముఖ్యత నివ్వాలని సీఎం అధికారులకు సూచించారు. ఆయా సామాజిక వర్గాల నుంచి వచ్చి న అభ్యర్థనలు, ప్రతిపాదనల మేరకు ముఖ్యమంత్రి తక్షణం స్పందించారు.

మున్సిపల్ శాఖకు రూ.7,979.34 కోట్లు

• గతేడాదితో పోలిస్తే 3.08శాతం ఎక్కువ • మున్సిపాలిటీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.100 కోట్లు

అమరావతి, ఆంధ్రప్రభ : అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు 7979.34 కోట్లు కేటాయించారు. గత ఏడాది 7740.80 కోట్లు కేటాయించారు. గతేడాదితో పోలిస్తే 3.08 శాతం అధికంగా కేటాయించనట్లే. అలాగే మున్సిపాలిటీల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం వంద కోట్లు కేటాయించారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు కేటాయింపులపై ఆర్థికమంత్రి రామకృష్ణుడు అసెంబ్లీలో మాట్లాడుతూ పట్టణ మౌళిక సదుపాయాల కోసం గత నాలుగున్నరేళ్లలో రూ. 4707 కోట్లు వెచ్చించి వివిధ పట్టణాభివృద్ధి కార్య క్రమాలను ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. గత నాలుగున్నరేళ్లలో 8858 కిలోమీటర్ల రోడ్లు వేశామన్నారు. 3055 కిలోమీటర్ల మురుగునీటి కాల్వలు, 2381 కిలోమీటర్ల వరదనీటి కాల్వలు వేశామని అన్నారు. విజయవాడ, కాకినాడ, తిరుపతి, అమరావతితో పాటు శ్రీకాకుళం, ఒంగోలు, నెల్లూరు, అనంతపురం, కర్నూలు, ఏలూరులను కూడా సుందర నగరాలుగా ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందన్నారు. కాగా శాసనమండలిలో పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. మండలిలో మంత్రి నారాయణ నేడు ఆరవసారి బడ్జెట్ ప్రవేశపెట్టారు.

రూ.62 వేల కోట్లు ఏపీకిచ్చాం!

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకునే ఎక్స్టర్నల్లీ ఎయిడెడ్ ప్రాజెక్ట్ (ఈఏపీ)ల కోసం తీసుకునే రుణాలు వాటిపై వడ్డీని కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందని మంత్రి చెప్పారు. 2015-16 నుంచి రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న ఈఏపీ ఒప్పందాలకు సంబంధించి 15.81 కోట్లు వడ్డీని చెల్లించాల్సిందిగా ఏపీ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తి మేరకు నిధులను విడుదల చేసినట్లు చెప్పారు. ప్రత్యేక ప్యాకేజీని ఆమోదిస్తూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకున్నందుకు ధన్యవాదాలు తెలుపుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి 2017 మే 2న తమకు లేఖ రాశారని ఆర్థిక మంత్రి వెల్లడించారు. అలాగే విడుదల చేసిన నిధుల వినియోగానికి సంబంధించి రాష్ట్రప్రభుత్వం నుంచి యుటిలైజేషన్ సర్టిఫికెట్లు వచ్చిన వెంటనే విడతల వారీగా తదుపరి నిధులను విడుదల చేయడం జరుగుతుందని అన్నారు.

నాది పోలీసు కుటుంబం

(మొదటిపేజీ తరువాయి)

తెలుసుకున్నానే తప్ప తనను ఇంతవరకు నేరుగా ఎవరూ అడగలేదని, దీనిపై ప్రభుత్వం వివరణ అడిగితే ఇస్తానని డీజీపీ పేర్కొన్నారు. అదేవిధంగా తాను తొలినుంచి నీతి, నిజాయితీతో అంచెలంచెలుగా ఎదిగి నేడు డీజీపీ స్థాయికి చేరుకున్నానని పేర్కొన్నారు. నా పనితీరే నాకు ప్రామాణికమని, ఇతరుల మాటలను పట్టించుకోవాల్సిన అవసరంలేదని, ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పోలీసు వ్యవస్థ పనిచేస్తుందని డీజీపీ పేర్కొన్నారు. తనకు సీనియారిటీ ప్రకారమే ప్రమోషన్ వచ్చిందని, ఇతర పద్ధతుల ద్వారా తనకు ఉన్నత పదవి లభించలేదని పేర్కొన్నారు. పోలీసులకు ఓ కులం, మతం అంటూ ఏమీలేదని, అన్ని రాజకీయ పక్షాలు, అన్నివర్గాల ప్రజలను తాము సమదృష్టితో చూస్తామని, శాంతిభద్రతలను కాపాడటమే తమ ముందున్న ఏకైక లక్ష్యమని డీజీపీ ఆర్పీ ఠాకూర్ మీడియాకు వెల్లడించారు.

కల్యాణకట్ట మేడపై నుంచి పడి

చిన్నారి మృతి



తిరుమల, ప్రభ న్యూస్ : తిరుమ లలోని ప్రధాన కల్యాణకట్ట మేడపై నుంచి పడి చిన్నారి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. సంఘుట నకు సంబంధించిన వివారలిలా ఉన్నాయి. బ్రతుకు తెరువుకోసం చంద్ర కాంత్, దుర్గాదేవి వారి కుమార్తె చంద్రిక (06)లతో కలసి గత 8 సంవత్సరాల క్రితం తిరుమలకు వచ్చారు. ఈ నేపథ్యంలో వారు హోటళ్ళలో సర్వర్‌లుగా పనిచేసే వారు. కాగా మంగళవారం చిన్నారి చంద్రిక తిరుమలలోని ప్రధాన కల్యాణకట్టలో లిఫ్ట్ ఆట ఆడుకుంటూ మూడవ అంతస్తుకు చేరుకుంది. ఈ క్రమంలో పాపపై నుంచి చూస్తుండగా కాలుజారి క్రిందపడింది. దీంతో చుట్టుప్రక్కలవారు, తల్లిదండ్రులు హుటాహుటిన పాపను స్థానిక అశ్విని ఆసుపత్రికి తరలించారు. కాగా పాప అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించడంతో తల్లిదండ్రులు శోకసముద్రంలో మునిగిపోయారు. పోస్టుమార్టం నిమిత్తం చిన్నారి మృతదేహాన్ని తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు.

బాలు మాతృమూర్తి శకుంతలమ్మకు కన్నీటి వీడ్కోలు

నెల్లూరు కల్చరల్, ప్రభన్యూస్ : ప్రముఖ సినీ గాయకులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం మాతృమూర్తి శ్రీ పతి పండితారాధ్యుల శకుంతలమ్మ(89) అంత్యక్రియలు మంగళవారం నెల్లూరు నగరంలోని బోడిగాడితోట కైలాస భూమిలో సాంప్రదాయ బద్ధంగా జరిగాయి. శ్రీపతి పండిరాధ్యుల శకుంతలమ్మ వయోభారంతో సోమవారం పరమపదించిన విషయం తెలిసిందే. మాతృమూర్తి మరణ సమాచారం అందుకున్న ఎస్పీ బాలు లండన్ నుంచి ప్రత్యేక విమానంలో చెన్నై చేరుకుని అక్కడి నుంచి కారులో నెల్లూరుకు వచ్చారు. ఎస్పీ బాలు రాకతో ఆ ప్రాంతంలో గంభీర వాతావరణం నెలకొంది. నేరుగా తల్లి పార్ధీవ దేహం వద్దకు చేరుకున్న బాలసుబ్రహ్మణ్యం ఆమెకు పాదాభివందనం చేసి ఘనంగా నివాళులర్పించారు. చిన్నపిల్లవాడిలా మూగగా రోదించారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం రాకతో కుటుంబ సభ్యులు మౌనంగా విలపించడం చుట్టుపక్కలవారికి కంటనీరు తెప్పించింది. అనంతరం సాంప్రదాయబద్ధంగా శకుంతలమ్మ పార్ధీవ దేహాన్ని ప్రత్యేక అలంకరణ చేసిన వైకుంఠ రథయాత్ర వాహనంలో కైలాస భూమికి తీసుకెళ్లారు. అక్కడ ఆమె పార్ధీవ దేహాన్ని సాంప్రదాయబద్దంగా ఖననం చేశారు. శకుంతలమ్మ అంతిమయాత్రలో పలువురు సినీ ప్రముఖులు, పురప్రముఖులు పాల్గొన్నారు. అంతకుమందు శకుంతలమ్మ పార్ధీవ దేహాన్ని సందర్శించిన పలువురు ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖులు పూలవూలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. కుమారులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, అల్లుడు శుభలేఖ సుధాకర్, ఆయన సతీమణి ఎస్పీ శైలజ, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తల్లి పార్ధీవ దేహానికి కుమార్తెలు పార్వతీ, వసంతలు పాదాభివందనం చేసి, ఘనంగా నివాళులర్పించారు. శకుంతలమ్మ పార్ధీవ దేహాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో శాంతాబయోటిక్ అధినేత వరప్రసాద్‌రెడ్డి, సినీ రచయితలు భువనచంద్ర, వెన్నెలకంటి, సంగీత దర్శకులు వాసురావు, మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, తుంగా శివప్రభాత్‌రెడ్డి, నలుబోలు బలరామయ్యనాయుడు, డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం, గ్రోసు గోపాలయ్య, వైసీపీ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ రూప్‌కుమార్ యాదవ్, సుబ్బారావు, తదితరులు ఉన్నారు.

విద్యకు అగ్రపీఠం

• హయ్యర్ ఎడ్యుకేషన్‌కు రూ.3,171.63 కోట్లు
• సెకండరీ ఎడ్యుకేషన్‌కు రూ.22,783.37 కోట్లు
• గత బడ్జెట్ కన్నా అదనపు కేటాయింపులు



అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్ర విభజన నేపథ్యంలో ఏర్పడిన అనేక సవాళ్లు మధ్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో విద్యా శాఖకు సమున్నత స్థానం కల్పిస్తూ కేటాయింపులు చేయడం గమనార్హం. ఈసారి బడ్జెట్‌లో గతంలో కన్నా అధిక కేటాయింపులు చేస్తూ,ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోవడం ప్రశంసలందుకుంటోంది. గత కేటాయింపులు బేరీజు వేసు కుంటూ విద్యా రంగం అభివృద్ధికి బాటలు వేసింది. సమాజంలో పెరిగిపోతున్న ఆర్థిక అసమానతలు తొలగింపునకు విద్య కీలకపాత్ర పోషించాలన్న దృక్పథంతో రాష్ట్ర ప్రభుత్వం స్ఫూర్తిదాయకమైన సానుకూల వాతావరణ కల్పించింది. అన్ని వర్గాల ప్రజలకు అత్యున్నత విద్యను అందించేందుకు చర్యలు తీసుకున్నది. 2019-20ఆర్థిక సంవత్సరానికి మానవ వనరుల అభివృద్ధికి రూ. 29,955 కోట్లు కేటాయించడం గమనార్హం. మొత్తం బడ్జెట్‌లో ఈ కేటాయింపులు సుమారు 11. 5 శాతంగా ఉన్నాయి. 2019-20 ఆర్థిక సంవత్సరానికి ఎన్టీఆర్ విదేశీ విద్యాదరణ పథకానికి రూ. 100 కోట్లు కేటాయించారు. గత ఏడాది రూ.68.08 కోట్లు కేటాయించారు.

అంటే ఈసారి ఈ కేటాయింపులు 46.88 శాతంగా ఉన్నాయి. హైయ్యర్ ఎడ్యుకేషన్‌కు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.3171.63 కోట్లు కేటాయించారు. అంటే 11.88 శాతం నిధులు అదనంగా కేటాయిం చారు. గత సంవత్సరం రూ.2734.99 కోట్లు కేటాయించారు. అలాగే సెకండరీ ఎడ్యుకేషన్‌కు ఈసారి రూ. 22783.37 కోట్లు కేటాయించారు. 5.42 శాతం అదనంగా కేటాయించారు.గత ఏడాది రూ. 18524.82 కోట్లు మాత్రమే కేటాయించారు. ప్రభుత్వ పాఠశాలలో బాలికల నమోదును పెంపొందించి,మ ధ్యలోనే విద్యను విరమించే వారి నిష్పత్తిని తగ్గించే లక్ష్యంతో 'బడికొస్తా' పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టి,విజయవంతంగా అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా 1.87 లక్షల బాలికలకు సైకిళ్లు అందించి, ప్రోత్సహించింది. కిశోర ప్రాయంలోని బాలికలను తిరిగి పాఠశాలలో భర్తీ అయ్యే దిశగా ప్రోత్సహించడానికి, వారికి మెరుగైన పోషక విలువలతో కూడిన పౌష్టికాహారా న్ని , ఇతర శిక్షణల ను సబల పథకం ద్వారా విజయవంతంగా అమలు చేస్తున్నారు.

పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకం కింద అన్ని వర్గాలకు చెందిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ రేట్లను ప్రభుత్వం పెంచింది. డిపార్ట్‌మెంట్ అనుబంధ హాస్టళ్లకు 33 శాతం వరకు, కళాశాల అనుబంధ హాస్టళ్లకు 131 శాతం, డేస్కాలర్లకు 150 శాతం వరకు రూ.71 లక్షల రూపాయల స్కాలర్‌షిప్‌లను అన్ని సామాజిక వర్గాల విద్యార్థులకు అందించడం జరుగుతుంది. 14.5 లక్షల మంది ఎస్‌సిలకు, 2.8 లక్షల మంది ఎస్.టి.36.9లక్షల మంది బీసీ, 11.5 లక్షల మంది ఈబీసీ , 5. 4 లక్షల మంది మైనార్టీలు, 2,666 మంది దివ్యాంగులకు మొత్తం రూ. 2, 833 కోట్ల రూపాయలను ఇప్పటివరకు ఖర్చు పెట్టడం జరిగింది. హాస్టల్ ,రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులకు చెల్లించేకాస్మోటిక్స్ చార్జీలు, హెయిర్ కట్ చార్జీలు, యూనిఫామ్ కుట్టుకూలిని 150 శాతం వరకు పెంచడం జరిగింది. మొట్ట మొదటిసారిగా కాలేజీ పోస్టుమెట్రిక్ హాస్టళ్ల విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలను మంజూరు చేయడం జరిగింది. వెనుకబడిన తరగతులకు , మైనార్టీల వర్గాలు,ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు చెందిన విద్యార్థులను విదేశీ విద్యా పథకం పరిధిలోకి తీసుకురావడం జరిగింది. అంబేద్కర్ విదేవీ విద్య పథకం కింద ఎస్సీ,ఎస్టీ మైనార్టీలకు చెందిన విద్యార్థులకు విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించడానికి మంజూరు చేసే స్కాలర్‌షిప్ మొత్తాన్ని 10 లక్షల నుంచి 15 లక్షలకు పెంచడం జరిగింది. బీసీ విద్యార్థులకు కూడా విదేశీ విశ్వ విద్యాలయాల్లో పోస్టు గ్రాడ్యుయేట్ విద్యను అభ్యసించడానికి రూ. 10లక్షల సహాయం అందించడం జరుగుతుంది. ఈ పథకం కింద గత ఐదు సంవత్సరాల్లో మొత్తం 4, 528 మంది విద్యార్థులు లబ్ది పొందారు.అంతే కాకుండా యుపిఎస్‌సి సివిల్ సర్వీస్ పరీక్షల వంటి పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రైవేట్

విద్యా పురోభివృద్ధికి మరిన్ని చర్యలు

సంస్థల్లోని నిపుణులు మార్గదర్శకత్వాన్ని అందించేందుకు ప్రభుత్వం ఎన్టిఆర్ ఉన్నత విద్యాదరణ నూతన పథకాన్ని ప్రవేశపెట్టడడం జరిగింది. వారికి 9 నెలల కాలానికి నెలకు రూ. 10వేలు చొప్పున ఉపకారవేతనం చెల్లిస్తున్నారు. ఈ పథకం కింద 9,524 మంది విద్యార్థులకు రూ. 143 కోట్ల లబ్ధి చేకూరింది. బడికొస్తా,మన ఊరు మనబడి, బడి పిలుస్తోంది వంటి పథకాలతో పాటు డిజిటల్ క్లాస్ రూమ్‌లు,ఇ-హాజర్ కార్యక్రమాలను మేళవించి విద్యానాణ్యత పెంచడంతోపాటు,సర్వ శిక్ష అభియాన్ ఫలితాలనుమెరుగు పర్చడానికి బడిలో చేరే విద్యార్థుల సంఖ్యను పెంచడంతోపాటు వారు బడి మానకుండా చూడడంపై ప్రభుత్వం దృష్టిపెట్టి,నిధులుకేటాయించింది. దీని వల్ల బడిలో చేరే విద్యార్థుల నిష్పత్తి 86 శాతానికి చేరుకుంది. ప్రాథమికోన్నత విద్యలో 84 శాతం పెరిగింది. మధ్యాహ్న భోజన పథకం కింద 45,505పాఠశాలల్లో చదువుతున్న 33,72,372 మంది పిల్లలకు పౌష్టికాహారాన్ని అందిస్తుంది. ఈ పథకం కింద 2018-19 సంవత్సరంలో కేవలం పాఠశాలల్లోనే కాకుండా 450 ఇంటర్మీడియెట్ ప్రభుత్వ కాలేజీల్లోని 1. 75 లక్షల మంది విద్యార్థులకు కూడా ఆహారాన్ని అందించడం జరిగింది. పాలిటెక్నిక్ విద్యనుకూడా విస్తరిస్తున్నారు. ఇక ఉన్నత విద్యలోకూడా మౌళికసదుపాయాలు కల్పిస్తూ నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. జాతీయ స్థాయిలో అత్యుత్తమ విద్యా సంస్థలలో గుర్తింపబడిన 100 విశ్వ విద్యాలయాల్లో 6 విశ్వ విద్యాలయాలు మన రాష్ట్రంలోనే ఉండడం గమనార్హం. ప్రైవేట్ విశ్వ విద్యాలయాల చట్టాన్ని అమలు చేయడం వల్ల 11 విశ్వ విద్యాలయాలు రాష్ట్రంలో తమ విద్యా సంస్థల స్థాపనకు ముందుకు వచ్చాయి. రాబోయే 10ఏళ్లలో 1, 72,982 మంది విద్యార్థుల్లో 11,360 కోట్ల రూపాయల పెట్టుబడిని ఈకార్యక్రమాలకు కేటాయించడం జరిగింది

వ్యవసాయానికి భారీ నిధులు

• గతేడాది కంటే 26.10శాతం అధిక కేటాయింపులు
• రూ.5వేల కోట్లతో 'అన్నదాత సుఖీభవ' పథకం
• పంట ఉత్పత్తుల కొనుగోలుకు రూ.1000 కోట్లు



అమరావతి, ఆంధ్రప్రభ : చంద్రబాబు ప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టిన 2019-20 ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో వ్యవసాయం, దాని అనుబంధ రంగాల అభివృద్ధికి భారీగా నిధులను కేటాయించడం జరిగింది. రాష్ట్ర జనాభాలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 62 శాతం మంది ప్రజలు వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్న నేపథ్యంలో వారి ఆదాయాన్ని రెట్టింపు చేయాలనే లక్ష్యంగా ఏటేటా కొత్త పథకాలను ప్రవేశపెడుతూ భారీగా నిధులను టీడీపీ సర్కార్ కేటాయిస్తోంది. ఆనవాయితీగానే గత ఏడాది రూ. 10,097.42 కోట్లతో పోలిస్తే ఈ ఏడాది 26.10 శాతం అధికంగా కేటాయింపు చేస్తూ రూ.12,732.97 కోట్ల అంచనాలను ప్రకటించింది. 2014లో అధికారం చేపట్టిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.24 వేల కోట్ల రైతు రుణమాఫీని, మరో రూ.384 కోట్ల ఉద్యాన రైతు మాఫీని ప్రకటించడం జరిగింది. మాట ఇచ్చిన ప్రకారమే అర్హులైన రైతుల రుణమాఫీని చేయడంతోపాటు ఆఖరి రెండు వాయిదా మొత్తాలను రైతు ఖాతాల్లో జమ చేసేందుకు తగిన చర్యలు చేపట్టింది. రాష్ట్రస్థూల వార్షికోత్పత్తిలో 32 శాతం వాటాను కలిగిన వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్న సంకల్పంతో ఈ ఏడాది అన్నదాత సుఖీభవ అనే కొత్త పథకానికి శ్రీకారం చుట్టి రూ.5 వేల కోట్లను కేటాయించడం జరిగింది. అతి త్వరలో దీని విధివిధానాలను రూపొందించి సాగుకు ముందే రైతులకు పెట్టుబడి సాయాన్ని చంద్రబాబు ప్రభుత్వం అందించనుంది. అలాగే కష్టకాలంలో రైతుల నుంచి పంట ఉత్పత్తులను మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు రూ.1,000 కోట్లు, వ్యవసాయ యాంత్రీకరణకు రూ.300.17 కోట్లు, పంటల భీమా కోసం రూ.200 కోట్లు, ఫుడ్ ప్రాసెస్ కోసం రూ.400 కోట్లు, ఉద్యాన రంగాభివృద్ధికి రూ.124 కోట్లను కేటాయించడంపై రైతు లోకం హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తోంది.



సమన్వయంతో పటిష్ట భద్రత

• సమాచార మార్పిడికి అంగీకారం • సాయుధ బలగాల సమీకరణ • తీవ్రవాదం, నక్సలిజంపై నిఘా • ఆరు రాష్ట్రాల డీజీపీల భేటీలో నిర్ణయాలు

తిరుపతి, ప్రభన్యూస్ బ్యూరో : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆరు రాష్ట్రాల పోలీసుశాఖ డీజీపీలు, ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. మంగళవారం తిరుపతిలో అంతర్రాష్ట్ర పోలీసు సమన్వయ సమావేశం నిర్వహించారు. స్థానికంగా ఓ ప్రైవేటు హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రాల మధ్య సార్వత్రిక ఎన్నికలు, అంతర్రాష్ట్ర ఉగ్రవాదం, బలగాల మోహరింపు, ఇంటలిజెన్స్ సమాచారం మార్పిడి వంటి పలు అంశాలపై పూర్తి స్థాయిలో చర్చించారు. అదేవిధంగా రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు నెలకొనే నిమిత్తం ప్రత్యేక అధికారులను కూడా ఈ సమావేశంలో నియమించారు. ఎన్నికల క్రతువులో ఆరు రాష్ట్రాల మధ్య సమన్వయం కోసం నోడల్ అధికారుల నియామకం చేపట్టనున్నారు. ఈ మేరకు ఆయా రాష్ట్రాల సరిహద్దు సంబంధిత అంశాలపై తరచూ సమీక్షా సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. పొరుగు రాష్ట్రాల మధ్య సమాచార మార్పిడి, సమాచార ప్రసార పరికరాల భాగస్వామ్య వినియోగం, సాయుధ బలగాల సమీకరణ, సమన్వయం వంటి అంశాలపై పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ డీజీపీ ఆర్పీ ఠాకూర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం సహకారంతో ఆరు రాష్ట్రాల అంతర్రాష్ట్ర సమన్వయ సమావేశం నిర్వహించా మన్నారు. ప్రధానంగా రాష్ట్రాల మధ్య తీవ్రవాదం, అక్రమ మద్యం, నగదు నియంత్రణ, అసాంఘిక శక్తుల కదలికలు సరిహద్దు ప్రాంతాల తనిఖీ కేంద్రాలు, నక్సలిజంపై నిఘా వంటి సున్నితమైన అంశాలపై ఐక్య కార్యాచరణ ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. కీలక సమాచార మార్పిడి కోసం భాగస్వామ్య యంత్రాంగం ఏర్పాటు, సమస్యాత్మక ప్రాంతాల్లో పటిష్ట నిఘా కోసం హెలికాప్టర్లు, స్పీడ్ బోట్ల వంటి వాటిపై భాగస్వామ్య వినియోగ ప్రణాళికలు తయారు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్నాటక, తమిళనాడు డీజీపీలు, నీలమణిరాజు, రాజేంద్రన్, తెలంగాణ, ఏపీల హోమ్ సెక్రెటరీలు రాజీవ్ త్రివేది, అనురాధ, ఇంట లిజెన్స్ బ్యూరో జెడి చంద్రశేఖర్, ఇతర ఏడీజీలు, ఐజీపీలు, డీఐజీలు పాల్గొన్నారు.

వర్గీకరణపై నోరు మెదపని

అధికార, ప్రతిపక్ష పార్టీలు

• విశ్వరూప మహాసభలో మాదిగల సత్తా చాటుతాం
• ఎమ్మార్పీయస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



మొలకలచెరువు, ప్రభన్యూస్: రాష్ట్రంలో ఎస్సీ కులాలను ఎ, బి, సి, డి వర్గీకరణ చేపట్టాలని ఐదు సంవత్సరాల నుంచి సుదీర్ఘ పోరాటాలను చేస్తున్నామని కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లతో పాటు ప్రతిపక్ష పార్టీలు కూడా నోరు మెదపడం లేదని ఎమ్మార్పీయస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. మంగళవారం చిత్తూరు జిల్లాలోని తంబళ్ళపల్లె నియోజక వర్గంలోని మొలకలచెరువు మండల కేంద్రంలో నియోజకవర్గ స్థాయి ఎమ్మార్పీయస్ నాయకుల సమావేశం నిర్వహించారు. విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ఫిబ్రవరి 19న విజయవాడలో జరిగే విశ్వరూప మహాసభకు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన ఎమ్మార్పీయస్ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాలు, మాదిగ సోదర సోదరీమణులు తరలి రావాలని కోరారు. మాదిగలను అన్ని పార్టీలు మోసం చేస్తున్నాయని అన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డిలు కేంద్ర ప్రభుత్వాలకు లేఖలు రాశారని కానీ రాష్ట్రం విడిపోయిన తరువాత ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎస్సీ వర్గీకరణపై నోరు మెదపడం లేదని అన్నారు. ప్రతిపక్ష పార్టీకి చెందిన నాయకుడు జగన్ మోహన్‌రెడ్డి కూడా ఈ విషయంపై ఎలాంటి ప్రకటనలు చేయలేదని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మాదిగలు 39 లక్షల మంది ఉండగా మాలలు 41 లక్షల మంది ఉన్నారని అన్నారు. ఎక్కువ ప్రాధాన్యత మాలలకు ప్రభుత్వం ఇస్తున్నదని అన్నారు. మాదిగలను పూర్తి స్థాయిలో అణచివేయడానికి ప్రభుత్వాలు రాజకీయాలు చేస్తున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీయస్ రాష్ట్ర అధికార ప్రతినిధి నరేంద్ర బాబు, యువసేన పరిశీలకుడు చిన్న, జిల్లా నాయకులు వెంకటప్ప, భవానీ వెంకటేష్, చౌడప్ప, నియోజకవర్గ అధ్యక్షుడు ప్రతాప్ కుమార్, పిటియం జడ్పిటిసి ఈశ్వరప్ప, కురబలకోట అధ్యక్షుడు రమణ, నాయకులు సుధాకర్, మహేష్, తిరుపాల్, విజయ్ కుమార్, సుధాకర, బొజ్జప్ప, వెంకటరమణ, శ్రీనివాసులు, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.



బడ్జెట్ 2019-20

జలవనరులకు
నిధుల పరవళ్ళు

• రూ.16,852.27 కోట్ల కేటాయింపు • గత ఏడాది కన్నా రూ.2 వేల కోట్లు అధికం



అమరావతి, ఆంధ్రప్రభ : ఈసారి ప్రభుత్వం బడ్జెట్‌లో జలవనరుల శాఖకు ప్రథమ ప్రాధాన్యత ఇచ్చి, పెద్దపీట వేసిందని చెప్పవచ్చు. ఆమేరకు నిధుల కేటాయింపు కూడా చేశారు. పోలవరంతో సహా 29 ప్రాధాన్యత ప్రాజెక్టులను ఉద్యమస్ఫూర్తితో చేపట్టిన ప్రభుత్వం అంతే స్ఫూర్తితో పనులను శరవేగంగా నిర్వహిస్తూ ముందుకుపోతున్న సంగతి తెలిసిందే. ఇప్పటివరకు ప్రభుత్వం ఈ రంగంపై రూ. 64,334కోట్లు ఖర్చు చేయడం జరిగింది. 2022 నాటికి దేశంలో అగ్రగామి రాష్ట్రంగా తీర్చదిద్దేందుకు ప్రభుత్వం ఇరిగేషన్ రంగంపై ప్రత్యేక దృష్టిపెట్టి వేల కోట్లు ఖర్చు చేస్తుంది. వేల ఎకరాలను కొత్తగా సాగులోకి తీసుకొచ్చేందుకు,స్థిరికరించేందుకు చర్యలు తీసుకున్నది. జలవనరుల శాఖకు 2019-20 ఆర్థిక సంవత్సరంలో రూ. 16852.27 కోట్లు కేటాయించారు. గత ఏడాదిరూ. 14862.16 కోట్లు కేటాయించారు. ఎన్నో ఏళ్ల ఆంధ్రుల కల, రాష్ట్ర ప్రజల జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు డ్యామ్ శరవేగంగా పూర్తి చేసేందుకు కృషి జరుగుతోంది. దేశంలోనే అతిపెద్ద ప్రాజెక్టుల్లో ఒకటిగా ఉన్న పోలవరం ఊహించనరీతిలో నిర్మాణంలో ముందుకు దూసుకు పోతున్నది. మరో వైపు నదుల అనుసంధాన ప్రక్రియను ప్రభుత్వం వేగంగా చేస్తూ దేశానికే మార్గదర్శకం అవుతుంది. ఎన్నో ప్రతికూల పరిస్థితుల నడమ ప్రభుత్వం ప్రాజెక్టులను శరవేగంగా నిర్మిస్తోంది. నిధుల సమస్య ఉన్నా సొంత నిధులు వ్యయం చేస్తూ ఇరిగేషన్ రంగాభివృద్ధికి సత్వర చర్యలు తీసుకున్నది. కరవు సీమను ఉద్యానసీమగా మార్చేందుకు ప్రభుత్వం నడుంబిగించింది.

వ్యవసాయం,రైతుల అభివృద్ధికి నీటిపారుదల రంగాన్ని జీవనరేఖగా భావించిన ప్రభుత్వం ఈ రంగానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించి, ఖర్చు చేస్తుంది. ఇప్పటివరకు రూ. 64,334 కోట్లు జలవనరులకు ఖర్చు చేయడం జరిగింది. ఇప్పటివరకు ప్రాజెక్టుపై రూ. 15,587 కోట్లలలో రూ.10,499 కోట్లు 2014 తర్వాత ఖర్చు చేయడం జరిగింది. పోలవరం ప్రాజెక్టు ముందస్తు ప్రయోజనాలు పొందుటకు ప్రభుత్వం గోదావరి జలాలను కృష్ణానదిలోకి పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా మళ్లించడం జరిగింది. ఇప్పటివరకు గోదావరినుంచి 263 టిఎంసీల నీటిని కృష్ణానదిలోకి మళ్లించుట జరిగింది. పోలవరం ప్రధాన ఎడమకాలువ నుంచి గోదావరి , ఏలేరు నదులకు సంబంధించి పురుషోత్తమపట్నం లిఫ్ట్ స్కీంను ప్రారంభించడం జరిగింది. వంశధార ప్రాజెక్టు,తోటపల్లి రిజర్వాయర్ స్కీం, పులిచింతల ప్రాజెక్టు,తెలుగు గంట ప్రాజెక్టు,వెలిగొండ ప్రాజెక్టులను క్రమపద్ధతిలో పూర్తి చేసి,అతివృష్టి,అనావృష్టిల వల్ల కలిగే ఇబ్బందులను వీలైనంత తక్కువ స్థాయికి తగ్గించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నది.

రూ. 5,473.83 కోట్లతో
విద్యుత్ వెలుగులు

• గత బడ్జెట్ కన్నా 6.50 శాతం ఎక్కువ

అమరావతి, ఆంధ్రప్రభ : ఇంధన మౌలిక వసతుల కల్పనకు రాష్ట్రప్రభుత్వం ఈ బడ్జెట్‌లో రూ. 5,473.83 కోట్లు కేటాయించింది. గత ఏడాది రూ. 5,139.90 కోట్లు అంచనా వేయగా రూ. 2,964.90 కోట్లతో సవరించిన బడ్జెట్‌లో కేటాయించారు. ఇది గత బడ్జెట్ కంటే 6.50 శాతం ఎక్కువ. రాష్ట్ర అభివృద్ధి, ప్రగతి సూచికలో కీలకపాత్ర పోషిస్తున్న విద్యుత్ రంగాన్ని మరింతగా బలోపేతం చేసే దిశగా ఈ కేటాయింపులు చేశారు. ఒక్క పైసా కూడా విద్యుత్ ఛార్జీలు పెంచకుండా చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలోనే వినియోగదారులపై భారం తగ్గించేందుకుగానూ ముఖ్యమంత్రి ఈ ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ ఛార్జీలు తగ్గించేందుకు అవసరమైన ప్రతిపాదనలు చేయాలని అధికారులను ఆదేశించిన సంగతి విధితమే. దీనికితోడు ప్రస్తుతం ఎస్సీలకు 100 యూనిట్లవరకూ ఉచితంగా ఇస్తున్న కార్యక్రమాన్ని భవిష్యత్తులో ఎంబీసీలకు కూడా ఇవ్వాలని నిర్ణయించారు. ఈనేపథ్యంలో తాజా బడ్జెట్ కేటాయింపుల్లో ఎంబీసీలకు న్యాయం జరిగే అవకాశం ఏర్పడింది. అలాగే మత్స్య పరిశ్రమ, పౌల్ట్రీ పరిశ్రమలకు విద్యుత్ రాయితీ అందించే అంశంలో కూడా ఈ బడ్జెట్‌లో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. గత నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలో వ్యవస్థాపిత సామర్థ్యం రెట్టింపు అయింది. 9,529 మెగావాట్ల నుండి 19,680 మెగావాట్లకు వ్యవస్థాపిన సామర్థ్యం పెరిగింది. పునరుత్పాదక ఇంధన రంగంలో 36,604 కోట్ల పెట్టుబడితో 13 వేల మందికి ఉపాధి కల్పించేవిధంగా ప్రాజెక్టులను స్థాపించారు. ఇవి వివిధ దశల్లో ఉన్నాయి. ఈ ప్రాజెక్టులు ప్రధానంగా రాయలసీమ ప్రాంతంలో కేంద్రీకృతమై ఉన్నాయి. రాష్ట్రంలో విద్యుత్ రంగంలో ప్రవేశపెట్టిన సంస్కరణల మూలంగా విద్యుత్ లోటు నుండి బయటకువచ్చి మిగులు విద్యుత్ కలిగిన రాష్ట్రంగా నిలచింది. 100శాతం విద్యుదీకరణ, వ్యవసాయానికి ఏడు గంటల ఉచిత విద్యుత్తు, గృహ, వాణిజ్య అవసరాలకు 24/7 నిరంతర విద్యుత్తును సరఫరాచేసే



స్థాయికి ఎదిగింది. గత నాలుగున్నరేళ్లలో సంవత్సరానికి 999 యూనిట్ల వరకు విద్యుత్‌ను వినియోగించే గృహ వినియోగదారులకు ఎటువంటి సుంకం పెంచలేదు. 2019-20 ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ సుంకాల్లో కూడా ఎటువంటి పెరుగుదలను ప్రతిపాదించలేదు. ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్లను ప్రోత్సహించడానికి ఒక యూనిట్ విద్యుత్తుకు రూ.1 సబ్సిడీ ప్రతిపాదించారు. దీనివల్ల ఛార్జింగ్ స్టేషన్లకు యూనిట్‌కు అవసరమయ్యే వ్యయం రూ. 6.95 నుండి రూ. 5.95కు తగ్గనుంది.

నేడు సీఎంతో కేఈ బ్రదర్స్ భేటీ



అమరావతి, ఆంధ్రప్రభ : కర్నూలు జిల్లాలో నెలకొన్న తాజా రాజకీయాలపై చర్చించేం దుకు ఉపముఖ్యమంత్రి కేఈ బ్రదర్స్ బుధవారం సీఎం చంద్రబాబుతో భేటీ కానున్నారు. మాజీ ఎంపీ కోట్ల సూర్య ప్రకాశరెడ్డి తెలుగుదేశం పార్టీలో చేరనున్న నేపథ్యంలో సీఎంతో కేఈ భేటీ ప్రాధాన్యతను సంతరించు కోనుంది. కోట్ల సూర్యప్రకాశరెడ్డి చేరికపై మీడియా ల్లో వార్తా కథనాలు వస్తున్నా సీఎం చంద్రబాబు నాయుడు తనకెలాంటి సమాచారం అందివ్వలేదని కేఈ పేర్కొనడం జరిగింది. అంతేకాకుండా ఇటీవల రాజధాని అమరావతి ప్రాంతంలో రూ.150 కోట్ల వ్యయంతో నిర్మించే తిరుమల వెంకన్న దేవాలయం నిర్మాణం సందర్భంగా అధికారులు ప్రోటోకాల్ నిబంధనలు పాటించలేదని అసహనం వ్యక్తం చేశారు. ఆ కార్యక్రమానికి దేవాదాయ శాఖా మంత్రిగా ఉన్న కేఈ గైర్హాజర్ కావడం చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో సీఎంతో చర్చించేందుకు ఉప ముఖ్యమంత్రి కేఈ మంగళవారం ముందస్తు అనుమతి తీసుకున్నారు. బడ్జెట్ అనంతరం అసెంబ్లీలో సీఎం కార్యాలయంలో కలిసేందుకు కేఈ బ్రదర్స్ వేచి ఉన్నారు. అయితే ముఖ్యమంత్రి బెంగాల్ పర్యటన సందర్భంగా బేటీ వాయిదాపడింది. బుధవారం కలుద్దామని సీఎంచెప్పినట్లు కేఈని కలిసిన మీడియాకు వివరించారు.

కాపుల అభ్యున్నతే లక్ష్యం

• కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి

అమరావతి, ఆంధ్రప్రభ: కాపుల పురోగతి, అభ్యున్నతే లక్ష్యంగా తమ కార్పొరేషన్ పనిచేస్తుందని కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు పేర్కొన్నారు. కాపు విదేశీ విద్యోన్నతి పథకంలో భాగంగా మంగళవారం విజయవాడలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో 13జిల్లాల అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కాపుల ఆర్థికాభివృద్ధికి, విద్యా, ఉద్యోగ ఉన్నతి కోసం అనేక పథకాలను చిత్తశుద్ధితో అమలు చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కాపులకు అన్ని విధాలా అండగా నిలుస్తున్నారని కొనియాడారు. బిసి క్యాటగిరిలో కాపులను చేర్చే లక్ష్యంతో కార్పొరేషన్ ను కూడా ఏర్పాటు చేశారని వెల్లడించారు. గడిచిన నాలుగేళ్ళలో కాపు కార్పొరేషన్ రూ. 3,100 కోట్లను మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం కాపుల అభ్యున్నతి కోసం రూ. 4,223 కోట్లు ఖర్చు చేయడమే కాకుండా బ్యాంక్ లింకేజ్ ద్వారా మరోక రూ. 1800 కోట్లను స్వయం ఉపాధి నిమిత్తం అందించి లబ్ది చేకూర్చిందని తెలిపారు. విదేశీ విద్యా పదకం కింద 1892 మందికి రూ. 207కోట్లను మంజూరు చేశామని, దీనిలో 1282 మందికి రూ. 116.58కోట్లు చెల్లించడం జరిగిందన్నారు. కాపుల కోసం ప్రవేశపెట్టిన విదేశీ విద్యా పథకాన్ని ఆ సామాజిక వర్గానికి చెందిన వారంతా వినియోగించుకోవాలని కోరారు. కాపుల వెనుకబాటు తనాన్ని గుర్తించిన ముఖ్యమంత్రి కేంద్రం ప్రకటించిన 10శాతం ఈబీసీ రిజర్వేషన్లలో 5శాతం కాపులకు కేటాయించారని, దీనిని అసెంబ్లీలో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించనున్నారని వెల్లడించారు. అంతేకాకుండా రాష్ట్రం లోని 13 జిల్లాల్లో రూ. 26కోట్లతో 13 కాపు భవన్ లను నిర్మించనున్నామని తెలిపారు. అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా రూ. 119 కోట్లతో 390 మినీ కాపు భవనాలను ఏర్పాటు చేయ నున్నామని, దీనికి సంబంధించిన నిధులను కూడా విడుదల చేయ డం జరిగిందన్నారు. ఉపకార వేతనాల కోసం రూ. 213.38 కోట్లను 1,44,686మందికి విడుదల చేశామని తెలి పారు. విదేశీ విద్యాపథకాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్న త స్థాయికి ఎదిగి తిరిగి లబ్ధిదారులంతా జన్మభూమికి తమ వంతు సహకారాన్ని అందించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ ఎండి శివశంకర్‌తో పాటు ఇతర అధికారులు, కార్పొరేషన్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

స్వల్పంగా పెరిగిన పోలీసు బడ్జెట్

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న పోలీసు శాఖకు గతేడాదితో పోల్చితే ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో స్వల్పంగా పెంచారు. 2.23శాతం పెంపుదలతో ఈ ఏడాది 6397.94 లక్షల కోట్ల నిధులు కేటాయించగా, గతేడాది రూ.6320.68 శాతం ఇచ్చారు. బడ్జెట్ స్వరూపాన్ని పరిశీలిస్తే పోలీసు శాఖ జీత భత్యాలు, సాధారణ ఖర్చులు మినహా మౌలిక సదుపాయాల కల్పనపై పెద్దగా దృష్టిసారించ లేదని స్పష్టమవుతోంది. ఇటీవల కాలంలో హోంగార్డుల వేతనాలను రూ.12వేల నుంచి రూ.18వేలకు పెంచారు. రాష్ట్రంలోని ఎఆర్, సివిల్ విభాగాల్లో పెద్ద ఎత్తున కానిస్టేబుళ్ళు, హెడ్ కానిస్టేబుళ్లకు పదోన్నతులు ఇచ్చారు. పెద్ద ఎత్తున పోలీసు రిక్రూట్‌మెంట జరుగుతోంది. ఇలాంటి తరుణంలో మౌలిక సదుపాయాల కల్పనకు మరిన్ని నిధులు కేటాయిస్తే బాగుండేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాష్ట్ర విభజన తర్వాత అనంతపురంలో అప్పా(ఏపీ పోలీసు అకాడమీ)ను తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించి బడ్జెట్‌లో శాశ్వత చర్యలు చేపట్టలేదు. గ్రెహౌండ్స్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూర్చుతున్నప్పటికీ బడ్జెట్‌లో నిర్ధిష్ట చర్యలను పేర్కొన లేదు.

న్యాయశాఖకు పెంపు

రాష్ట్ర ప్రభుత్వం నాలుగు నెలల కాలానికి ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో న్యాయశాఖకు సముచిత ప్రాధాన్యత ఇచ్చారు. గతేడాది రూ.769.30లక్షల కోట్లు కేటాయించగా 7.57శాతం పెరుగుదలతో ఈ ఏడాది రూ.918.81లక్షల కోట్లు కేటాయించారు. రాష్ట్ర విభజన తర్వాత పెద్ద ఎత్తున కోర్టుల నిర్మాణం, సిబ్బంది సంఖ్య పెంపు, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని బడ్జెట్ పెంపులు జరిగినట్లు చెపుతున్నారు.


దొరకని చిరుత జాడ

• పట్టుకోవడంలో అధికారుల విఫలం • బెంబేలెత్తుతున్న జనం



చిరుత కోసం పహారా కాస్తున్న ప్రజలు

రాజమహేంద్రవరం, ప్రభన్యూస్ : అభయారణ్యంలో ఉండే చిరుత కోనసీమలో హల్‌చల్ చేస్తోంది. రెండు రోజులుగా ప్రజలకు, అధికారులకు కునుకులేకుండా చేస్తోంది. తూర్పుగోదావరి జిల్లా ఆత్రేయపురం మండలం అంకంపాలెంలో చిరుత చొరబడి నలుగురిపై దాడిచేసి గాయపర్చింది. దాన్ని పట్టుకునేందుకు అధికారులు చేసిన ప్రయత్నం మంగళవారం రాత్రి కూడా సాధ్యపడలేదు. అంతేకాదు అసలు ఆ చిరుత ఎక్కడుందనేది ఆచూకీ దొరకడంలేదు. దీంతో లొల్ల, ర్యాలి గ్రామాల్లో భయాందోళన నెలకొంది. పంటపొలాల్లోంచి గ్రామంలోకి వస్తే పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పనవసరంలేదు. అందుకే అధికారులతోపాటు గ్రామస్తులు కూడా కర్రలతో గ్రామ సరిహద్దులవద్ద కాపలా కాస్తున్నారు. రెవెన్యూ, పోలీసు, అటవీ శాఖల అధికారులంతా ఈ చిరుతకోసం ముమ్మర గాలింపు చేస్తున్నారు. మంగళవారం రాజమహేంద్రవరం నగరపాలకసంస్థకు చెందిన వీధిలైట్లు వేసే క్రేన్‌లు, లిఫ్ట్‌లను పులి సంచరించే ప్రాంతానికి చేర్చారు. అలాగే వన్యప్రాణరక్షణ వాహనంతో బోనును సిద్ధంచేసారు. ఈ పులిని సజీవంగా గానీ, నిర్జీవంగానైనా పట్టుకోవాలని ప్రయత్నిస్తున్నారు. సోమవారం అంకంపాలెంలో కొబ్బరిచెట్లపై ఎనిమిదిగంటలపాటు ఉండిపోయిన చిరుతను పట్టుకునేందుకు అధికారులు చెట్టుకింద వలలు ఏర్పాటు చేసారు. అలాగే ఫ్లడ్‌లైట్లను కూడా అమర్చారు. ఎంతకీ చెట్టుపైనుండి కిందకు దిగకపోవడంతో అర్ధరాత్రి 2.30గంటల సమయంలో అధికారులు ఫ్లడ్‌లైట్లు ఆర్పి చూసారు. అయితే అధికారుల ఎత్తుగడలు చిరుతముందు సాగలేదు. చీకటిని అదునుగా చేసుకుని చాకచక్యంగా ఆ చెట్టుపైనుండి దూకి పారిపోయింది. ఆ తర్వాతనుంచి ఒక్కరికి కూడా ఆ చిరుత కనిపించిన దాఖలాల్లేవు. కానీ ర్యాలి వైపుకు వెళ్ళినట్లుగా పొలాల్లో అడుగుజాడలున్నాయి. ఆ ప్రాంతంలోనే ఉంటుందని అధికారులు, ప్రజలు గుర్తించి ముమ్మర గాలింపు చర్యలు చేపడుతున్నారు. కానీ ఎక్కడా ఆ చిరుతను కనుగొనలేకపోయారు. తూర్పు ఏజెన్సీ ప్రాంతంనుంచి దారి తప్పి వశిష్టాపాయ ద్వారా ఏటిగట్టు చెంతనున్న అంకంపాలెం చేరుకుని ఉంటుందని అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. పలానాచోట చిరుత ఉందని గుర్తిస్తే ప్రజల్లో కొంత ఆందోళన తగ్గేది. కానీ చిరుత ఎక్కడుందో తెలియకపోవడంతో వేగంగా దూసుకుపోయే ఈ చిరుత ఏ క్షణాన ఎక్కడ ప్రత్యక్షమవుతుందోనని భయంభయంగా కాలం గడుపుతున్నారు. చాలామంది వ్యవసాయ పనులకు కూడా వెళ్ళలేకపోయారు. పచ్చని తోటల మీదుగా గౌతమీ పాయ దాటి ఆలమూరు మండలంవైపుకు వస్తుందని కొందరు, అలా కాకుండా గౌతమీపాయ దాటి పశ్చిమగోదావరి జిల్లా సిద్ధాంతంవైపు వెళుతుందని మరికొందరు, పి.గన్నవరం నుంచి కోనసీమ ప్రాంతాలకు వెళుతుందని ఇంకొందరు సోషల్‌మీడియాలో పోస్టింగ్‌లమీద పోస్టింగ్‌లు పెట్టేస్తున్నారు. దీంతో చిరుత ఈ ప్రాంతవాసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. చిరుతను పట్టుకునేంతవరకు ఈ ఆపరేషన్ కొనసాగిస్తామని జంతుప్రదర్శనశాల నిపుణులు శ్రీనివాసరావు, వెటర్నరీ వైద్యనిపుణులు ఫణీంద్ర, జిల్లా అటవీశాఖ అధికారిణి నందిని సలారియాలు తెలిపారు. ఇదిలా ఉండగా చిరుత దాడిలో గాయపడిన నలుగురు ఆసుపత్రిలో కోలుకుంటున్నారు.



జాడలేని చిరుత

టీడీపీకి షాకిచ్చిన ఆమంచి

• బుధవారం జగన్‌ను కలిసే అవకాశం • వైసీపీలో చేరేందుకు నిర్ణయం



ఒంగోలు, ప్రభన్యూస్ బ్యూరో: ఎన్నికల ముందు ప్రకాశం జిల్లాలో తెలుగుదేశం పార్టీకి గట్టిషాక్ తగిలింది. చీరాల ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ వైసీపీలో చేరేందుకు సిద్ధమవుతున్నారు. పందిళ్లపల్లిలోని తన స్వగృహంలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించిన ఆయన ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు సూచనల మేరకు విజయవాడ నుంచి హుటాహుటిన పందిళ్లపల్లి చేరుకున్న జిల్లా మంత్రి శిద్దా రాఘవరావు ఆమంచితో గంటకు పైగా చర్చలు జరిపారు. అయితే ఈ చర్చలు విఫలమైనట్లు సమాచారం. ఆమంచి బుధవారం రేణిగుంట విమానాశ్రయంలో జగన్‌ను కలవనున్నారు. అనంతరం ఈ నెల 13 వ తేదీన ప్రకాశం జిల్లాలో జరిగే జగన్ పర్యటనలో ఆమంచి వైసీపీ కండువా కప్పుకోనున్నారు. నాయకుల అభిప్రాయ సేకరణ కోసం మంగళవారం తన ఇంటిలో సమావేశం ఏర్పాటు చేశారు. విడివిడిగా ఒక్కొక్కరితో మాట్లాడిన ఆమంచి చిట్టచివరిగా తాను వైసీపీకి వెళ్లడానికి నిర్ణయించుకున్నట్లు బదులిచ్చారు. చీరాలకు చెందిన అధికశాతం మంది నేతలు ఆయన వెంట వెళ్లటానికి ఇష్టపడిన టీడీపీలో ఉండే ముఖ్యనేతలు మాత్రం తాము వైసీపీలోకి మారబోమని స్పష్టం చేశారు. మున్సిపల్ చైర్మన్ రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు తదితరులు ఇండిపెండెంట్‌గా పోటీచేసిన మద్దతు ఇస్తాం గాని వైసీపీలోకి మాత్రం రాము అని స్పష్టంగానే చెప్పి వెళ్లిపోయారు.2014 ఎన్నికలలో నవోదయ పార్టీతరపున పోటీచేసి గెలుపొందిన ఆమంచి కృష్ణమో హన్ ఆ తరువాత టీడీపీ కండు వా కప్పుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సైతం ఆమంచి కృష్ణమో హన్ కు అధిక ప్రాధ్యానత ఇచ్చా రు. చీరాల నియోజక వర్గంలో ఉన్న టీడీ పీ నేతలు ఎంత అసంతృప్తి వ్యక్తం చేసినా ఆయన పెద్దగా పట్టించు కోలేదు. ఆమంచిపై పోటీచేసి ఓడిపోయిన పరిటాల సునీతకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి చీరాల నియోజక వర్గంలొ విభేదాలు లేకుండా చూశారు. అయినప్పటికి ఆమంచి టీడీపీ నాయకునిగా ఏ రోజు ప్రవర్తిం చలేదు. నేరుగా చంద్రబాబు, మంత్రులతో మినహా జిల్లాలో ఉండే తెలుగుదేశం పార్టీనాయకులతో కూడా ఆయనపెద్దగా సంబంధాలు నేరపలేదు. టీడీపీలోఉన్న మాజీ మంత్రి పాలేటి రామారావు తదితర నేతలు ఆమంచి వ్యతిరేకిస్తూనే వచ్చారు. పార్టీ కార్యక్రమాలను కాని, పార్టీ సభ్యత్వాలను కాని ఆమంచి పెద్దగా పట్టించుకోలేదు. దీంతో ఆమంచి పార్టీ మారతారన్న ఊహాగానాలు వినిపిస్తూనే ఉన్నాయి. చంద్రబాబు ఆమంచిపై విపరీతమైన అభిమానం చూపిస్తుండటంతో ఆమంచి టీడీపీలో కొనసాగుతారని టీడీపీ నాయకులు ఊహిస్తూ వచ్చారు. అయితే ఇటీవల వైసీపీలో చేరిన దగ్గుబాటి వెంకటేశ్వరరావుతో ఆమంచికి సత్సబంధాలు ఉండటంతో మరోసారి ఆమంచి పార్టీమారతారన్న ప్రచారం ఊపందుకోంది.

శిద్దాతో చర్చలు విఫలం

ఈవార్త తెలుసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆమంచితో చర్చించాలని జిల్లా మంత్రి శిద్దా రాఘవరావును ఆమంచి వద్దకు పంపారు. సాయంత్రం 5 గంటల ప్రాంతంలో ఆమంచి ఇంటివద్దకు చేరుకున్న శిద్దా రాఘవరావు రాత్రి 8 గంటల వరకు చర్చలు కొనసాగిస్తూనే ఉన్నారు. ఈ చర్చలలో భాగంగా కమ్మనేతలు తనపై పెత్తనం చేయకపోవడం సహించలేకపోతున్నానని ఆమంచి చెప్పినట్లు సమాచారం. గతంలో లోకేష్ పర్యటన చీరాల నియోజకవర్గంలో ఏర్పాటు చేసుకుంటే కమ్మనేతలు కొందరు దానిని రద్దుచేయించారని ఆమంచి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ తనతో ఫోనులో మాట్లాడారని అటు టీడీపీ ఇటు వైసీపీ పెద్దమొత్తంలో ఖర్చుచేస్తారని జనసేన డబ్బులుపెట్టదని అందువలన ఆ పార్టీలోకి వెల్లదలచుకోవడం లేదన్నారు. కాంగ్రెస్‌తో టీడీపీ పొత్తుంటే కాంగ్రెస్ నుంచి పోటీ చేద్దామనుకున్నానని అయితే ఆ పొత్తులేదని అందువలన వైసీపీకి వెళ్లాలన్న నిర్ణయానికి వచ్చినట్లు ఆమంచి చెప్పారని తెలిసింది. వైసీపీ నాయకులు కూడా చాలా కాలంనుంచి టచ్‌లో ఉన్నారని ఖర్చులు వారు పెట్టుకుంటారని శిద్దాతో చెప్పినట్లు సమాచారం. ఇండిపెండెంట్‌గా పోటీచేసే అవకాశం ఉన్న ప్రధాన పార్టీలతో పోటీపడి ఖర్చుచేసే అవసరం కాని అవకాశం కాని లేదని ఆమంచి శిద్దాకు చెప్పారు. అయితే మం త్రి శిద్దాకూడా ఆమంచిని సర్దిపుచ్చడానికి తీవ్రప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం అందింది. అయితే అప్పటికే వైసీపీలోకి వెళ్లబోతున్నట్లు ప్రక టించేసిన కారణంగా శిద్దాకు సారీ చెప్పినట్లు సమాచారం.మొత్తంమీద ఆమంచి స్వయంగా ఏమీ ప్రకటించనప్పటికి రెండు మూడు రోజులలో వైసీపీలో చేరడం కాయంగానే కనిపిస్తోంది.

ఆస్ట్రేలియాలో గెలిచి న్యూజిలాండ్‌లో జైత్ర యాత్ర చేస్తున్న టీమిం డియా, నేటి నుంచి కివీస్ జట్టుతో టీ20 సిరీస్‌ను ఆడనుంది. న్యూజిలాండ్ గడ్డపై భారత్ 2008-09లో ఆడిన ఒకే ఒక్క టీ20 సిరీస్‌లో 0-2తో ఆతిథ్య దేశానికి కోల్పోయింది. ప్రస్తుతం అద్భుత ఫామ్‌లో ఉన్న రోహిత్ శర్మ నేతృత్వంలోని జట్టు అప్పటి ఓటమికి బదులు తీర్చుకుంటామని ఆశిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ సిరీస్ క్రికెట్ అభిమానులను అలరిస్తుందన టంలో సందేహం లేదు.

మ.12:30 నుంచి ప్రారంభం



పొట్టి ఫార్మాట్లో తేల్చుకుందాం

• నేడు భారత్- న్యూజిలాండ్ తొలి టీ20 మ్యాచ్ • సిద్ధమైన ఇరు జట్లు

వెల్లింగ్టన్: భారత క్రికెట్ జట్టు మూడు నెలల విదేశీ పర్యటన చివరి అంకా నికి చేరుకుంది. చిరస్మరణీయమైన విజయాలతో స్వదేశానికి చేరడానికి ముందు భారత్, న్యూజిలాండ్‌లో మూ డు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌ను ఆడనుం ది. ఇందులో భాగంగా స్థానిక వెస్ట్‌పాక్ స్టేడియంలో తొలి మ్యాచ్‌ను ఆతిథ్యదేశంతో ఆడనుంది. భారత జట్టు రెగ్యులర్ కెప్టెన్ విరాట్ కోహ్లీ విశ్రాంతి తీసుకుంటుండంతో.. రోహిత్ శర్మ జట్టుకు సారథ్యా న్ని వహిస్తున్నాడు. ఆస్ట్రేలియాలో చారిత్రక విజయాలను, న్యూజి లాండ్‌లో 4-1తో వన్డే సిరీస్‌ను గెలుపొం దిన భారత్, న్యూజి లాండ్ గడ్డపై తొలి టీ20 సిరీస్‌ను కైవసం చేసు కోవాలని ఉవ్విళ్లూరు తోంది. వసిరోవైపు నిరంతరం గా ఆడుతు న్న ఆటగాళ్లు విశ్రాంతిని కోరు కుంటున్నారు. ఒకవైపు ఆట లో గెలవాలనే కాంక్షను వెలి బుచ్చుతూన్యూజిలాండ్‌తో పొట్టి ఫార్మా ట్ సిరీ స్‌ను గెలవాలని భావిస్తు న్నా రు. భారత జట్టు ఓపెనర్ శిఖర్ ధావన్ బుధవా రం మీడి యా తో మాట్లాడుతూ.. మే మూ మనుషులమే మా శరీరాలకు విశ్రాంతి అవసరం. మేము ఆస్ట్రేలియా లో సాగించిన జైత్ర యాత్రను న్యూజి లాం డ్‌లో కూడా సాగించాలను కుంటున్నాము. ఈ సిరీస్ విజయం తో స్వదేశానికి వెళ్లాలను కుంటున్నాము అని తెలిపాడు.

ప్రపంచకప్‌కు ఆటగాళ్ల ఎంపిక కొనసాగుతోంది

ఇటీవల న్యూజిలాం డ్‌తో ముగిసిన వన్డే సిరీస్, 2019 ప్రపంచకప్‌లో ఆడనున్న భారత జట్టు 15మంది ఆటగాళ్ల ఎంపి కకు మార్గం సులభ తరం చేసింది. అయినప్ప టికి.. మరి కొన్ని స్థానాలకోసం ఆటగాళ్లను సెలెక్టర్లు పరిశీలిస్తున్నా రు. వన్డే సిరీస్ జట్టులో లేని యువ వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ రిషభ్ పంత్ టీ20 సిరీ స్‌కోసం జట్టులోకి తిరిగి వచ్చాడు. వరల్డ్ కప్ జట్టులో స్పాట్ కోసం తానూ.. బరిలో ఉన్నానని స్పష్టం చేయను న్నా డు. ఆస్ట్రేలియాతో సిరీస్‌కు విశ్రాంతిని చ్చిన వెటరన్ క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనీకి న్యూజిలాండ్ పర్య టనలో అవకాశమి చ్చా రు. ధోనీ చివరి సారిగా గత ఏడా ది జులైలో టీ20 లో ఆడాడు. టెస్ట్ సిరీస్ లో అద్భుతమైన ఆటను ప్రదర్శించిన పంత్ ఈ పొట్టి ఫార్మాట్లో తన ప్రతా పాన్ని చూపాలని ఎదురు చూస్తున్నా డు. అంతేకాక ఈ సిరీస్ మరో వికెట్ కీపర్ బ్యాట్స్ మన్ దినేష్ కార్తిక్‌కు కూడా అవకా శం కల్పిస్తున్నది. మ్యాచ్ ఫినిషర్‌గా కొన్ని సార్లు మెరిసిన కార్తిక్ తొలి టీ20లో చివరి 11మంది ఆటగాళ్లలో ఉంటాడన్న ది అనుమా నమే. అంబటి రాయుడు న్యూజి లాండ్‌తో చివరి వన్డేలో 90 పరు గులు చేసి మ్యాచ్ గెలవడంలో కీలక భూమి క పోషిం చాడు. ప్రపంచకప్ జట్టు లో రాయుడు మిడి లార్డర్‌లో తన స్థానం ఖాయం చేసుకున్నట్లే అని చెప్పవ చ్చు. రాయుడు టీ20 సిరీస్‌కు ఎంపికకాలే దు. 19ఏళ్ల శుభ్ మన్ గిల్ కూ డా కివీస్‌తో చివరి వన్డేలో కీలకమైన ఆటను ప్రదర్శిం చాడు. కోహ్లీ జట్టులో లేకపోవడంతో నెంబర్ త్రీ బ్యాట్స్ మన్‌గా గిల్ మళ్లీ బరిలోకి దిగడా నికి వందశా తం అవకాశాలు న్నాయి. టీ20 జట్టు లో చేరిన వారిలో పంత్‌తో పాటు, కృణాల్ పాండ్యా, పంజాబ్ పేసర్ సిద్ధార్థ్ కౌల్ ఉన్నారు. సీనియర్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా, లేకపో వడంతో వన్డే సిరీస్‌లో అవకా శం పొందిన మహ్మద్ సిరాజ్, ఖలీల్ అహ్మద్ అంతగా తమ పటిమను చూపలే కపోయా రు. బ్యాట్స్‌మెన్‌లో ధావన్ కివీస్ తో వన్డే సిరీస్‌లో రాణించలేదు. టీ20 సిరీస్‌లో రాణించి పర్యటన ను విజ య వంతంగా ముగించాలని కోరుకుం టు న్నాడు. ఇందుకోసం టెన్నిస్ బంతితో బ్యాటిం గ్‌ను ప్రాక్టీస్ చేస్తున్నాడు. ముఖ్యంగా స్వింగ్ బౌలింగ్‌ను ఎదుర్కోవడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాడు.

గెలిచి తీరాలన్న పట్టుదలతో న్యూజిలాండ్

వన్డే సిరీస్‌లో ఘోరంగా పరాజయంపాలైన ఆతిథ్య న్యూజిలాండ్ టీ20 సిరీస్‌లోనైనా గెలిచి పరువు దక్కించుకోవాలని ఆశిస్తోంది. ఇప్పటివరకు న్యూజిలాండ్ గడ్డపై 2008-09 లో ఇరు జట్లు మధ్య ఒకేఒక్క టీ20 సిరీస్ జరుగగా.. న్యూజిలాండ్ 2-0తో గెలిచింది. 2017-18లో న్యూజిలాండ్ భారత్‌లో పర్యటించిన సమయంలో భారత్ 2-1తేడాతో సిరీస్‌ను గెలుచుకుంది. ఆదివారం జరిగిన వన్డే మ్యాచ్‌లో వెస్ట్‌పాక్ పిచ్ ప్రారం భం లో స్వింగ్‌కు అనుకూ లిం చినప్పటికి..అనంతరం బ్యాటింగ్‌కు అనుకూలం గా మారింది. మరోవైపు కివీస్ పేసర్ ట్రెంట్ బోల్ట్‌కు విశ్రాంతినిచ్చారు. తొలిసారిగా తన అంతర్జా తీయ కెరియర్‌ను ప్రారంభించనున్న డేరిల్ మిచెల్, బ్లేర్ టిక్‌నెర్‌లు భారత్ బ్యాట్స్‌మె న్‌ను ఎంత వరకు నిలువరిస్తారో వేచిచూడా ల్సిందే. చివరి 11మంది ఆటగాళ్లను ఇరుజట్లు టాస్‌కు ముందు ప్రకటించనున్నాయి.

జట్లు:

భారత్: రోహిత్ శర్మ(కెప్టెన్), శిఖర్ ధావన్, రిషభ్ పంత్, దినేష్ కార్తిక్, కేదార్ జాదవ్, ఎంఎస్ ధోనీ, కృణాల్ పాండ్యా, కుల్దీప్ యాద వ్, యజువేంద్ర చాహల్, భువనేశ్వర్ కుమా ర్, సిద్దార్థ్ కౌల్, ఖలీల్ అహ్మద్, శుభ్‌మన్ గిల్, విజయ్ హార్దిక్ పాండ్యా, మహ్మద్ సిరాజ్

న్యూజిలాండ్: కేన్ విలియమ్సన్(కెప్టెన్), డోగ్ బ్రేస్‌వెల్, కోలిన్ డి గ్రాందొమ్మి, లాకి ఫెర్గుసన్, స్కాట్ కుగ్గెలెజ్, కోలిన్ మన్రో, డేరిల్ మిచెల్, మిచెల్ సాంట్నర్, టిమ్ సెయ్‌ఫెర్ట్, ఐష్ సోది, టిమ్ సౌథీ, రాస్ టేలర్, బ్లెయిర్ టిక్‌నెర్, జేమ్స్ నీశామ్.

ఇంగ్లండ్‌తో సిరీస్ తర్వాత.. టీ20 లనుంచి మిథాలీ రిటైర్మెంట్



న్యూఢిల్లీ: సీనియర్ మహిళా క్రికెటర్ వన్డే జట్టు కెప్టెన్ మిథాలీ రాజ్ టీ20 అంతర్జా తీయ మ్యాచ్‌లనుంచి రిటైర్మెంట్‌ను ప్రకటించింది. భారత్‌లో పర్యటించనున్న ఇంగ్లం డ్‌తో జరిగే టీ20 సిరీస్ తర్వాత రిటైర్మెంట్ తీసుకోనున్నట్లు మిథాలీ ప్రకటన చేసింది. భారత్‌లో ఇంగ్లండ్ పర్యటన మార్చి 4న ప్రారంభం కానుంది. ఈ మేరకు బీసీసీఐ అధికారి ఒకరు మంగళ వారం మీడియాకు వెల్లడించారు. అయితే 50 ఓవర్ల ఫార్మాట్లో కొనసాగ నున్నట్లు మిథాలీ తెలిపింది. ప్రస్తుతం మిథాలీ న్యూజిలాండ్‌తో టీ 20 సిరీస్ ఆడే జట్టులో సభ్యురాలుగా కొనసాగుతోంది. నేడు జరిగే తొలి మ్యాచ్‌లో చివరి 11మంది క్రీడాకా రిణుల్లో మిథాలీ ఉంటుందా అన్నది అనుమా నమే. 2020 టీ20 ప్రపంచ కప్ దృష్ట్యా పటి ష్టమైన జట్టును రూపొందించేందు కు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ దృష్టి పెట్టిన నేపథ్యం లో.. మిథాలీ తన రిటైర్మెంట్‌ను ప్రక టించిందని బీసీసీ అధికారి తెలిపాడు. మిథాలీ టీ20ల్లో ఇప్ప టివరకు 85 మ్యాచు లాడి 2283 పరు గులు చేసింది. ఇందులో 17 అర్ధ సెంచరీలు న్నా యి. ఆమె అత్యధిక స్కోరు 97.

సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ ఆంధ్రప్రదేశ్‌పై కర్నాటక గెలుపు



నైవేలి: సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ టోర్నీలో కర్నాటక జట్టు ఆంధ్ర ప్రదేశ్ జట్టును 5-0 గోల్స్ తేడాతో ఓడించింది. మంగళవారం జరిగిన సౌత్ జోన్ క్వాలిఫయర్ గ్రూప్ ఎ మ్యాచ్‌లో ప్రారంభంలో ఆంధ్ర ప్రదేశ్ పేలవంగా ఆడింది. తొలి మ్యాచ్ ను బలమైన తమిళనా డు జట్టుతో 1-1తో డ్రాగా ముగిం చిన ఆంధ్ర నేటి మ్యాచ్‌లో ఒక్క గోల్ కూ డా చేయలేక పో యింది. ఈ ఓటమితో ఆంధ్రప్ర దేశ్ మెయిన్ రౌండ్లకు అర్హత సాధించే అవకా శం కోల్పోయిం ది. గ్రూప్ లో అగ్రభా గాన నిలవా లం టే.. తమి ళ నాడు కర్నాటకను ఓడిం చాల్సి ఉంటుంది. గ్రూప్ బిలో డిఫెండింగ్ చాంపియన్ కేరళ తెలంగాణతో ఆడిన మ్యాచ్‌ను డ్రాగా ముగించింది.



మహిళా క్రికెట్ టోర్నీ విజేత తెలంగాణ జట్టు

ఖమ్మం స్పోర్ట్స్,ప్రభ న్యూస్ : నగరంలోని స్థానిక సర్దార్ పటేల్ స్టేడియంలో 3 రోజులుగా నిర్వహిస్తున్న 5వ ఆల్‌ఇండియా మహిళా క్రికెట్ టి-20 ఛాంపియన్‌షిప్ పోటీలు ఎంతో ఉత్సాహంగా జరిగాయి. హోరాహోరిగా నడిచిన ఎనిమిది రాష్ట్రాల క్రికెట్ పోటీల్లో తెలంగాణ మహిళా క్రికెట్ జట్టు విజేతగా, రన్నరఫ్‌గా ఉత్తరప్రదేశ్ జట్లు నిలిచాయి. మంగళవారం జరిగిన ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా జిల్లా జడ్జీ యం. లక్ష్మణ్, పోలీస్ కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్ హాజరయ్యారు. మహిళా క్రికెట్ క్రీడాకారులను ఉద్దేశించి వీరు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం క్రీ డలకు పెద్దపీట వేస్తుందని ప్రతి క్రీడాకారుడు గెలుపు ఓటములను సహజంగా తీసుకోవాలన్నారు. ఈ పోటీల్లో బెస్ట్ బ్యాట్స్‌మెన్, ఉమెన్ ఆఫ్ ది సిరీస్ టి. చందన (తెలంగాణ జట్టు), బెస్ట్ బౌలర్, బెస్ట్ ఆల్‌రౌండర్ నీరజ్ రాజ్‌పథ్ (ఉత్తరప్రదేశ్)లు నిలిచారు. ఈ కార్యక్రమంలో ఇంటిలిజెన్స్ ఏసిపి పింగళి నరేష్‌రెడ్డి, టౌన్ ఏసిపి వెంకట్రావు, మహిళా ప్రాంగణ అధికారి విజేత, డిఎస్‌డివో పరందామరెడ్డి, డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్, సునీల్‌రెడ్డి, మహిళ క్రికెట్ అసోషియేషన్ నాయకులు మతిన్, పీడీ శ్రీనివాస్, టోర్నమెంట్ నిర్వాహకులు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

భారత్‌లో ప్రపంచ కప్ హాకీ టోర్నీ?

• బిడ్డింగ్ దాఖలు చేసిన హాకీ ఇండియా



లాసాన్నె: భారత్ మరోసారి ప్రపంచ కప్ హాకీ టోర్నీని నిర్వహిం చేందుకు తన సంసిద్ధతను వ్యక్తం చేసిం ది. మంగళవారం భారత హాకీ సమాఖ్య ఇందు కోసం బిడ్‌ను క ూడా దాఖ లు చేసింది. 2018లో భారత్, పురుషుల ప్రపంచ కప్‌ను ఒడిశాలో నిర్వహిం చిన విషయం తెలిసిందే. తాజాగా వచ్చే మహిళల లేదా పురుష ప్రపంచకప్‌ను 2023 లో జనవరి 13 నుంచి 29 వరకు నిర్వహించేం దుకు సంసిద్ధతను తెలి పింది. కాగా ఇదే రీతిలో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లు తమ సంసిద్ధతను వ్యక్తం చేశాయి. కాగా స్పెయిన్, మలేసియా, జర్మనీలు ఈ ఈవెంట్‌ను 2022 జూలై 1 నుం చి 17వరకు నిర్వహిస్తామని తెలిపాయి. ఈ మేరకు అంతర్జాతీయ హాకీ సమాఖ్య ఒక ప్రకటన చేస్తూ.. వచ్చే వరల్డ్ కప్ నిర్వహణకోసం పలు బిడ్డింగ్‌లు వచ్చాయి. బిడ్డింగ్‌ల దాఖలుకు ఆఖరు తేదీ జనవరి 31తో ముగి సింది. ఆయదేశాలు రెండు షెడ్యూల్ తేదీలను తమ బిడ్డిం గ్‌లో పేర్కొన్నాయి. 2022 జులై 1నుం చి 17 లేదా 2023 జనవరి 13 నుంచి 29లకు ప్రాధా న్యతనిచ్చాయని పేర్కొంది. ఈ బిడ్డిం గ్‌లను ఎఫ్ఐహెచ్ పరిశీలించి తుది నిర్ణయం జూన్ నెల లో తీసుకుంటుం ది.




హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం గోల్కొండ 7 టూంబ్స్‌లో గోల్కొండ మాస్టర్స్ గోల్ఫ్ చాంపియన్‌షిప్ పోటీలను ప్రారంభిస్తున్న తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం. ఈ పోటీలు నేటినుంచి శనివారం వరకు సాగుతాయి.

పోటాపోటీగా రంజీ ఫైనల్

• స్నెల్ పటేల్ సెంచరీ.. సౌరాష్ట్ర 307 ఆలౌట్

• విదర్భ రెండో ఇన్నింగ్స్ 55/2 బ్యాటింగ్



నాగ్‌పూర్: రంజీ ఫైనల్ మూడో రోజు ఆట ముగిసే సమయానికి విదర్భ తన రెండో ఇన్నింగ్స్ ఆడుతూ 60 పరుగుల లీడ్‌ను సాధిం చింది. విదర్భ 2 వికెట్లు కోల్పోయి 55 పరుగులు చేసింది. గణేష్ సతీష్ 24 పరుగులతో ఆడుతుండగా, వసీం జాఫర్ 5 పరుగులతో బ్యాటిం గ్ చేస్తున్నారు. అంతకు ముందు ఓవర్ నైట్ స్కోరు 158/5తో సౌరా ష్ట్ర తన తొలి ఇన్నిం గ్స్‌ను ఆడుతూ 307 పరుగులకు ఆలౌట యింది. స్నెల్ పటేల్ సెంచరీ చేయడం, చివర్లో జయదేవ్ ఉనాద్కత్ 46 పరగులతో రాణించడం సౌరాష్ట్రకు కలసి వచ్చింది. జాతీయ జట్టు ఆటగాడు చటేశ్వర్ పుజారా ఒక పరుగుకే ఔట య్యాడు. కాగా, విదర్భ తొలి ఇన్నిం గ్స్‌లో 312 పరుగులు చేసింది.

నేడు తొలి మహిళల టీ 20

ఉ. 8.30 నుంచి ఆట ప్రారంభం



వెల్లింగ్టన్: అటు పురుషుల జట్టుతో పాటు, మహిళల జట్టు కూడా నేడు టీ20 సిరీస్ ఆతిథ్య జట్టుతో ప్రారంభిస్తోంది. మూడు వన్డే మ్యాచుల సిరీస్‌లో చివరి వన్డేలో మిథాలీ సేన ఓటమి పొందినప్పటికి తొలి రెండు వన్డేలు గెలిచి సిరీస్‌ను 2-1తో సొంతం చేసుకుంది. వన్డేల్లో అంతగా ప్రతిభ చూపని టీ20 క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ నేటినుంచి ప్రారంభం కానున్న పొట్టి ఫార్మాట్లో తన సత్తాను చాటడానికి సిద్ధమని తెలిపింది. వెస్టిండీస్‌లో జరిగిన వరల్డ్ టీ20 టోర్నీలో ఇంగ్లండ్ చేతిలో సెమీఫైనల్లో ఓటమి తర్వాత భారత్ ఆడుతున్న తొలి టీ20 సిరీస్ ఇది. సెమీ ఫైనల్లో మిథాలీ రాజ్‌ను తప్పించడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. కోచ్ రమేష్ పొవార్ స్థానంలో డబ్ల్యువి రామన్‌ను నియమించారు. భారత్ బ్యాట్స్‌వుమెన్ ఇటీవల ముగిసిన వన్డే సిరీస్‌లో కివీస్ స్పిన్నర్లను ఎదుర్కోవడంలో తడబడ్డారు. ఈ ఏరియాలో భారత్ మెరుగుపడాల్సి ఉంది. వేదా కృష్ణమూర్తి స్థానంలో ఆల్ రౌండర్ ప్రియా పూనియా జట్టులోకి వచ్చింది. స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్‌లు ఈ పర్యటనలో భాగా రాణిస్తున్నారు. వారుఅందిస్తున్న ప్రారంభాన్ని మిగతా ఆటగాళ్లు అందుకోవాల్సి ఉంది. హర్మన్, మిథాలీలతో పాటు బౌలింగ్‌లో కూడా భారత జట్టు రాణిస్తే.. మరో సిరీస్ విజయం భారత్ ఖాతాలో పడటం ఖాయమని చెప్పవచ్చు.

భారత్: హర్మన్‌ప్రీత్ కౌర్(కెప్టెన్), స్మృతి మంధాన, మిథాలీ రాజ్, జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ, తానియా బాటియా, పూనం యాదవ్, రాధా యాదవ్, అనుజా పాటిల్, ఎక్తా బిష్త్, దయాలన్ హేమలత, మాన్సి జోషి, అరుంధతి రెడ్డి, శిఖా పాండే, ప్రియా పూనియా.

న్యూజిలాండ్: అమీ సాట్టర్‌వైట్(కెప్టెన్), సూజీ బేట్స్, బెర్నాండైన్ బెజుడెన్‌హోట్, సోఫీ డివైన్, హేలీ జెన్‌సెన్, క్యాట్లిన్ గుర్రే, లెయ్ కాస్పరెక్, అమీలియా కెర్, ఫ్రాన్సెస్ మెకే, కాటే మార్టిన్, రోస్‌మేరీ మేర్, హన్నా రోవ్, లీ తాహుహు.

నేటి నుంచి ఫెడ్ కప్

• సత్తా చాటనున్న అంకిత, కర్మన్

• గ్రూప్ ఎలో భారత్

అస్టానా(కజకిస్తాన్): భారత టాప్ టెన్నిస్ క్రీడాకారిణులు సింగిల్స్ విభాగంలో అంకిత రైనా, కర్మన్ తాండిలు ఫెడ్ కప్‌లో తమ సత్తా చాటడానికి సమాయత్తమయ్యారు. టెన్నిస్‌లో అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే అతిపెద్ద మహిళా టెన్నిస్ టీం ఈవెంట్ ఈ ఫెడరేషన్ కప్(ఫెడ్ కప్). వరల్డ్ గ్రూప్ 2లో భాగమైన ఈ టోర్నీ నేడు కజకిస్తాన్ వేదికగా ప్రారంభమవుతోంది. భారత్ పూల్ ఎలో ఉంది. పూల్ ఎలో భారత్‌తో పాటు థాయ్‌లాండ్, కజకిస్తాన్ ఉంది. భారత్ గురువారం థాయ్‌లాండ్‌తో పోటీపడనుంది. కాని భారత్‌కు అసలైన సవాల్ టోర్నీ ఆతిథ్య కజకిస్తాన్ నుంచి ఎదురు కానుంది. టాప్ 100 సింగిల్స్‌లో ఇద్దరు క్రీడాకా రిణులను కలిగి ఉన్న కజకిస్తాన్‌తో భారత్ శుక్రవారం తలపడ నుంది. కజకిస్తాన్ వరల్డ్ నెంబర్ 43 యూలియా పుతిన్ట్‌సేవా, 96వ ర్యాంక్ క్రీడాకారిణి జరినా డియాస్‌లను ఓడించి పూల్ ఎలో టాప్‌లో నిలవాలంటే చాలా శ్రమించాల్సి ఉంటుంది. పూల్ ఎ, పూల్ బి విజేతలు, రెండో స్థానంలో ఉన్న జట్లు మొత్తం నాలుగు జట్లు మళ్లీ పోటీపడతాయి. ఈ పోటీల్లో నెగ్గిన జట్లు వరల్డ్ గ్రూప్ 2 పోటీలకు అర్హత సాధిస్తాయి. పూల్ బిలో చైనా, కొరియా, ఇండోనేషియా, పసిఫిక్ ఓషియానాలు న్నాయి. చైనా క్రీడాకారిణి వరల్డ్ నెంబర్ 40 షువాయ్ జాంగ్, వరల్డ్ నెంబర్ 42 సాయ్‌సాయ్ జెంగ్ క్రీడాకారిణిలు గట్టి పోటీనివ్వనున్నారు. ఒకవేళ పూల్ బిలో చైనా టాప్‌లో నిలిస్తే.. ఆ జట్టు పూల్ ఎలోని భారత్, కజకిస్తాన్‌లతో పోటీ పడే అవకాశాలున్నాయి. గత ఏడాది న్యూఢిల్లీ వేదికగా జరిగిన పోరులో అంకిత ఓటమి లేకుండా సింగిల్స్ పోటీలు ముగించింది. పుతిన్ట్‌సేవాను కూడా ఓడించింది. సొంత గడ్డపై ఆడుతున్న కజకిస్తాన్ క్రీడాకారిణులు ఫేవరేట్‌గా బరిలోకి దిగుతున్నారు. గత ఏడాదిలో కర్మన్ తాండి జరీనాచేతిలో ఓడింది. ఈ సారి మెరుగైన ఆటను ప్రదర్శించే అవకాశముంది. ఒకవేళ కజకిస్తాన్‌ను భారత్ ఓడించినప్పటికి.. ప్లే ఆఫ్‌లో కఠిన పోటీని భారత్ జట్టు ఎదుర్కోక తప్పదు. మైనస్ డిగ్రీ ఉష్ణోగ్రతలు ఉన్నందున్న ఇండోర్ కోర్టుల్లో మ్యాచ్‌లు సాగుతాయి. తనకన్న మెరుగైన ర్యాంకు క్రీడాకారిణు లను ఎదుర్కోవడంపై అంకిత ఈ టోర్నీలో పురోగతి ఆధారపడి ఉంటుం ది. అంకిత ఇటీవల సింగపూర్ టైటిల్‌ను గెలుచుకుంది. ఆస్ట్రేలియా గ్రాండ్ స్లామ్ ఆడిన తర్వాత ఆమె తన కెరీర్ ఉత్తమ ర్యాంక్ 165కు చేరుకుంది. మా తొలి సవాల్ థాయ్‌లాండ్ నుంచి ఎదురుకా నుంది. ఆ జట్టును ఓడిం చడమే లక్ష్యంగా సాగుతుం దని జట్టు కెప్టెన్ విశాల్ ఉప్పల్ మంగళవా రం మీడియాతో అన్నాడు. భారత డబుల్స్ జట్టులో ప్రార్థనా థాంబోర్‌తోపాటు మహక్ జైన్, మాజీ చాంపియన్ రియా బాటియా లున్నారు. కజకిస్తాన్ వాతావరణ పరిస్థితులు అలవాటు పడటానికి ముందే ఇక్కడి కి చేరుకున్నాము. క్రీడాకారిణులు స్థానిక వాతావరణానికి అలవాటు పడుతున్నారు



Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and Printed at Andhra Prabha Publications Ltd., Part no 75, Opp: Time Hospital, Ashok Nagar, Vijayawada - 520010.
Editor: Mootha Goutam, Responsible for News selection under PRB ACT. RNI Regd No. 3464/59.

ఆంధ్రప్రభ
lifepage2012@gmail.com
L ively
I nteraction
F or
E ver
లైఫ్
బుధవారం 6 ఫిబ్రవరి 2019

ఏది నీ స్థాయి...

ఆకాశమా.. అథ:పాతాళమా?!



వాసు తీరిగ్గా ఇంట్లో ముందుగదిలో కూర్చుని పేపరు చదువుతున్నాడు. ఆ రోజు రెండో శనివారం అతనికి ఆఫీసుకి సెలవు. అప్పటికి ఒకసారి టిఫిన్, మూడుసార్లు కాఫీలు ఇచ్చిన వాసు భార్య కస్తూరి...అతను నాలుగోసారి కాఫీ అడిగేసరికి సిద్దంగా ఉంచడానికి పాలు కాస్తోంది. అడిగిన రెండునిముషాల్లో వేడి కాఫీ కప్పు అతని ముందు ఉండాలి. లేకపోతే నేనంటే లెక్కలేదా...అంటూ తిట్లు మొదలు పెట్టేస్తాడు. ఆ సమయంలో ఓ చిన్న బ్యాగుతో ఇంట్లోకి వచ్చాడు వివేక్. వంటింట్లోంచి బయటకు వచ్చి చూసిన కస్తూరి ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అవుతూ....అన్నయ్యా..అంటూ పెద్దగా అరిచేసింది. అదే సంతోషాన్ని కంటిన్యూ చేస్తూ...'ఏమండీ మా పెద్దనాన్నగారి అబ్బాయి....మా అన్నయ్య... మన పెళ్లికి వీళ్ల ఫ్యామిలీ మొత్తం అమెరికాలో ఉంది....మీరు చూడలేదు కదా...' అంటూ ఇద్దరికీ ఒకరిని ఒకరికి పరిచయం చేసింది.

'ఆ... అమలాపురంలో ఉంటారు కదా మీరు...మీకు చేపల చెరువులు ఉన్నట్టున్నాయి...ఏంటండీ బాబు అమెరికాలో చాలారోజులు ఉండిపోయినట్టున్నారు. ఏమైనా మనం ఇక్కడ సంపాదించామంటే మన పిల్లలు అమెరికాలో చదవాల్సిందే. అక్కడ ఏంచేస్తారో తెలియదు కానీ...ఇక్కడ మాత్రం మా పిల్లలు అమెరికాలో ఉన్నారంటూ గొప్పగా చెప్పేసుకోవచ్చు...చూస్తున్నాంగా... చదువుకోవడానికి వెళ్లి వెనక్కు వస్తున్న పిల్లలను...' మొదటి పరిచయంలోనే వాసు అలా తలాతోకా లేకుండా మాట్లాడుతుంటే ఆ వచ్చిన పెద్దమనిషి వివేక్...చిరునవ్వుతో చూస్తూ ఉండిపోయాడు. వాసు... చేపల చెరువులు... అనగానే కస్తూరి ఏదో చెప్పబోయింది...కానీ వివేక్ సైగ చేయటంతో ఆగిపోయింది. అప్పటినుండి వివేక్‌తో వాసు ఏదోఒకటి పిచ్చాపాటి మాట్లాడుతూనే ఉన్నాడు. కాసేపటికి పక్కింటి అమ్మాయి పరిమళ వచ్చింది. ఆ అమ్మాయి, కస్తూరి కలిసి సాఫ్ట్‌టాయిస్ తయారుచేసి అమ్ముతుంటారు. 'పెళ్లిసంబంధం వచ్చిందటగా పరిమళా...' అంటూ వాసు ఆమెని పలకరించాడు. అవును...పెళ్లికొడుకుది బ్యాంక్ జాబ్ అంటూ వివరాలు చెప్పుకొచ్చింది పరిమళ. అంతే అదేదో పెద్ద జోక్‌లా నవ్వేస్తూ...'మీ నాన్న వాచ్‌మేన్, నువ్వు ఈ పనికిరాని బొమ్మలు తయారుచేస్తుంటావు...నీకు బ్యాంక్ జాబ్ చేసే కుర్రాడి సంబంధం వచ్చిందా....అదృష్టవంతురాలివే' అన్నాడు వాసు కాస్త వెటకారంగా. ఆ పిల్ల చిన్నబుచ్చుకుంది.



* * *

వివేక్... కస్తూరి, పరిమళ కలిసి తయారుచేస్తున్న సాఫ్ట్‌టాయిస్‌ని చూసి ఆశ్చర్యపోయాడు. కస్తూరి అందులో శిక్షణ తీసుకుందని తెలుసుకుని మరింత ఆనందంగా ఆమెని అభినందించాడు. 'మా చెల్లి చిన్నప్పటినుండీ అంతే ఇలా చూసిందంటే చాలు అలా పట్టేస్తుంది' అన్నాడు వాసుతో. వాసు మరోసారి వెటకారంగా నవ్వుతూ...'మీరే చెప్పుకోవాలి...మీ చెల్లెలి గొప్పలు. ఇంట్లో కూర్చుని ఆ బొమ్మలు కుట్టటం కూడా ఒక గొప్పేనా...ముందు మీచెల్లిని వంట సరిగ్గా చేయటం నేర్చుకోమని చెప్పండి' అన్నాడు.

వివేక్ అతనివైపు ఆశ్చర్యంగా చూశాడు. తను వచ్చినప్పటినుండీ చూస్తున్నాడు. వాసు నోటివెంట ఒక్క మంచిమాట రాలేదు. ఎవరో ఒకరిని ఏదో ఒక విషయంలో వెక్కిరిస్తూనో, కించపరుస్తూనో మాట్లాడుతున్నాడు.

* * *

పరిమళ తరువాత కస్తూరి వాళ్లకి పాలుపోసే అతను వచ్చాడు. అతని కొడుకుకి సినిమాలంటే పిచ్చి. అయితే మూడేళ్లు శ్రమపడి అనుకున్నది సాధించాడు. సినిమాల్లో కాస్త గుర్తింపు ఉన్న చిన్నపాటి పాత్రలు పోషిస్తున్నాడు. ఆ విషయాన్ని కస్తూరికి చెప్పి తన కొడుకు నటించిన సినిమాల పేర్లు చెప్పాడు...కస్తూరి నిజంగా చాలా ఆనందించింది. 'నేను అనుకుంటూనే ఉన్నాను సాంబయ్యా...వాడికి పట్టుదల చాలా ఎక్కువ. చూడు వాడు నీకెంత పేరు తెచ్చిపెడతాడో' అంటూ అతడిని కూడా అభినందించింది. ఆ వెంటనే వాసు అందుకున్నాడు....' ఆఆ తెస్తాడు పేరు...ఇలాంటివాళ్లని ఎంతమందిని చూడలేదు...నాలుగురోజులు తిరిగి కడుపుకాలాక ఏం చేయాలో తెలియక ఇంటిదారి పడతారు. లేదా ఏ కూలోనాలో చేసుకుంటూ బతకాల్సిందే..ఇలాంటివాళ్లంతా హీరోలైపోతే...ఇక అంతే...వాడిని ఇప్పుడే తీసుకువచ్చేస్తే మంచిది' అన్నాడు సాంబయ్యతో. అతని మనసు చివుక్కుమంది. కొడుకులో నిజంగానే టాలెంట్ ఉంది. వాడు మూడేళ్లుగా ఇంటినుండి ఒక్క పైసా కూడా అడగకుండా అక్కడే ఏదో తిప్పలు పడుతున్నాడు. 'సాధ్యమైనంతవరకు కష్టపడతాను నాన్న...ఇక నావల్లకాదు..అనుకున్నపుడు వచ్చేసి బుద్దిగా మన పాల వ్యాపారం చేసుకుంటాను' అని మాట ఇచ్చాడు. వాడి ఆశలో నిజాయితీ ఉందనిపించే ఊరుకున్నాడు తను. అదే చెప్పాడు వాసుతో సాంబయ్య. అతను వేసిన క్యారక్టర్లను గురించి చెప్పాక వాసుకి అర్థమైంది...అతను టాలెంట్ ఉన్నవాడేనని. లేకపోతే మూడేళ్లలో అంతస్థాయికి రావటం సాధ్యం కాదు. అయినా వాసు సాంబయ్యని అభినందించలేదు. 'అబ్బో... అప్పుడు సాంబయ్యగారు మనకు కారులో వచ్చి పాలుపోస్తాడేమో' అన్నాడు తన వెటకారపు నవ్వుని కొనసాగిస్తూ. అప్పటివరకు నవ్వుతున్న సాంబయ్య మొహం చిన్నబోయింది. అది చూశాక వాసు మనసు శాంతించింది.

* * *

ఆ తరువాత భోజనాల దగ్గర కూడా కూరలు బాగోలేదని పెరుగు సరిగ్గా తోడుకోలేదని ఇలా రకరకాల విమర్శలు చేసి భోజనం పూర్తి చేశాడు. మాటల సందర్భంలో వివేక్ అడిగాడు...'కస్తూరి సాఫ్ట్‌టాయ్స్ బాగా చేస్తోంది. దానిచేత ఇదే చిన్నపాటి పరిశ్రమలా పెట్టించవచ్చు. మీరు వద్దంటున్నారట కదా' అని. వాసు కాస్త సీరియస్‌గా చూస్తూ...'ఏం చేస్తారు ఈ ఆడవాళ్లు. నాలుగు రోజులు చేసి నా వల్లకాదంటే నాకు పెట్టుబడి దండగ. అందుకే వద్దన్నాను' అన్నాడు. 'మీకు తెలియదు తన గురించి... తను అనుకున్నదంటే సాధించి తీరుతుంది... మీరు వద్దంటే చెప్పండి...ఆ పెట్టుబడేదో నేనే పెడతాను. మా చెల్లి పైకొస్తే నాకూ సంతోషమేగా' అన్నాడు వివేక్. 'నాకు ఇష్టంలేదండీ' వెంటనే తెగేసి చెప్పినట్టుగా అన్నాడు వాసు. 'నాకు నా భార్య ఇల్లు చూసుకుంటే చాలు. ఇప్పటికే ఈ బొమ్మలంటూ తిరుగుతూ...నానా వేషాలూ వేస్తోంది. చూశారా...ఎలా తయారైందో బ్యూటీ పార్లర్‌కి వెళ్లటం అవసరమా తనకి' అన్నాడు కోపాన్ని ఆవేశాన్ని కలగలిపి. కస్తూరికి కోపం తన్నుకొస్తోంది. రాకరాక వచ్చిన పెద్దనాన్న కొడుకుముందు పోట్లాడితే బాగోదని తమాయించుకుంది.

* * *

కస్తూరి వాసుల పెళ్లయి ఆరునెలలవుతోంది. ఈ ఆరునెలల్లో ఇలా చాలాసార్లు తమాయించు కుందామె. తన భర్తలో ఇంత సంకుచిత బుద్ది ఉంటుందని ఆమె ఊహించలేకపోయింది. తండ్రి చనిపోతే వచ్చిన ఉద్యోగంతో ఇరవై ఏళ్లకే ప్రభుత్వ ఉద్యోగి అయ్యాడు వాసు. ఇప్పుడు అతని వయసు ఇరవై ఎనిమిది. ఆ ఉద్యోగం చేసి ఇంటికి రావటం తప్ప ఈ ప్రపంచంతో ఇక తనకు అవసరమే లేదన్నట్టుగా ఉంటాడు. విపరీతమైన వెటకారం...ఎవరు కాస్త మంచిగా ఉన్నా, ముందుకు వెళుతున్నా తట్టుకోలేడు. చివరికి ఈ విషయంలో భార్యకు కూడా మినహాయింపు లేదు. పెళ్లయిన దగ్గరనుండి కస్తూరికి జైల్లో ఉన్నట్టుగా ఉంది. ఇంట్లోంచి బయటకు రాకూడదు. పెద్దగా నవ్వకూడదు, ఫోన్లో ఎక్కువ సేపు మాట్లాడకూడదు... ఇలాంటి ఆంక్షల మధ్యే గొడవపడి మరీ ఆ బొమ్మలు చేయటం నేర్చుకుంది. తను ఏం ఆలోచించినా వాసుకి వెటకారంగా ఉంటుంది. ఏ ఆలోచన చెప్పినా....అబ్బో చాల్లే నీ తెలివితేటలు... అంటూ ఒక్కమాటలో తుంచేస్తాడు. ముఖ్యంగా కస్తూరికి వ్యాపారం అంటే చాలా ఇష్టం. సొంతంగా ఒక టాయ్స్ షాపు పెట్టాలనే ఆశ ఉంది. ఇంకా చాలా చేయాలని ఉంది. వాట్సప్‌లో తన కజిన్స్ అందరూ వాళ్ల చదువులు కెరీర్‌లను గురించి మాట్లాడుకుంటుంటే... ఇక తన జీవితమంతా ఇంతేనా...ఈ నాలుగు గోడల మధ్యే మగ్గిపోవాలా,,, అనిపించాక వివేక్‌కి అన్నీ ఫోన్లో చెప్పింది. అందుకే వివేక్ పనిగట్టుకుని ఢిల్లీనుండి వచ్చాడు. 'అమలాపురంలో గొడ్లు మేపుకునే వాళ్లు కూడా వచ్చి నాకు సలహా ఇచ్చేవారే' అన్నాడు వాసు వివేక్‌ని బాధపెట్టాలనే. వివేక్ నవ్వుతూ...'నేను ఆనందరావుని కాదు. వాడు నా తమ్ముడు. నేను సైకియాట్రిస్ట్ వివేక్‌ని ఢిల్లీలో ఉంటాను' అన్నాడు. ఒక్కసారిగా ఖంగుతిన్నాడు వాసు. కాస్త జంకాడు.

* * *

వాసు వివేక్‌ని చూడగానే అమలాపురం ఆనందరావని అనుకున్నాడు...కస్తూరి కాదని చెప్పబోతుంటే వివేక్ వద్దని సైగ చేశాడు. 'అయితే ఏంటి..ఇప్పుడు మీరు నాకు కౌన్సెలింగ్ ఇవ్వడానికి వచ్చారా..' అన్నాడు వాసు అదే బింకంతో. 'కౌన్సెలింగ్ ఇవ్వడానికి మీరేమీ పేషంట్ కాదు...అయితే మీరు ఒక విషయం మాత్రం చెప్పండి. నేను వచ్చినప్పటినుండీ చూస్తున్నాను. పరిమళ పెళ్లి విషయం చెబితే...నీకు అంత అర్హత ఉన్న అబ్బాయి అవసరమా అన్నారు. సాంబయ్య తన కొడుకు గురించి చెబితే అతను రాబోయే రోజుల్లో కూలినాలి చేసుకుని పనిచేసుకోవాలి...అని తీర్మానించేశారు. వాళ్ల సమర్థత ఏమిటో, వారి అర్హత ఏమిటో నిర్ణయించే అధికారం మనకేముంది చెప్పండి'. వాసు మాట్లాడలేదు. అతని మొహం ఎఱ్ఱబారుతోంది. అతనికి కోపం వస్తోంది. 'వాసూ మీకు తెలియటం లేదు...మీ ఆలోచనల వలన అందంగా ఉండాల్సిన మీ కాపురం నరకంగా మారే పరిస్థితులు కనబడుతున్నాయి. మీరు విన్నా వినకపోయినా...ఇవన్నీ నిజాలు. అంటూ వివేక్ తన మాటలు కొనసాగించాడు. 'ఇంటర్ చదవటంతోనే మీకు జాబ్ వచ్చేసింది. ఆ చదువు తప్ప మీకున్న అర్హత ఇంకేమీ లేదు. అది మీకు ఆత్మన్యూనతగా మారింది. ఇదే కాదు...మీలో ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్ చాలా ఉంది. కస్తూరి ఇక్కడ సాఫ్ట్ టాయ్స్



ఈ రోజు ఉన్నట్టుగా ప్రపంచం రేపు ఉండటం లేదు. ఇక్కడ ఇతరులకు బాధకలగకుండా ఎవరికి నచ్చినట్టుగా వారు బతికే హక్కు అందరికీ ఉంది. మనమెవరం...ఎవరిస్థాయి ఏమిటి అని నిర్ణయించడానికి...నిజానికి మన చేతుల్లో ఉన్నది ఒక్కటే...మన స్థాయిని తగ్గించుకోవడమో పెంచుకోవడమో. అంతకుమించి ఏమీ చేయలేము.

విషయంలో చాలా నేర్చుకుంది. మార్కెట్ కూడా చేయగలుగుతోంది. ఆమె సమర్థురాలన్న సంగతి మీకు కూడా తెలుసు. అందుకే ఆమెను ఎప్పుడూ కిందకు లాగే ప్రయత్నం చేస్తున్నారు. ఒక్కసారి అన్ని ఇగోలు పక్కనపెట్టి ఆలోచించండి. పరిమళ తండ్రి వాచ్‌మేనే కావచ్చు. అతను తన కూతురి జీవితం బాగుండాలని ఎందుకు కోరుకోకూడదు. అందులో అత్యాశ ఏముంది..పరిమళ తను కూడా సొంతంగా సంపాదించుకోవాలని, తల్లిదండ్రులకు సహాయపడాలని తాపత్రయపడుతోంది. అందులో ఎగతాళి చేసే విషయం ఏముంది...మీ మనసు చుట్టూ ఒక కంచెవేసుకున్నారు. ఇతరులు ముందుకు వెళుతున్నారు...అంటే ఎందుకు మీకు భయంగా ఉంది...ఇతరులు తమ సమర్థతని గురించి చెబుతుంటే...మీరెందుకు ఉలిక్కిపడుతున్నారు...మీమీద మీకు నమ్మకం గౌరవం లేవు. నేను తక్కువ... అనే ఫీలింగ్‌తో ఉన్నారు కాబట్టి...మీకంటే ఎక్కువగా ఎవరు అనిపించినా...మీకు నచ్చటం లేదు. వారిని ఏదో ఒక మాట అని సంతృప్తి పడుతున్నారు. ఒక్కసారి ఆలోచించండి...ఈ ప్రపంచం చాలా విశాలమైంది. మీ ఇంటిపక్కన ఉన్న పరిమళ, మీకు పాలుపోసే సాంబయ్య...వీళ్లే కాదు...వీళ్లిద్దరినీ మీరు కించపరచినంత మాత్రాన ఏం జరుగుతుంది. ప్రపంచం ముందుకు వెళుతూనే ఉంటుంది. పరిమళకు బ్యాంకు ఎంప్లాయితో పెళ్లవక మానదు...సాంబయ్య కొడుకు పైకి రాకా మానడు. మీచుట్టూ ఉన్నవారిని తక్కువ చేసి మాట్లాడి...హమ్మయ్య వాళ్లు ముందుకు వెళ్లలేరులే అనుకుంటే అది మీ అమాయకత్వమే అవుతుంది. ఇతరులను ఒక్క మంచిమాటతో అభినందించలేకపోతున్నారంటే... ఇతరులను బాధపెట్టేలా మాట్లాడితే...ఇతరులను కించపరిస్తే మీకు ఆనందం కలుగుతుందంటే....మీ స్థాయి ఏమిటో మీరు ఒక్కసారి ఆలోచించుకోండి.

* * *

ఈ రోజు ఉన్నట్టుగా ప్రపంచం రేపు ఉండటం లేదు. ఇక్కడ ఇతరులకు బాధకలగకుండా ఎవరికి నచ్చినట్టుగా వారు బతికే హక్కు అందరికీ ఉంది. మనమెవరం...ఎవరిస్థాయి ఏమిటి అని నిర్ణయించడానికి...నిజానికి మన చేతుల్లో ఉన్నది ఒక్కటే...మన స్థాయిని తగ్గించుకోవడమో పెంచుకోవడమో. అంతకుమించి ఏమీ చేయలేము. మీ మానసిక స్థాయి పెరిగితే మీ భార్య మీతో ఆనందంగా ఉంటుంది...మిమ్మల్ని మీరు ఇలాగే తక్కువగా చూసుకుంటూ...ఇతరులు కూడా అక్కడే ఉండాలని కోరుకుంటుంటే...మీ భార్య జీవితాంతం ఏడుస్తూ మీతో ఉంటుంది....ఆ ప్రభావం...మీ తరువాత తరాలపైన కూడా పడుతుంది.' వాసు వెళ్లిపోవాలని అనుకున్నా...వెళ్లలేకపోయాడు. మౌనంగా ఉండిపోయాడు...కస్తూరి కళ్లనిండా నీళ్లు...వాటినే చూస్తున్నాడు వాసు....'అరె ఈ అమ్మాయిని బాధపెట్టే అధికారం నాకేముంది'...అని మొదటిసారిగా అనిపించింది వాసుకి.

- వడ్లమూడి దుర్గాంబ

ఆ సన్నదనం నుండి విముక్తి... ఆసన్నం!

దక్షిణ కొరియాలో అధికబరువున్న అమ్మాయిలకోసం మోడలింగ్ వేదిక శరీర కొలతల చట్రం నుండి బయటకు వస్తున్న యువతులు

ప్రపంచవ్యాప్తంగా ఆడవాళ్లపై రకరకాల ఒత్తిళ్లు ఉన్నాయి. ఇప్పుడు ఆడపిల్లలపై ఉన్న పెద్ద ఒత్తిడి అందంగా కనిపించాల్సి రావటం. అవును...సన్నగా నాజూగ్గా ఉండాల్సిన ఒత్తిడి వారిపైన చాలా ఉంటోంది. సినీ మోడలింగ్ రంగాల్లో ఉన్నవారే కాదు...సాధారణ అమ్మాయిలు సైతం...అలాగే ఉండాలని కోరుకుంటున్నారు. సోషల్ మీడియా వచ్చాక...అనుక్షణం ఫొటోలు తీసి పోస్టు చేస్తున్న నేపథ్యంలో ఆడపిల్లలు నిరంతరం ఒక అందాల పోటీలో ఉన్నట్టుగా ఫీలవుతున్నారు. ఇది ఇక్కడే కాదు...ప్రపంచమంతా ఉంది. దక్షిణ కొరియా మహిళలు సైతం ఇలాంటి ఒత్తిడికి లోనవుతున్నారు. అక్కడ యాభై కిలోలకంటే ఎక్కువ బరువున్న మహిళలను లావున్నవారిగా పరిగణిస్తున్నారు. మామూలుగా అయితే లావుని ఎత్తుని బట్టి లెక్కవేయటం ఉంటుంది కానీ... అక్కడ మాత్రం ఎంత ఎత్తు ఉన్నా...యాభై కిలోలు మాత్రమే బరువు ఉండాలంటున్నారు. అయితే మోడలింగ్ అనేది కొంతమందికి కలల కెరీర్. కేవలం బరువున్నంత మాత్రాన ఆశలు వదిలేసుకోవాలా...అని దక్షిణ కొరియా మహిళలు ప్రశ్నిస్తున్నారు.



ఈ నేపథ్యంలో పార్క్ అనే 25ఏళ్ల యువతి...మోడల్ కావాలని అనుకుని చాలా ప్రయత్నాలు చేసింది. ఆమె లావుగా ఉండటంతో కొన్నాళ్లు డైటింగ్ చేయటం, తరువాత ఎక్కువగా తినేయటం...ఇలా నానా ఇబ్బందులు పడిన తరవాత ఆమె ఒక విషయాన్ని గమనించింది. తను పొడవు కాదు, సన్నం కాదు. మోడలింగ్‌కి ఆదర్శం అంటున్న శరీర తీరు తనకు సాధ్యం కాదని. దాంతో తననితాను నేచురల్ సైజ్ మోడల్‌గా వర్ణించుకుంటూ...ఒక యూట్యూబ్ చానల్ ని మొదలుపెట్టింది. నేచురల్ సైజ్ మోడల్ అంటే నిజజీవితంలో ఎలా ఉంటామో...అలా ఉండటమే. యూట్యూబ్ ఛానల్‌లో ఆమె తనలాగా, తనకంటే ఎక్కువగా లావుగా ఉన్నవారికి ఫ్యాషన్లను పరిచయం చేస్తోంది. ఫ్యాషన్ మేగజైన్లలో కనిపించే సన్నటి మోడళ్లలాగే వీరూ ఛానల్‌లో కనబడుతున్నారు.

పార్క్ ఆలోచన అక్కడి మహిళలకు బాగా నచ్చింది. దాంతో వందలమంది యువతులు యాష్‌ట్యాగ్ టాల్‌కోర్‌సెట్ పేరుతో నేచురల్ సైజ్ మోడల్ విధానాన్ని సమర్థిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు. నడుమువద్ద సన్నగా కింద లావుగా ఉండే దుస్తుల పేరు కోర్‌సెట్. అది వద్దు...అనే అర్థంలో వారు ఆ పేరు పెట్టుకున్నారు. పార్క్ ఇటీవల సియోల్‌లో అన్ని రకాల శరీర బరువు ఉన్న



అమ్మాయిలతో సియోల్‌లో ఒక ఫ్యాషన్ షో కూడా నిర్వహించింది. ఆమెని సమర్థిస్తూ...అనేక మంది వీడియోలు ఫొటోలు పోస్టు చేస్తున్నారు. ఆ ఫొటోల్లోవారు జుట్టుని కత్తిరించుకుని, మేకప్ సామాగ్రిని చిందరవందర చేస్తూ...మేకప్ లేకుండానే బయటకు వస్తూ...వీడియోలు పెడుతున్నారు. సన్నగా ఉంటేనే ఆనందంగా ఉండవచ్చని మొదట అనుకున్నానని కానీ... ఇప్పుడు నేను ఎలా ఉన్నానో అలా ఉండటమే ఆనందమని భావిస్తున్నానని పార్క్ అంటున్నారు.

దక్షిణ కొరియాలో పురుష ఆధిపత్యం కొనసాగుతున్నప్పటికీ...అక్కడి మహిళలు ఫెమినిజం బాటపడుతున్నారు. మహిళలపై అందంగా ఉండాలనే ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని సియోల్‌లోని ఒక యూనివర్శిటీలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జెండర్ స్టడీస్ పరిశోధకుడు సోన్‌హీ జాంగ్ అంటున్నారు. అయితే దక్షిణ కొరియా మహిళలు ఈ బంధనాల నుండి బయటపడేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు. ఛా జీ వోన్ అనే 24ఏళ్ల అమ్మాయి...ఒక యూట్యూబ్ ఛానల్‌ని నిర్వహిస్తోంది. ఆమె తనజుట్టుని తనకు నచ్చినట్టుగా వదిలేస్తూ తన దుస్తులను తనకు సౌకర్యంగా అనిపించేలా ధరిస్తూ...మేకప్ లేకుండా తిరగటం మొదలుపెట్టాక ఆమెకు...యూ ట్యూబ్‌లో వీక్షకులు పెరిగారు. 7,20,000 వ్యూస్ వచ్చాయి. ఇప్పుడు తనకు నచ్చినట్టుగా తింటున్నానంటోంది ఆమె. మీరు ఎలా కనబడుతున్నారు...అనే విషయం గురించి ఎక్కువగా ఆలోచించవద్దని తోటి మహిళలకు సలహా ఇస్తోంది...ఛా.

చింతన

ఆత్మవల్లనే దేహం చైతన్యవంతం



అధ్యాయం-13, శ్లోకం -34

యథా ప్రకాశయత్యేకః
కృత్స్నం లోకమిమం రవిః।
క్షేత్రం క్షేత్రీ తథా కృత్స్నం
ప్రకాశయతి భారత ॥

తాత్పర్యం

ఓ భరతవంశీయుడా! ఒక్కడేయైన సూర్యుడు లోకమంతటిని ప్రకాశింపజేయునట్లు, దేహములోని ఆత్మ సమస్త దేహాన్ని చైతన్యంతో ప్రకాశింపజేస్తుంది

భాష్యం

సూర్యుడు ఒక్క చోటనే ఉండి అంతటినీ కాంతివంతము చేసినట్లు, ఈ శరీరంలోని హృదయంలో ఉండు అతి సూక్ష్మమైన ఆత్మ, శరీరమునంతటినీ చైతన్యవంతం చేస్తుంది. సూర్యరశ్మిని బట్టి సూర్యుని ఉనికిని గుర్తించినట్లు, చైతన్యమును బట్టి ఆత్మయొక్క ఉనికిని గుర్తించవచ్చును. ఆత్మ ఉన్నంతవరకు శరీరమంతటా చైతన్యం ఉంటుంది. అదే ఒకసారి ఆత్మ వెళ్ళిపోతే శరీరము అచేతనమవుతుంది. తెలివిగలవారు ఈ విషయాన్ని గుర్తించవచ్చు. కాబట్టి చైతన్యమనేది భౌతిక మూలకాల సమ్మేళనము వలన ఉద్భవించినది కాదు. అది ఆత్మ లక్షణము. అయితే ఆత్మ చైతన్యము ఆ శరీరానికే పరిమితమైతే, అతని స్నేహితునిగా కొనసాగే పరమాత్మ అన్ని శరీరాల చైతన్యాన్ని కలిగి ఉంటుంది. కాబట్టి వారివురూ చైతన్యవంతులే అయినా ఈ భేదాన్ని కలిగి ఉంటారు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యధాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

భక్తికి మొదటి మెట్టు
భగవంతునిపై మమకారం

కోరికలు తీరడానికో, బాధల నివారణకో మాత్రమే భక్తిని వినియోగించరాదు. తీవ్ర భక్తి ఉంటే ఇవన్నీ వాటంతటవే నెరవేరుతాయి. భక్తి కావాలంటే అహంకార మమకారాల త్యాగానికి సిద్ధమవ్వాలి. భగవంతుని మీద విశ్వాసం, ప్రేమ ఉండాలి. మనసావాచా కర్మణా భక్తి సాధనలను ఆచరించాలనే దృఢ నిశ్చయం ఉండాలి. భక్తి సాధనలో ఏకాగ్రత కుదిరేందుకు లోపల బయట శుచిగా ఉండాలి. సర్వమూ ఈశ్వరమయంగా చూడగలగాలి.



భక్తి అనేది చాలా మంది ఎక్కువగా వినే పదమే. దేవునిపై భక్తి గురించే ఎక్కువగా ఈ పదం వాడుతుంటారు. ఈ భక్తికి ఎన్నో నిర్వచనాలు ఎంతో మంది మహానుభావులు చెప్పారు. నారద భక్తి సూత్రాలు ఈ అంశాన్నే కూలంకషంగా వివరించాయి. అయితే భక్తి అవసరం, ప్రయోజనం, దాని సాధనకు యోగ్యత, భక్తిలో రకాల గురించి ఒకసారి గుర్తు చేసుకుందాం. భగవంతుని నుంచి వేరైన జీవుడిని తిరిగి భగవంతునిలో ఐక్యం చేసేది భక్తి. అందువల్ల భక్తి అంటే కలయిక. అనగా ఒక యోగం. అందువలప భక్తి సాధనలను భక్తి యోగంగా పిలుస్తారు.

అవసరం

భగవంతుని నుంచి జీవుడు దూరమవటానికి కారణం అహంకార, మమకారాలు. వీటిని తొలగించుకుంటే జీవుడే దేవుడు. దీనికి మార్గం భక్తి. కష్టాలతో విసిగి వేసారిన వారు తమ దుఃఖ నివృత్తి కోసం భక్తిని స్వీకరిస్తుంటారు. పూర్వ జన్మలలో చేసిన సాధన ఫలితంగా కొందరికి చిన్న వయసులోనే భక్తి భావం కలుగుతుంది. ప్రహ్లాదుడు, ధ్రువుడు అటువంటివారే.

ప్రయోజనం

భక్తి వల్ల భగవంతుని అనుగ్రహం పొందవచ్చును. అనుగ్రహం వల్ల జనన మరణరహితమైన ముక్తిని పొందవచ్చును. సంసార దుఃఖం నుంచి, బంధం నుంచి విముక్తి సాధించవచ్చును. పరమ శాంతి, శాశ్వతానందం పొందవచ్చు.

సాధనకు యోగ్యత

భక్తి సాధనకు కులమత, స్త్రీ పురుష, చిన్న పెద్ద భేదము లేక అందరూ యోగ్యులే. విపరీత భక్తితో ఎటు వంటి ప్రత్యేక సాధన లేకుండానే భగవంతుని పొందినవారు ఉన్నారు. అయితే అందరికీ అంతటి భక్తి కుదరడం కష్టం. ప్రత్యేకంగా భక్తి ఫలితాన్ని పొందాలంటే లక్ష్యమెరిగి భగవంతుని పొందడానికి సాధన చేయాలి. సాధనలో ఎన్నో రకాలున్నాయి. కోరికలు తీరడానికో, బాధల నివారణకో మాత్రమే భక్తిని వినియోగించరాదు. తీవ్ర భక్తి ఉంటే ఇవన్నీ వాటంతట అవే నెరవేరు తాయి. భక్తి కావాలంటే అహంకార మమకారాల త్యాగానికి సిద్ధమవ్వాలి. భగవంతుని మీద విశ్వాసం, ప్రేమ ఉండాలి. మనసావాచా కర్మణా భక్తి సాధనలను ఆచరించాలనే దృఢ నిశ్చయం ఉండాలి. భక్తి సాధనలో ఏకాగ్రత కుదిరేందుకు లోపల బయట శుచిగా ఉండాలి. సర్వమూ ఈశ్వరమయంగా చూడగలగాలి. చాలా మంది కోరికలు తీర్చుకోడానికో, బాధల పరిష్కారానికో మాత్రమే భక్తిని స్వీకరిస్తున్నారు. అవసరం లేనపుడు వదిలేస్తున్నారు. కోరికలు తీరడం, బాధలు తొలగడం జరిగితే మొక్కులు తీరుస్తున్నారు. లేకపోతే వేరే దైవాన్ని ఆశ్రయిస్తున్నారు. అంతేకాని భగవంతుని సరిగా అర్థం చేసుకోలేకపోతున్నారు.

భక్తిలో రకాలున్నాయి తామసిక, రాజసిక భక్తి కాక సాత్విక భక్తి ఉండాలి. భగవంతుని కోసం సర్వ సమర్పణ చేయగలిగి ఉండాలి. సర్వాన్ని త్యజించి భగవంతుని పాదాలనాశ్రయించాలి. బ్రహ్మమును చేరేందుకు చేసే ప్రయాణంలోఎదురయ్యే అనేక అవాంతరాలను దాటేందుకు నిత్యం భక్తిని అభ్యసించాలి.

భగవంతుని నుంచి జీవుడు దూరమవటానికి కారణం అహంకార, మమకారాలు. అయితే 'భగవంతుడు నా వాడు ' అనే మమకారంతో మొదలయ్యేది భక్తి. ఆ భక్తిలో జనించే ప్రేమ అలౌకికం. ఈ భక్తే మోక్షసాధనం.


పరా భక్తి

నిజమైన భక్తుడు భగవంతుని కోసం సర్వం త్యాగం చేసి తాను కూడా సర్వ సమర్పణ అవుతాడు. అదే పరాభక్తి అనబడు తుంది. పరాభక్తుడు కర్తగా ఉండడు. భోక్తగా ఉండడు. అతడికి ఇష్టాయిష్టాలు ఉండవు. సకల వ్యాపారాలకు భగవంతుడే అధిష్ఠానంగా ఉంటాడు. పరాభక్తుడికి స్థూల శరీరం పడి పోయినా తిరిగి ఏర్పడదు. అనగా జన్మ ఉండదు. సూక్ష్మ శరీరం కూడా భంగమై ఆత్మతత్త్వం మిగులుతుంది. దానినే 'జీవేశ్వరైక్యం' అంటారు.

సర్వేజనాస్సుఖినోభవంతు

- కోసూరు హయగ్రీవరావు
9949514583

నేనెవడను?



విషయవాసనలు (తలపులు) లెక్కకు మీఁటి సముద్రములోని అలలవలె కానవచ్చుచున్నవి. అవి యెప్పుడు వీగిపోవును?

చిరకాలంగా వచ్చే విషయ వాసనలు (కోరికలు) సముద్రతరంగాల వలె అనంతంగా ఉన్నప్పటికీ, స్వరూప ధ్యానము చేయగా చేయగా అవి అన్నీ నశిస్తాయి.

వాసనలన్నీ అణగి కేవలం స్వరూపంగా ఉండుట సాధ్యమేనా?

'సాధ్యమా, కాదా' అనే సందేహానికి చోటీయక స్వరూప ధ్యానమునే ఎడతెగక కలిగి ఉండాలి. ఒకడు ఎంత పాపి అయినా సరే, ''నేను పాపినే, ఎట్లా కడతేరడం?'' అని వెక్కి, వెక్కి ఏడవక, 'నేను పాపిని' అనే తలపును పూర్తిగా పారద్రోలి స్వరూప ధ్యానంలో దృఢమైన పట్టుదల కలవాడై ఉంటే, వాడు నిశ్చయంగా కడతేరగలడు.

మంచి మనస్సని, చెడ్డమనస్సని రెండు రకాల మనస్సులు లేవు. మనస్సు ఒక్కటే. వాసనలే శుభమని, అశుభ మని రెండు రకాలు. మనస్సు శుభవాసనతో కూడి ఉంటే మంచి మనస్సని అంటారు. ఇతరులెంత దుర్మార్గులుగా కనిపించినా వారిని ద్వేషింప రాదు. రాగ, ద్వేషములు రెండూ విడువ వలసినదే. ప్రపంచ విషయములందు మనస్సుని ఎక్కువగా ప్రసరింప జేయరాదు. వీలైనంత వరకు ఇతరుల వ్యవహారంలో ప్రవేశించరాదు. ఒకడు ఇతరులకు ఇచ్చేవన్నీ నిజానికి ఇచ్చుకునేది తనకే.

ఈ సత్యం తెలిస్తే ఇతరులకు ఈయని వారెవరు? 'తాను' లేచినచో సమస్తము లేచును. 'తాను' అణగారి నచో సకలము అణగిపోవును. మనము ఎంతెంతగా అణకువతో ప్రవర్తిస్తామో, అంతకు అంత మేలే అవుతుంది. మనస్సును వశపరచుకుంటే ఎక్కడైనా ఉండవచ్చు.

ప్రశ్నలు-సమాధానాలు

అనువాదం: ప్రణవానందులు

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

శాపగ్రస్తుల కథా కమామిషు-16

విశ్వామిత్రుడు సప్తర్షులలో ఒకడు. ఆయన పూర్వాశ్రమంలో గాధి అనే రాజు. వసిష్ఠుని స్థాయికి ఎదగాలని పట్టుబట్టి ఆ స్థాయికి ఎదిగి, ఆయన చేతనే బ్రహ్మర్షిగా గుర్తింపు పొందాడు. గాయత్రీ మంత్రానికి పరమార్థం ఏర్పరిచాడు. అయితే ఆయన ఆ విధంగా గాయత్రి మంత్రానికి పరమార్థం చెప్పటంతో ఈర్ష్యాసూయలకు గురైన ఒక అగ్ర కులం వారు ఆయనను దూషించారు. విశ్వామిత్రునికి కోపంఎక్కువ, సహనం తక్కువ. ఆయన తనను దూషించిన వారిపై ఆగ్రహించి మీరు గాయత్రీ మంత్ర జపానికి దూరం అవుతారు అని శపించాడు.

దుర్వాసుని శాపం

ఇంద్రునికి మేలు జరగాలని ఒక సారి దుర్వాసుడు మహాలక్ష్మీ యాగం చేశాడు. దేవి కటాక్షంతో ఒక పూలహారం ప్రసాదంగా పొందాడు. అది ఇంద్రునికిస్తే బాగుంటుందని దేవ సభలో కొలువు తీరి ఉన్న ఇంద్రునికి అందరి ముందూ ఆ హారాన్ని ఇచ్చాడు. 'ఈ హారం వేసుకుని నేను ఎక్కడకుపోను? ఎన్నాళ్లు తిరగను? అని భావించి నిర్లక్ష్యంగా దానిని తన గజమైన ఐరావతం మెళ్లో వేశాడు ఇంద్రుడు. ఐరావతం ఆ హారాన్ని తన కాళ్ల కింద పడేసి తొక్కి పాడు చేసింది. దుర్వాసుడు ఇది అవమానంగా భావించాడు. **'నీకు లక్ష్మీ కటాక్షం కలగాలని నేనిచ్చిన హారాన్ని నీవు స్వీకరించక ఐరావతానికి ఇచ్చావు. నీకే ఆ హారం విలువ తెలియదు. ఇక ఆ ఏనుగుకు ఎలా తెలుస్తుంది? నిన్ను శపిస్తున్నాను. నీతో పాటు దేవతలంతా లక్ష్మీ కళ తప్పిన వారవుతారు. అష్ట లక్ష్ములూ మీకు దూరమవుతారు. ఐరావతం, చంద్రుడు, ఉచ్చైశ్రవం, లక్ష్మి, కల్పవృక్షం, అమృత భాండం, పారిజాతం, అప్సరసలు, ధన్వంతరి మొదలైనవన్నీ మీకు తక్షణమే దూరమవుతాయి'** అన్నాడు. ఆయన చెప్పినట్టే జరిగింది. దానితో దేవతలంతా శ్రీహరిని శరణు వేడారు. దానికి ఆయన 'అవన్నీ దూరమై ఆయన శాపం ఫలించింది కనుక ఇప్పుడు క్షీర సాగర మథనం చేయండి. మళ్లీ అన్నీ లభిస్తాయి' అని ఉపాయం చెప్పాడు. వారి ఒక్కరి వల్ల అది సాధ్యం కాదు కనుక వారి సోదర సమానులైన రాక్షసుల్నీ ఒక్క తాటి పైకి తెచ్చి మథనం జరిపించాడు. దానితో వారు పోగొట్టుకున్నవన్నీ తిరిగి వచ్చాయి. ఎటువంటి వారికైనా అప్పుడప్పుడు బుద్ధి హీనత కలుగుతుందని, ఈ ఉదంతంలోని ఇంద్రుని చూస్తే తెలుస్తుంది.

నాగులకు తల్లి శాపం

కశ్యప ప్రజాపతి భార్యల్లో వినత, కద్రువ అనే వారున్నారు. వినత వలన గరుత్మంతుడు, కద్రువ వలన సర్పాలు జనించాయి. ఒకానొక సమయంలో వినత, కద్రువల మధ్య ఒక విషయంలో మాట పట్టింపు వచ్చింది. కద్రువకు తాను అన్నది తప్పని తెలుసు. అయినప్పటికీ తాను చెప్పినదే సరైనదని నిరూపించేందుకు తన కుమారులైన సర్పాల సాయం కోరింది. వారు ఆమె చెప్పింది తప్పు కనుక వారు అంగీకరించలేదు. దానితో ఆమె **మీ నాలుకలు చీలిపోవుగాక** అని శపించింది. ఆమె అన్నట్టుగానే గరుడుడు తెచ్చిన అమృతభాండంలోని అమృత బిందువులు దర్భలపై పడగా వాటిని నాకే ప్రయత్నంలో పదునుగా ఉన్న దర్భల వల్ల సర్పాల నాలుకలు చీలిపోయాయి. ఇప్పటికీ సర్ప జాతుల నాలుకలు చీలి ఉండడం చూడవచ్చు

కచ, దేవయానుల శాప ప్రతిశాపాలు

రాక్షస గురువైన శుక్రాచార్యునికి మృత సంజీవనీ విద్య తెలుసు. దేవదానవ యుద్ధంలో మరణించిన రాక్షసులను ఆయన ఆ విద్యతో బతికించేవాడు. ఆ విద్య తెలుసుకురమ్మని దేవ గురువు బృహస్పతి తన కుమారుడైన కచుని శుక్రాచార్యుని వద్దకు పంపాడు. అతడు దేవ గురువు బృహస్పతి కుమారుడని తెలిసినా విద్య కోరి వచ్చిన అర్థుడిని నిరాకరించ రాదని శిష్యునిగా స్వీకరించాడు. అతని వినయ విధేయతలకు, మేధస్సుకు శుక్రాచార్యుడు ముగ్ధుడయ్యాడు. అతని కోరిక మేరకు మృత సంజీవినీ విద్య నేర్పడానికి అంగీకరించాడు. అలాగే నేర్పాడు కూడా. అతడు ఆ విద్యనేర్చుకుని తన తండ్రి వద్దకు వెళ్లే ముందు గురువుకు, అంతకు ముందు తనకు ప్రాణదానం చేసిన గురుపుత్రిక దేవయానికి చెప్పి వెడదామనుకున్నాడు. ఆ సమయంలో దేవయాని కచుని తనను పెళ్లాడమని కోరింది. అతడు నిరాకరించాడు. దానితో ఆమె కోపించి **నీవు నేర్చుకున్న విద్య నీకు, దేవతలకు ఉపయోగపడకుండుగాక** అని శపించింది. దానికి ప్రతిగా కచుడు **నీవు నీ సవతి శర్మిష్ఠ చేత కష్టాలపాలవుతావు** అని శపించాడు. ఆ శాప ఫలితంగా దేవయానికి సవితి పోరు తప్పలేదు. దేవయాని భర్త యయాతి శర్మిష్ఠనూ పెళ్లి చేసుకున్నాడు. వారిద్దరి వలన ఆయనకు నలుగురు పుత్రులు కలిగారు. వారు పెరిగి పెద్దవారై పెళ్లీడుకొచ్చారు. యయాతి మరి కొంతకాలం యవ్వనంతో ఉండాలనుకుని కొద్దికాలం పాటు తన వృద్ధాప్యాన్ని తీసుకుని వారి యవ్వనాన్ని తనకు ఇస్తారా అని కుమారులను అడిగాడు. ముందు యయాతి దేవయానికి జన్మించిన తన పెద్ద కొడుకు యదువును అడిగాడు. అతను నిరాకరించడంతో **అతని సంతానం ఎవరూ రాజు కారనీ ఒక వేళ అయినా రాజులుగా నిలవరు** అని శపించాడు. ఆ యదు వంశానికి చెందిన శ్రీకృష్ణుని తాత, ముత్తాతలు క్షత్రియులైనప్పటికీ ఎవరూ రాజులు కాలేదు. దేవయాని రెండో కొడుకు కూడా తండ్రి వృద్ధాప్యాన్ని తీసుకోవడానికి నిరాకరించడంతో అతనిని **నీ వారంతా అడవులలో సంచరింతురు గాక** అని శపించారు. శర్మిష్ఠ కొడుకులలో ఒకడు వార్ధక్యాన్ని తీసుకునేందుకు అంగీకరించడంతో అతనిని చిరకాలం చల్లగా జీవించమని ఆశీర్వదించాడు. అయితే యయాతి దేవయాని కొడుకులిద్దరినీ శపించాడని శుక్రాచార్యుడు కోపించాడు. **నీకు తిరిగి వార్ధక్యం ప్రాప్తించుగాక** అని యయాతిని శపించాడు.

గాయత్రీజప దూరత్వం



- డాక్టర్ దేశిరాజు లక్ష్మీనరసింహారావు
9985844558

దిన ఫలాలు

మేషరాశి: పనులలో శ్రమ అధికంగా ఉంటుంది. ఆరోగ్యంలో మంచి మార్పులు చేకూరుతాయి. శుభవార్తలు వింటారు. ఆదాయంలో మెరుగైన వాతావరణం ప్రారంభమవుతుంది.

వృషభరాశి: అసహన పరిస్థితులు ఆర్థికంగా కొనసాగుతాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలు పొందుతారు. కుటుంబ వ్యవహారాల్లో చిరు సమస్యలు ఎదురవుతాయి. ఆదాయ మార్గాలు అన్వేషించగలుగుతారు.

మిథున రాశి: వాహన నిర్ణయాలు లాభిస్తాయి. గృహ కార్యాలు, కార్యక్రమాలు కలసి వస్తాయి. మానసిక ధైర్యం పెరుగుతుంది. ఆర్థిక అవమాన పరిస్థితులు కొనసాగుతాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలి. గతంలోని ఒప్పులు ఇప్పుడు తప్పులుగా మారతాయి. అధిక ప్రయత్నాలతో ఆదాయపరంగా అనుకూల పరిస్థితులు ఉంటాయి.

కర్కాటక రాశి: దూర ప్రయాణాలు కలసి వస్తాయి. అభివృద్ధి కుటుంబ రీత్యా ఆనందాన్ని కలిగిస్తుంది. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. ఆలోచనదోషాల ద్వారా సమస్యలు, అవమానాలు ఉంటాయి. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి. ఆదాయ మార్గాలు అనుకూలం.

సింహరాశి: ఆర్థిక ప్రయత్నాలు ఊరట కలిగిస్తాయి. వినోదాల్లో పాల్గొంటారు. ఆరోగ్యం పర్వాలేదు. ఆర్థిక విషయాల్లో సులువుగా అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో ఆశాజనకమైన వాతావరణం ఉంటుంది.

కన్యారాశి: ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలం. ఆహ్లాద పరిస్థితులు గృహ రీత్యా ఉంటాయి. సంబంధ, బాంధవ్యాల విషయంలో మనస్పర్థలు చోటు చేసుకుంటాయి. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు కొనసాగుతాయి. ఆదాయ మార్గాలు సులభతరమవుతాయి

తులారాశి: విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. కళారంగంలో ప్రతిభ గుర్తించబడుతుంది. ముఖ్యమైన పనులలో జాప్యాలు కొనసాగుతాయి. ఆరోగ్యంలో అనుకూలత ఉంటుంది. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.

వృశ్చికరాశి: వ్యాపార ఒప్పందాలు అనుకూలం. ఉద్యోగ వ్యవహారాల్లో ఆశించిన ఫలితాలు లభిస్తాయి. మానసిక చిరాకులు కొనసాగుతాయి. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. చేపట్టే కార్యాలలో వేగం తగ్గుతుంది. ఆదాయంలో అనుకూల/ ప్రతికూలతలు ఉంటాయి.

ధనూరాశి: ఉద్యోగ ప్రయత్నాలు లభిస్తాయి. ఆదాయంలో అనుకూల పరిస్థితులు ప్రారంభం. వేగంగా నిర్ణయాలు తీసుకోలేకపోతారు. ఆరోగ్యంలో ఖర్చులు తగ్గుతాయి. గతంలోని పొరపాట్లు సరిదిద్దుకోగలుగుతారు. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకరరాశి: ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. విదేశీ లావాదేవీలు ఊరట కలిగిస్తాయి. ఆరోగ్య రక్షణ తప్పనిసరి. ఆరోగ్య ఖర్చులు పెరుగు తాయి. మంచికి పోయి చెడు కోరి తెచ్చుకొంటారు. ఆర్థిక వ్యవహారాలు గట్టి ప్రయత్నాలతో మాత్రమే సాధ్యం.

కుంభరాశి: నూతన స్నేహాల ద్వారా లబ్ది చేకూరుతుంది. గృహ కార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. శుభవార్తలు వింటారు. ఆరోగ్య క్రమశిక్షణ ఏర్పడుతుంది. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. వ్యాపార అనుకూలత ఉంటుంది. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు మాత్రం ఆనందాన్ని కలిగిస్తాయి.

మీనరాశి: విద్యా ప్రయత్నాలు అనుకూలం. నూతన స్నేహాలు అనుకూలిస్తాయి. ఆరోగ్యంలో ఆకస్మిక ప్రతికూలత ఉంటుంది. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. కోర్టు వ్యవహారాల్లో ప్రతికూల ప్రభావం ఉంటుంది. ఆదాయంలో అనుకూల మార్పులు గోచరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

ఆంధ్రప్రభ నాయిక

ఆక్స్‌ఫర్డ్ టూ ఐపిఎస్

యుపి యువతి అఫ్రోజ్ ప్రస్థానం

ప్రత్యేకం

రైతు కుటుంబంలో జన్మించినా, పెద్ద చదువులు చదివే ఆర్థిక స్థోమత లేకపోయినా ఉన్నత చదువులు ఆర్జించాలనే తపనతో కష్టపడి చదివి స్కాలర్‌షిప్‌లను సంపాదించుకుని ఆక్స్‌ఫర్డ్‌లో విద్యను అభ్యసిస్తుంది. మంచి విద్యను పొందుతున్నందుకు సంతోషంగా ఉన్నా, మనసులో ఏదో వెలితిగా ఉండేది. దానికి కారణం తన గ్రామానికి, కుటుంబసభ్యులకు ఏమీ చేయలేకపోతున్నాననే బాధ. ఆ బాధను తొలగించుకోవడానికి ఆమె తిరిగి గ్రామానికి వచ్చి యుపిఎస్‌సి ప్రవేశపరీక్షలను రాసింది. మొట్టమొదటిసారి ప్రయత్నంలో ఆమె ఐపిఎస్‌ర్యాంకు సాధించింది. ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీని వదిలి ఐపిఎస్ వైపు రావడానికి గల కారణాలేమిటో పరిశీలిద్దాం.



ఐమా అఫ్రోజ్ పద్నాలుగేళ్ల వయసులో తండ్రి (రైతు) చనిపోయాడు. తండ్రిలేని కుటుంబ ఆర్థిక పరిస్థితి ఏవిధంగా ఉంటుందో అందరికీ తెలిసిన విషయమే. అటువంటి పరిస్థితుల్లో కూడా ఆమె తల్లి అండగా నిలబడి మంచి మార్గంలో నడిపించింది.

ఐమా అఫ్రోజ్ ప్రస్తుత వయసు 26సంవత్సరాలు. ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్ జిల్లా కందుకూరి టౌన్‌లోని ఒక రైతు కుటుంబానికి చెందినది. ఆమె ప్రజలకు సేవచేయడమే జీవిత లక్ష్యంగా చేసుకుంది. యుపిఎస్‌సి పరీక్షలలో ఐపిఎస్ ర్యాంకు సంపాదించడంతో ప్రతిష్టాత్మకమైన ఇండియన్ పోలీస్ సర్వీసులో స్థానం కోసం అప్పటివరకు విలాసవంతంగా గడుపుతున్న ఆక్స్‌ఫర్డ్ జీవితాన్ని వదులుకుని తన బాధ్యతలను చేపట్టడానికి భారతదేశానికి వచ్చింది. భారతదేశంలో శాంతి, సంపదలను కాపాడడమే నా కలని ఆత్మవిశ్వాసంతో చెబుతుంది.

ఆమె ఎంచుకున్న మార్గం పూలబాట కాదు. ఎన్నో అవాంతరాలు, అడ్డంకులు ఎదురౌతాయి. అయినా ఆమె దానిమీదే ఆసక్తితో ముందుకు వెళుతోంది. పద్నాలుగేళ్ల వయసులో ఆమె తన తండ్రిని తెలియని జబ్బుతో సరైన చికిత్స అందక పద్నాలుగేళ్ల వయసులో కోల్పోయింది. అటువంటి పరిస్థితి ఎవరికీ రాకూడదని ఆమె ఆ క్షణమే మనసులో నిర్ణయించుకుంది. తండ్రిలేని కుటుంబాన్ని తల్లే చూసుకుంటూ పిల్లలందరిని పెంచి పెద్దచేసింది.

''మా అమ్మ మా తమ్ముడికి మంచి విద్యాబుద్ధులు చెప్పించాలనుకుంది. ఆమె చాలా దృఢమైన మహిళ. ఒకసారి మనసులో ఏదైనా అనుకుంటే చేసి తీరాల్సిందే. తను రోజూ సంపాదించిన దాంట్లో కొంత మొత్తాన్ని మా పెళ్లి కట్నకానుకల కోసం వెనుకేసేది.



చదువు మీద నా ఆసక్తిని చూసి నువ్వేమి చదువుకోవాలనుకుంటున్నావో అది చదువుకో. కావలసిన సహకారం నేను చేస్తాను'' అని ఆమె ఇచ్చిన ప్రోత్సాహంతోనే ఈస్థాయికి రాగలిగాను అని ఐమా అఫ్రోజ్ చెబుతుంది.

గ్రామంలో హైస్కూల్ చదువు అయిపోయాక ప్రసిద్ధమైన సెయింట్ స్టీఫెన్ కాలేజ్‌లో ఫిలాసఫీ చదువుకుంది.

''మూడు సంవత్సరాలు నేను ఆ కాలేజీలో ఫిలాసఫీ చదువుకున్నాను. ఆ మూడు సంవత్సరాలు నా జీవితంలో ఎంతో మంచి రోజులు. ఆసమయంలోనే పర్యావరణం గురించి తెలుసుకున్నాను. విద్యార్థులను ప్రొఫెసర్లు మంచి ప్రాంతాల్లో వదిలిపెట్టి అక్కడ వాతావరణాన్ని పరిశీలించమని చెప్పేవారు. అక్కడే క్లాసులు కూడా నిర్వహించేవారు. క్లాసులో కంటే బయట ఈవిధంగా చెప్పిన పాఠాలే మాకు బాగా గుర్తుండిపోయాయి. ఫిలాసఫీ చదివితే మనిషిలో ఆలోచనాశక్తి పెరుగుతుందని నాకు ఇక్కడ చదివాకే తెలిసింది'' అని చెబుతుంది ఐమా అఫ్రోజ్.

చదువుమీద శ్రద్ధతో స్కాలర్‌షిప్ సంపాదించుకుంది. ఆ స్కాలర్‌షిప్‌తో ప్రపంచంలో ప్రముఖమైన ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీలో చదువుకోవడానికి వెళ్లింది. అక్కడ వోఫ్‌సన్ కాలేజ్‌లో మాస్టర్ డిగ్రీని పూర్తిచేయడానికి వెళ్లింది. అక్కడ విద్యార్థులు, ప్రొఫెసర్లు అందరూ ఒక హాల్‌లో కూర్చుని డిబెట్‌ను పెట్టుకునేవారు. ఒకరి అభిప్రాయాలను మరొకరితో యధేచ్చగా పంచుకునేవారు. కాని ఆమె ఆలోచనలు ఎప్పుడూ సేవాభావం వైపే ఉండేవి. ఎక్కడ ఏమి చేయగలమా అని నిరంతరం ఆలోచించేది. మన్‌హటన్ ప్రాంతంలో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను నిర్వహించేది. కొంతమంది ఆమె కార్యక్రమాలలో పాలుపంచుకునేవారు కాదు. అయినా నిరుత్సాహపడేది కాదు.

ప్రతిరోజూ ఎంతో ఉత్సాహంగా కార్యక్రమాలు చేసి రూమ్‌కి వచ్చేవారు. ఇన్ని మంచి పనులు చేస్తున్నా రూమ్‌కి రాగానే అమ్మ, ఆమె చిరునవ్వు నా దగ్గర లేవని, వారిని మిస్సయ్యానని బాధపడేది. బాధతో రూమ్ కిటికీ నుంచి బయటకు చూస్తూ అలాగే నిల్చుండిపోయేది. ఆకాశాన్ని, రద్దీగా ఉన్న న్యూయార్క్ రోడ్లను చూస్తూ ఉన్నప్పుడు ఆమెలో ఒక ప్రశ్న మొదలైంది. ఈ హడావిడి జీవితమే తన లక్ష్యమా? ఈ చదువులు అయిపోయాక తానేమి చేయాలన్న ఆలోచన ఆమెలో మొదలైంది. గాంధీజీ కలను ఎవరు సాకారం చేస్తారు. ఆయన ప్రతి కంటిలోని కన్నీటిని తుడిచేలా మన సాయం ఉండాలి అనేవారు. అలా ఆమెలో ప్రశ్న మొదలైంది. విదేశాల్లో స్థిరపడడమే తన కలకాదు. గాంధీజీ కలలను సాకారం చేయడానికి తన వంతు కృషి చేయాలని ఆక్షణమే నిర్ణయించుకుంది. సెలవుల్లో ఆమె ఇంటికి వచ్చినప్పుడు కుటుంబ సభ్యుల కళ్లలో ఎంతో ఆనందాన్ని చూసేది. మా అమ్మాయి బాగా చదువుకుని మా కష్టాలను, బాధలను తీరుస్తాదనే నమ్మకం వారి కళ్లల్లో కనిపించేది. బంధువులు ఆమె దగ్గరకు వచ్చి రేషన్‌కార్డు కోసం అప్లికేషన్ పూర్తిచేయించుకోవడం చేస్తుంటే, మరికొంతమంది కాటారాక్ట్ సర్జరీకి తోడుగా తనను తీసుకెళ్లేవారు. ఆక్స్‌ఫర్డ్‌లో ఉంటే ఇవన్నీ ఆమె చేయలేనని ఆలోచించింది. నేను ఇంటికి తిరిగి రావడంలోనే వీరందరికి సంతోషం ఉందని తెలుసుకుని సివిల్ సర్వీస్ పరీక్షలకు హాజరుకావాలని ప్రిపరేషన్ మొదలుపెట్టింది.

2017సం.లో జరిగిన పరీక్షల్లో ఆమె 217 ర్యాంకును సంపాదించింది. ఆ ర్యాంకు ప్రకారం ఐపిఎస్ సేవలకు అర్హత సంపాదించింది. హిమాచల్‌ప్రదేశ్ కేడర్‌లో ఆమె 16 నెలలు శిక్షణకోసం వెళ్లింది. ''ఈ స్థాయికి రావడానికి అమ్మ, అన్నయ్య చేసిన త్యాగాలు ఎప్పటికీ మరిచిపోలేను. వారి సంతోషం కోసం నా శాయశక్తులా కృషిచేస్తాను'' ఐమా అఫ్రోజ్ చెబుతుంది.

వెనకబడిన వర్గాల పిల్లలకు విద్యాభ్యాసం అందించడానికి కుందర్కిలో ఒక కమ్యూనిటీని ఏర్పాటు చేసింది. ప్రతి విద్యార్థిలోనూ సామర్థ్యం ఉంటుంది. వారికి సరైన దిశలో ప్రోత్సాహాన్ని అందజేస్తే వారు అనుకున్న లక్ష్యాలను సునాయాసంగా చేరుకుని, మంచి స్థాయికి వెళ్లాక వారు దేశ ఉన్నతికి తనవంతు కృషి తప్పకుండా చేస్తారు. ఆదిశగా పిల్లలను తీర్చిదిద్దాలన్నదే ఐమా అఫ్రోజ్ ఆలోచన.

రితూ...ఇప్పుడో బ్రాండ్!

ఆదర్శం

కట్టుబాట్లు, సాంప్రదాయాలు ఎక్కువగా పాటించే కుటుంబానికి చెందినదామె. ఆడవాళ్లు వంటకు పరిమితమనే ఆలోచనలు గల కుటుంబసభ్యుల మధ్య పెరిగింది. అలాంటి పరిస్థితుల్లో కూడా తనకంటూ ఒక గుర్తింపు రావాలనే తపన ఆమెలో ప్రారంభమైంది. దానికోసం నిరంతరం శ్రమించి ఆన్‌లైన్ వ్యాపారంలో లక్షలు సంపాదిస్తుంది. ఆన్‌లైన్ వ్యాపారాలలో నేడు మహిళలు చాలా మంది తమ అనుకున్న రంగాల్లో విజయాలను కైవసం చేసుకుంటున్నారు. ఆ కోవకి చెందినవారే రితు కౌశిక్. ఫ్లిప్ కార్ట్‌వేదిక చేసుకుని ఆమె తన వ్యాపారాన్ని దినాదినాభివృద్ధి చేసుకుంటోంది. అదెలాగో తెలుసుకుందాం.

రితు కౌశిక్ హర్యానాలోని సోనిపట్‌కి దగ్గరలో ఉన్న గ్రామానికి చెందినది. ఆడవాళ్లను ఆరుబయట కూడా కూర్చుని మాట్లాడుకోనివ్వని ప్రాంతానికి చెందినది. ఏ పనిచేయాలన్నా ఇంటి పెద్దవాళ్ల అనుమతి కావాలి. అది లేనిదే అడుగు కూడా బయటకు పెట్టలేని పరిస్థితులు. అలాంటి విషమపరిస్థితులకు భయపడి ఆమె మౌనంగా ఉండి పోలేదు. అలా అని వారి ఆచారాలకు వ్యతిరేకంగా నడవలేదు. ఇంట్లో ఉంటూనే ఆర్థికంగా రాణించాలనుకుంది. దానికోసం ఆలోచించి ఫ్లిప్ కార్ట్‌లో సెల్లర్‌గా తన వ్యాపారాన్ని మొదలుపెట్టింది.

దేశంలో ఒక మూల కూర్చుని కూడా మనకు కావలసిన ఆదాయాన్ని ఒక బటన్ నొక్కి సంపాదించుకోవచ్చునని రితు కౌశిక్ నిరూపించింది. ఈ కామర్స్ పరిశ్రమలో తనదంటూ ఒక ముద్రను వేసింది. భారతదేశంలో 2018సం.లో చాలామంది భారతీయులు తమకు కావలసిన వస్తువులను ఆన్‌లైన్‌లోనే కొనుగోలుచేస్తున్నారు. అమ్మేస్తున్నారు. అందులో ప్రధానమైనవి జెయింట్, ఫ్లిప్ కార్ట్. రీతు ఫ్లిప్‌కార్ట్‌లో విక్రేతగా మారింది. మహిళల అభిరుచిని అనుసరించి వారికి నచ్చే వస్తువులను ఆన్‌లైన్‌లో విక్రయించేది.



ఆమె వయసు 31సంవత్సరాలు. ఆమెకు హ్యాండ్‌బ్యాగులు తయారుచేయడం అంటే చాలా ఇష్టం. 2016సం.లో ఆమె ఈ హ్యాండ్‌బ్యాగులను సొంతంగా డిజైన్ చేయడం మొదలుపెట్టి, మార్కెట్లోకి రితుపల్ కలెక్షన్స్ అనే పేరుతో ఫ్లిప్‌కార్ట్ మార్కెట్‌లో ప్రవేశపెట్టింది. ఆమెకు ఎంతోఇష్టమైన పనినే వ్యాపారంగా మార్చుకుంది. ఎవరైతే రిస్క్ చేస్తారో వారిజీవితం ఆనందంగా ఉంటుందని రితు అంటోంది. పదహారేళ్ల వయసులోనే ఆమెకు వివాహం జరిగింది. భర్త ప్రభుత్వ ఉద్యోగి. ఆమెలోని చదువుమీద ఉన్న శ్రద్ధను గమనించి మంచి చదువులు చదువుకోమని ప్రోత్సహించేవారు. 2016లో ఆమె గ్రాడ్యుయేషన్ పూర్తిచేసింది. ఈరోజు ఈ విధంగా వ్యాపారంలో వృద్ధి సాధిస్తున్నానంటే దానికి నా భర్త సహాయసహకారాలు కారణమని గర్వంగా రితు చెబుతుంది. ఆమె హ్యాండ్‌బ్యాగ్ వ్యాపారాన్ని ఫ్లిప్‌కార్ట్‌లో మొదలుపెట్టింది. తన చుట్టుపక్కల వారందరూ హ్యాండ్‌బ్యాగులను ఆన్‌లైన్‌లోనే కొనుగోలు చేయడం గమనించిన ఆమె తన వస్తువులను కూడా ఆన్‌లైన్ పెట్టడం మొదలుపెట్టింది. ఆమె చేస్తున్న ప్రయత్నాన్ని చూసి ఎంతోమంది నీకు సంపాదించాల్సిన అవసరమేముంది. ఇంట్లో కూర్చుని పిల్లలను చూసుకోవాలని హితవచనాలు చెప్పేవారు.

ఇద్దరు పిల్లల తల్లివి నీకు ఇవన్నీ అవసరమా అని వారనే మాటలకు ఆమెకు చాలా కోపంరావడమే కాకుండా పంతం కూడా పెరిగింది. ఆ పంతంతోనే మరిన్ని డిజైన్లు చేసి ఆన్‌లైన్‌లో పెట్టింది. నా వ్యాపారానికి ఎంతోమంది తమ సహకారాన్ని అందించారు. వారందరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

''నాకు కావలసిన సహాయాన్ని, సహకారాన్ని సరైన సమయంలో ఫ్లిప్‌కార్ట్ అందించింది. ఆ సమయం నుంచి ఎక్కువ వస్తువులు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌మీద ఎలా విక్రయించాలా అనేది ఆలోచించడం మొదలుపెట్టాను. వ్యాపారాభివృద్ధికి ఫ్లిప్‌కార్ట్ నాకు లోను మంజూరు చేస్తానని చెప్పింది. కాని అప్పటివరకు నేను పొదుపు చేసిన మొత్తంతోనే వ్యాపారాన్ని మొదలుపెట్టాను''అని రితు చెప్పింది.

కంప్యూటర్ ఎలా ఆపరేట్ చేయాలో నా భర్త దగ్గర నుంచి నేర్చుకున్నాను. పిల్లలు స్కూల్‌కి వెళ్లిపోయాక ఆయన చెప్పిన విధానాలను మళ్లీమళ్లీ ప్రయత్నించేదాన్ని. అలా మొదలైన ఆ వ్యాపారం రోజురోజుకీ అభివృద్ధిపథంలో సాగుతోంది.

వ్యాపారం ప్రారంభించిన మొదటి సంవత్సరంలో ఆమె సంపాదించినది నెలకు లక్షరూపాయలే. ఈమొత్తం సరిపోదని మిగతా షాపులతో కూడా మాట్లాడి అక్కడ కూడా తన కలెక్షన్స్ అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకుంది. తన వస్తువుల గురించి వారికి వివరించి వాటి నాణ్యత గురించి చెప్పి వాటిని న్యూ బ్రాండ్‌లో అవతార్ పేరుతో సేల్ చేసేది. ఇప్పటికి ఆమె ఈ వ్యాపారం మొదలుపెట్టి మూడు సంవత్సరాలు అవుతుంది. ఆమె తయారు చేస్తున్న హ్యాండ్‌బ్యాగులు ఆమె ఆదాయాన్ని సంవత్సరం సంవత్సరానికి పెంచుతుంది. ప్రస్తుతం ఆమె 7 లక్షల నుంచి 8 లక్షల వరకు నెలకు సంపాదిస్తుంది.

రితుపల్ కలెక్షన్స్ బ్యాగుల రేటు రూ200/-ల నుంచి రూ.1500/-ల వరకు ఉంటుంది. దక్షిణాది మహిళలకు ఎటువంటి మోడల్, కలర్స్ ఇష్టమో ఆవిధంగా ఆమె తయారుచేస్తుంది. తన వ్యాపారాన్ని తూర్పు, పశ్చిమ ప్రాంతాలలో కూడా పెంచాలనే ఆలోచనలో ఉంది.

''నాలాంటి వారికి నా ఆదాయం చాలా ప్రోత్సాహకరంగా ఉంటుంది. కాని నెలకు రూ.20లక్షలు అమ్మకాలు చేయాలన్నదే నేను లక్ష్యంగా పెట్టుకున్నాను. ఒంటరిగా చేసిన ప్రయత్నం ఇప్పుడు రితుపల్ కలెక్షన్ పేరుతో మంచి బ్రాండ్‌గా మార్కెట్లో అందరి నోళ్లలో వినబడుతుంది. నా పేరు చదవగానే నేను గుర్తు వచ్చేటట్లు ఉండాలన్నదే నా ఆశ'' అని అంటోంది రితు కౌశిక్.

వన్డే క్రికెట్‌లో 'స్మృతి' పథం

స్ఫూర్తి

చిన్నతనంలో నాన్నతో పాటు అన్నయ్య క్రికెట్ ఆట చూడడానికి సరదాగా వెళ్లింది. అక్కడ వారు ఆడే ఆటను చూసాక అప్పటి వరకు క్రికెట్ అంటే ఏమిటో తెలియని ఆ చిన్న మనసులో తాను కూడా క్రికెట్ ఆడి మంచి పేరు తెచ్చుకోవాలనే పంతం పెరిగింది. ఆ పంతంతో అన్నయ్యతో పాటు క్రికెట్ ఆడడం మొదలుపెట్టింది. ఆవిధంగా మొదలైన ఆమె క్రికెట్ జీవితం కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ఈరోజు వన్డే టాప్‌ర్యాంకర్‌లో మొదటిస్థానాన్ని దక్కించుకుంది. ఆమే స్మృతి మంధానా.

ఆమె పూర్తి పేరు స్మృతి శ్రీనివాస్ మంధానా. జులై 18, 1996లో మహారాష్ట్రలోని ముంబయి నగరంలో జన్మించింది. ఆమె భారతీయ మహిళా క్రికెట్ టీమ్‌లో ఒక క్రీడాకారిణి. ఎడమచేతి బ్యాట్స్‌ఉమెన్. బౌలింగ్‌ని కుడిచేత్తో మీడియం పేస్‌లో వేస్తుంది. ఎక్కువగా బ్యాట్స్‌ఉమెన్‌గా రంగంలోకి దిగుతుంది. భారత టీమ్‌లో చేరిన తక్కువ సమయంలోనే తన ఆటనైపుణ్యంతో వన్డే మ్యాచ్‌లలో మొదటి ర్యాంక్‌ను కైవసం చేసుకుంది. మిథాలీరాజ్ 5వ ర్యాంక్‌లో ఉంది. ఆమె ఆటతీరును పరిశీలించిన క్రికెట్‌బోర్డు అంతర్జాతీయ మహిళా క్రికెట్ క్రీడాకారిణులలో 'స్మృతి ఈజ్ ది బెస్ట్' అని భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు ప్రకటించింది. 2018 సంవత్సరానికి ఉత్తమ క్రికెట్ క్రీడాకారిణిగా గుర్తించిన అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ డిసెంబర్‌లో 'రాచియెల్ హెయోహోయ్ ఫ్లింట్' అవార్డును అందజేసింది. క్రికెట్‌లోకి ప్రవేశించిన తక్కువ సమయంలోనే వన్డే క్రికెట్ మ్యాచ్‌లలో మొదటిర్యాంకు సాధించడం సాధారణవిషయం కాదు.



బాల్యం

ఆమె తల్లిదండ్రులు స్మిత, శ్రీనివాసన్ మంధానా. ఆమెకు రెండు సంవత్సరాల వయస్సున్నప్పుడే అనివార్య కారణాల వల్ల ముంబయి నుండి మహారాష్ట్రలోని సంగ్లీలోని మాధవనగర్‌కి వెళ్లిపోయారు. అక్కడే ఆమె స్కూల్ విద్యాభ్యాసాన్ని పూర్తిచేసింది. తండ్రి, అన్నయ్య ఇద్దరూ మంచి క్రికెట్ ప్లేయర్స్. అన్నయ్య శ్రవణ్ జాతీయ స్థాయి క్రికెట్ పోటీలలో ఆడేవాడు. ఒకరోజు తన తండ్రితో మహారాష్ట్రలో జరిగిన అండర్ 16 టోర్నమెంట్స్‌లో అన్నయ్య ఆటను చూడడానికి వెళ్లింది. అక్కడ శ్రవణ్ ఆడిన తీరును చూసి ఆమెకు కూడా క్రికెట్ మీద ఆసక్తి పెరిగింది. అప్పటికి ఆమె వయసు తొమ్మిదిసంవత్సరాలు. ఆమె ఆసక్తిని చూసి తండ్రి, అన్నయ్య ప్రోత్సహించడంతో వారితో ఆడి ఆటను నేర్చుకుంది. ఆ వయసులోనే మహారాష్ట్ర అండర్-15 టీమ్‌కి కూడా ఎంపికైంది. పదకొండు సంవత్సరాల వయసులో ఆమె మహారాష్ట్ర అండర్-19 టీమ్‌లో స్థానం సంపాదించింది. ఆమెలోని ఆసక్తిని గమనించిన కుటుంబ సభ్యులు తమ పూర్తి సహాయసహకారాలను అందించేవారు. తండ్రి శ్రీనివాస్ కెమికల్ డిస్ట్రిబ్యూటర్‌గా పనిచేస్తున్నారు. తన ఉద్యోగబాధ్యతలు నిర్వహిస్తూనే స్మృతి క్రికెట్ ప్రోగ్రామ్స్ గురించి ఎప్పటికప్పుడు శ్రద్ధ తీసుకుని ప్రోత్సహించేవారు. కూతురు గ్రౌండ్‌లో బాగా ఆడాలంటే కావలసిన పోషకాహారం గురించే కాకుండా దుస్తులు వంటి విషయాలన్నింటి మీద శ్రద్ధ తీసుకునేవారు తల్లి స్మిత. అన్నయ్య శ్రవణ్ ఆమెను తనతో పాటు ప్రాక్టీసుకి తీసుకెళ్లి బాల్ వేయడం ఎలాగో నెట్‌లోకి తీసుకెళ్లి చూపించేవాడు.

క్రీడారంగంలో ప్రతిభ

2013 సం.అక్టోబరులో మొట్టమొదటి సారిగా వన్డే గేమ్‌లో రెండు వందల పరుగులు సాధించిన మహిళగా రికార్డు సృష్టించడంతో ఆమె ప్రతిభ వెలుగులోకి వచ్చింది. మహారాష్ట్ర గుజరాత్‌లకి మధ్య జరిగిన వన్డే మ్యాచ్‌లలో ఆమె ఈ రికార్డును సృష్టించింది. ఆ మ్యాచ్‌లో ఆమె 150 బాల్స్‌కు 224 పరుగులు సాధించింది. ఈ రికార్డును వడోదరలోని అలెంబిక్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన వెస్ట్‌జోన్ అండర్-19 టోర్నమెంట్‌లో సాధించింది. 2016లో ఉమెన్స్ ఛాలెంజర్ ట్రోఫీలో ఆమె మూడు ఆఫ్ సెంచరీలను చేసింది. ప్రతి మ్యాచ్‌లోనూ అత్యధిక స్కోరులతో టీమ్ విజయం సాధించడానికి కృషిచేసేది. ఒక మ్యాచ్‌లో 82 బాల్స్‌లో 62 పరుగులు చేయాల్సి ఉంటే ఆమె అతి సులువుగా పరుగులు చేసి విజయం సాధించింది. ఆ టోర్నమెంట్‌లో ఆమెదే టాప్ స్కోర్.

సెప్టెంబర్ 2016సం.లో బ్రిస్‌బేన్ హీట్ ఉమెన్స్ బిగ్ బాష్ లీగ్‌తో ఒక సంవత్సరం కాంట్రాక్టును ఆమె చేసుకుంది. తనతో పాటు హర్‌మన్‌ప్రీత్ కౌర్‌ను కూడా తీసుకెళ్లింది. భారతజట్టులోని ఇద్దరు మంచి క్రీడాకారిణులు ఈ లీగ్‌కోసం సంతకాలు పెట్టారు.

జనవరి 2017సం.లో ఆమె మైదానంలో ఆడుతుండగా బాల్‌ను పట్టుకునే సందర్భంలో కిందపడిపోయి మోకాలికి బాగా గాయమైంది. అప్పటి వరకు జరిగిన 12 ఇన్నింగ్స్‌లో ఆమె 89 పరుగులు సాధించింది. ఈ గాయం వల్ల ఆ మ్యాచ్‌ను ఆపివేయాల్సి వచ్చింది. 2018సం.లో ఆమె కియా సూపర్ లీగ్‌లో ఆడడానికి సంతకం చేసింది. లీగ్‌మ్యాచ్‌లో ఆడిన మొట్టమొదటి భారతీయ క్రీడాకారిణిగా ఆమె పేరు మళ్లీ మారుమ్రోగింది.



అంతర్జాతీయంగా...

మంధానా తన మొదటి అంతర్జాతీయ పోటీని ఆగస్టు 2014సం.లో వోమ్స్‌లే పార్క్‌లో ఇంగ్లాండ్‌తో ఆడింది. ఆమె తన ఆటతీరుతో టీమ్ గెలిచేలా స్కోరును చేసింది. మొదటి, రెండవ ఇన్నింగ్స్‌లో 22, 51 స్కోరులను చేసి ఇండియాను గెలిపించింది. ఇంకో ఇన్నింగ్స్‌లో ఆమె మొదటి వికెట్ పార్టనర్‌షిప్‌గా వచ్చి 76 పరుగులను తిరుష్ కామినితో కలిసి మొత్తం 182 పరుగులు సాధించారు.

2016సం.లో రెండవ వన్డేమ్యాచ్ ఆస్ట్రేలియాలో బెల్లెరైవ్ ఓవల్ ఇన్ ఓబర్ట్‌లో జరిగింది. అందులో ఆమె అంతర్జాతీయ స్థాయిలో వంద పరుగులను (109 బంతులలో 102 పరుగులను) సాధించింది. భారత క్రీడాకారిణులలో ఐసిసి ఉమెన్స్ టీమ్ ఆఫ్ ది ఇయర్ 2016గా ఎంపికైంది కేవలం మంధానా మాత్రమే. ఆమె కాలికి అయిన గాయం తగ్గిన తరువాత 2017 వరల్డ్ కప్‌లో ఆడడం మొదలుపెట్టింది. ఇంగ్లాండ్‌లో జరిగిన వరల్డ్‌కప్ మ్యాచ్‌లో ఆమె పాల్గొని టీమ్‌ని 35 పరుగుల తేడాతో గెలిపించింది. ఆ పోటీలో ఆమె పేరు మరోసారి మారుమ్రోగిపోయింది. ఆమె రెండవ సెంచరీని వెస్ట్ ఇండీస్‌తో ఆడిన మ్యాచ్‌లో చేసింది. భారతదేశ టీమ్ 2017 ఉమెన్స్ క్రికెట్ వరల్డ్ కప్‌లో స్థానం సంపాదించుకోవడానికి ఇంగ్లాండ్‌ను తొమ్మిది పరుగులతో ఓడించింది. అందులో ఆమె పాత్ర చాలా ఉంది. 2018సం.లో ఆమె మహిళల ట్వంటీ ఇంటర్నేషనల్ పోటీలో ముప్పై బంతుల్లో ఆఫ్ సెంచరీ చేసి రికార్డు సృష్టించింది. ఇదే కాకుండా మిగతా వన్డే మ్యాచ్‌లలో కూడా ఆమె మంచి ఆటతీరును ప్రదర్శించి అందరి ప్రశంసలను అందుకుంది. ఆగస్టు3, 2018లో ఆమె తన మొట్టమొదటి సెంచరీని 2018ఉమెన్స్ క్రికెట్ సూపర్‌లీగ్‌లో చేసింది. అక్టోబర్ 2018సం.లో వెస్ట్ ఇండీస్‌లో జరిగే ఉమెన్స్ వరల్డ్ ట్వంటీ ట్వంటీ టోర్నమెంట్‌కు కూడా ఆమెను ఎంపిక చేశారు. ఆ టోర్నమెంట్‌లో ఆమె టీ ట్వంటీ మ్యాచ్‌లలో వెయ్యి పరుగులు సాధించిన మూడవ మహిళగా రికార్డు సంపాదించింది. ఆమెను ఐసిసి ఉమెన్స్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్, ఐసిసి ఉమెన్స్ ఓడిఐప్లేయర్ ఆఫ్ ది ఇయర్‌గా నిర్ణయించారు. క్రీడారంగంలోకి ప్రవేశించిన తక్కువసమయంలోనే తన ఆటనైపుణ్యంతో ఉన్నతస్థాయికి ఎదిగిన స్మృతి మంధానా మిగతా క్రీడాకారిణులకు ఎంతో స్ఫూర్తిదాయకం.


వెంకటేష్
నాగచైతన్య

కోనసీమలో కోలాహలం

వెంకటేష్, నాగచైతన్య కలిసి నటించబోయే వెంకీమామ చిత్రంపై పరిశ్రమలోను...ప్రేక్షకలోకంలోను విపరీతమైన ఆసక్తి నెలకొంది. నిజజీవితంలో మామాఅల్లుళ్లు అయిన వీరిద్దరూ తొలిసారిగా వెండితెరను ఒకే సినిమా ద్వారా పంచుకోనుండటమే ఆ ఆసక్తికి కారణం. మరోవైపు ఈ చిత్రం ఎలాంటి నేపథ్యంతో ఉంటుందన్న అంశంపై కూడా ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి. మొదట్నుంచి పల్లెటూరి నేపథ్య ఇతివృత్తంతో ఈ చిత్రం ఉంటుందని వినిపిస్తుండగా...తాజాగా అలాంటి అంశాన్ని ఉటంకిస్తూ...కోనసీమ నేపథ్యంలో సాగే కథాంశంతో సాగే చిత్రమిదని అంటున్నారు. ఈ నెల 22న రాజమండ్రి పరిసరాల్లో చిత్రీకరణను మొదలుపెట్టనున్నట్లు తెలిసింది. వెంకటేష్, నాగచైతన్య పాత్రల చిత్రణ చాలా సరదాగా ఉంటుందట. ఇటీవల సంక్రాంతికి విడుదలై..ఘన విజయం సాధించిన వెంకటేష్, వరుణ్‌తేజ్‌ల చిత్రం ఎఫ్-2 కూడా వినోదానికి పెద్దపీట వేసింది కావడం గమనార్హం. సర్దార్ గబ్బర్‌సింగ్, జై లవకుశ చిత్రాల దర్శకుడు కె.ఎస్.రవీంద్ర (బాబి) దర్శకత్వంలో రూపొందే ఈ చిత్రంలో వెంకటేష్ సరసన శ్రియ, నాగచైతన్య సరసన రకుల్‌ప్రీత్‌సింగ్ నటించనున్నట్లు సమాచారం. సురేష్ ప్రొడక్షన్స్, కోన ఫిలిం కార్పొరేషన్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థలు ఈ చిత్రాన్ని నిర్మించనున్నాయి.

ఆ మూడింటితో కీర్తి రెపరెపలు


కీర్తిసురేష్

అందానికి అందం...అభినయానికి అభినయం...విజయాలకు విజయాలు...ఈ మూడు ప్లస్ పాయింట్‌లు ఏ నటికైనా ఉంటే వారి కెరీర్ ఎంతగా ప్రకాశిస్తుందో ఊహించవచ్చు. కీర్తిసురేష్ పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా ఏమీలేదు. తెలుగు, తమిళ, మలయాళ భాషల చిత్రాలు చేస్తూ పేరుకు తగ్గట్టుగా తన కీర్తిని మరింతగా పెంచుకుంటోంది. నేను లోకల్, మహానటి చిత్రాల విజయంతో టాలీవుడ్‌లో ఆమె పేరు మారుమోగుతోంది. మరోవైపు గతేడాది తమిళంలో విజయ్ సరసన, విశాల్ సరసన ఆమె నటించిన సర్కార్, పందెంకోడి-2 చిత్రాలు తెలుగులో కూడా విడుదలై...రెండు భాషలలోనూ ప్రేక్షకాదరణ చూరగొన్నాయి. దాంతో కీర్తికి మరింత డిమాండ్ పెరిగింది. మొదట్నుంచి వచ్చిన ప్రతీ అవకాశాన్ని ఒప్పుకోకుండా ఆచితూచి సినిమాలను చేస్తున్న ఆమె తెలుగులో మహానటి తర్వాత ఇప్పుడు ఓ లేడీ ఓరియెంటెడ్ చిత్రాన్ని అంగీకరించిన సంగతి తెలిసిందే.ఆమె ప్రధాన పాత్రలో నరేంద్రనాథ్ దర్శకత్వంలో మహేష్ కోనేరు నిర్మించే ఈ చిత్రం సమకాలీన పరిస్థితులకు అద్దంపట్టే ఫ్యామిలీడ్రామా కథాంశంతో ఉంటుందని అంటున్నారు. ఈ నెల 10న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్‌ను మొదలుపెడతారని వినిపిస్తోంది. కేరళ నేపథ్యంలో సాగే ఇతివృత్తమని, అందుకే అధికశాతం చిత్రీకరణను అక్కడ జరుపుతారని చెబుతున్నారు. తెలుగుతో పాటు కీర్తికి తమిళంలో ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని..తమిళనాట కూడా ఈ చిత్రాన్ని విడుదల చేస్తారట. ఇదిలావుండగా...నాని కథానాయకుడిగా విక్రమ్‌కుమార్ దర్శకత్వంలో మైత్రీ మూవీస్ సంస్థ ఓ చిత్రాన్ని నిర్మించనుంది. ఇందులో ఐదుగురు కథానాయికలు ఉంటారని, వారిలో ముగ్గురి ఎంపిక దాదాపుగా ఖరారైందన్న మాటలు వినిపిస్తున్నాయి. కీర్తిసురేష్‌తో పాటు మేఘాఆకాష్, ప్రియావారియర్‌లను ఎంపిక చేసినట్లుగా ప్రచారం జరుగుతోంది. ఇంకోవైపు మలయాళంలో మోహన్‌లాల్, సునీల్‌శెట్టి, అర్జున్, ప్రభుదేవా నటిస్తున్న ఓ ప్రతిష్టాత్మక చిత్రంలో కూడా కీర్తి సందడి చేయబోతోంది. దాదాపు వంద కోట్ల బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. మొత్తంమీద మూడు భాషల సినీరంగాల్లో కీర్తి హవా కొనసాగుతోంది.

అంచనాలు అందుకోలేకపోయాం

సంక్రాంతికి విడుదలైన భారీ చిత్రాల్లో 'వినయ విధేయ రామ' ఒకటి. రామ్‌చరణ్, బోయపాటి శ్రీను తొలి కాంబినేషన్‌లో తెరకెక్కిన ఈ చిత్రానికి ఆశించిన విజయం దక్కలేదు. కమర్షియల్‌గా నిరాశపరిచింది. సినిమాలోని కొన్ని సన్నివేశాలపై ప్రేక్షకులు అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇంత ప్రతికూలత మధ్య 95 కోట్ల వ్యాపారం జరిగిన ఈ సినిమాకు సుమారు 60 కోట్లు వసులుకావడం విశేషం. 'వినయ విధేయ రామ' సినిమా విడుదలైన ఇరవై రోజుల తర్వాత చిత్ర కథానాయకుడు రామ్ చరణ్ స్పందించారు. పరాజయాన్ని అంగీకరించారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ''మా వినయ విధేయ రామ సినిమా కోసం రేయింబవళ్ళు కష్టించిన సాంకేతిక నిపుణులు అందరికీ నా ధన్యవాదాలు. నిర్మాత దానయ్యగారు అందించిన సహకారం మాటల్లో వర్ణించలేనిది. మా చిత్రాన్ని నమ్మి పంపిణీదారుల మరియు ప్రదర్శనదారులకి కృతజ్ఞుడనై ఉంటాను. మీ అందరికీ నచ్చి, మిమ్మల్ని వినోదింపజేసే సినిమా అందించేందుకు మేమంతా ఎంతగానో శ్రమించాం. దురదృష్టవశాత్తు మేము అనుకున్న విధంగా ఒక మంచి సినిమాని అందించలేక మీ అంచనాలని అందుకోలేకపోయాం. మీరు చూపించే ఈ ఆదరణ, అభిమానాన్ని ప్రేరణగా తీసుకుని భవిష్యత్తులో మీకునచ్చే, మీరు మెచ్చే సినిమా చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తాం'' అని రామ్ చరణ్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

ఒక స్టార్ హీరో తన సినిమా అంచనాలు అందుకోలేకపోయింది అంటూ బహిరంగంగా అంగీకరంచడం చాలా అరుదు. ఈ విషయంలో రామ్ చరణ్ స్పందించడం చాలా మందిని ఆశ్చర్యం కలిగించింది.


రామ్ చరణ్

సైరాలో అనుష్క...!

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'సై రా' గురించి తరచుగా ఆసక్తికర అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికే ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్, నయనతార, విజయ్ సేతుపతి వంటి తారలు నటిస్తున్నారు. తాజాగా ఈ జాబితాలో అనుష్క కూడా చేరిందనే మాట వినిపిస్తోంది. చిరంజీవి, అనుష్క గతంలో 'స్టాలిన్' అనే సినిమాలో ఓ పాటలో నటించారు. మధ్యలో చిరంజీవి సినిమాకు దూరంగా ఉండడం వల్ల ఈ కాంబినేషన్ రిపీట్ కాలేదు. తాజాగా సైరాలో అనుష్కను ముఖ్యపాత్రకి ఎంపికచేసినట్టు తెలిసింది. బాహుబలి, అరుంధతి, భాగమతి సినిమాలో హీరోయిన్లల్లో అగ్రస్థానంలో ఉన్న అనుష్క 'సైరా'లో నటిస్తుండడం ఆసక్తి కలిగించే విషయం. 'సైరా' చిత్రానికి సురేందర్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. రామ్ చరణ్ నిర్మాణబాధ్యతలు వహిస్తున్నారు. 'సైరా' సినిమా కోసం చిత్రయూనిట్ పాండిచ్చేరిలో ఉంది. అక్కడ కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. విడుదల తేదీని వెల్లడించనప్పటికీ, విజయదశమికి ఈ సినిమాను విడుదల చేయబోతున్నారు.


అనుష్క


నయనతార

బిలాల్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో...

మాగంటి శ్రీనాథ్, సాన్వీ మేఘనా జంటగా గోరేటి వెంకన్న కీలక పాత్రలో నటిస్తున్న చిత్రం 'బిలాల్ పూర్ పోలీస్ స్టేషన్'. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. మార్చిలో ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. చిత్ర నిర్మాత మహంకాళి శ్రీనివాస్ మాట్లాడుతూ ''పెద్ద నిర్మాణ సంస్థలకు తీసిపోకుండా మా చిత్రాన్ని నిర్మించాం. వినోదాత్మక కథనం ఉంటూనే ఆలోచింపజేసే సినిమా అవుతుంది. నేడు సమాజంలో ఎదుర్కొంటున్న ఒక సమస్యను ఇందులో చూపించాం. మార్చి రెండవ వారంలో సినిమాను విడుదల చేస్తాం'' అని చెప్పారు.

దర్శకుడు నాగసాయి మాకం మాట్లాడుతూ ''ఎలాంటి అసభ్యతకు తావులేని విధంగా ఉంటుంది. బిలాల్‌పూర్ అనే వూరిలో పోలీస్ స్టేషన్‌కు వచ్చే వింత వింత కేసులు కడుపుబ్బా నవ్విస్తాయి. సినిమా అద్యంతం సహజమైన పాత్రలతో, సన్నివేశాలతో సాగుతుంది'' అని అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సాబూ వర్గీస్, ఛాయాగ్రహణం: తోట వి. రమణ.


శ్రీనాథ్, సాన్వీ

నయనతార క్రైమ్ థ్రిల్లర్

లేడీ సూపర్‌స్టార్ నయనతార నటించిన తాజా చిత్రం 'ఇమైక్క నోడిగల్'. ఈ చిత్రాన్ని తెలుగులో 'అంజలి సిబిఐ' పేరుతో అనువదిస్తున్నారు. ఆర్. అజయ్ జ్ఞానముత్తు ఈ క్రైమ్ థ్రిల్లర్ తెరకెక్కించారు. టైటిల్ పాత్రలో నయనతార నటించింది. అధర్వ, రాశిఖన్నా ఇతర ముఖ్య పాత్రధారులు. బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ ప్రతినాయకునిగా నటించారు. తెలుగులో విశ్వశాంతి క్రియేషన్స్ హక్కులను పొందించింది. సి.హెచ్.రాంబాబు, ఆచంట గోపీనాథ్ అనువదిస్తున్నారు. ఫిబ్రవరి 22న ఈ సినిమాను విడుదల చేస్తారు.

ఈ చిత్రానికి సంగీతం: హిప్ హాప్ తమిళన్, ఛాయాగ్రహణం: ఆర్.డి.రాజశేఖర్.

4 లెటర్స్‌కు వెంకటేష్ అభినందన


వెంకటేష్, ఈశ్వర్

'4 లెటర్స్' చిత్రం ట్రైలర్ వీక్షించిన విక్టరీ వెంకటేష్ చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. సినిమా మంచి విజయం సాధించాలని ఆకాంక్షించారు.

ఈశ్వర్, టువ చక్రవర్తి, అంకిత మహారాణా హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం '4 లెటర్స్'. కుర్రాళ్ళకి అర్థమవుతుందిలే అనేది ఉప శీర్షిక. ఆర్. రఘురాజ్ దర్శకత్వంలో దొమ్మరాజు హేమలత, దొమ్మరాజు ఉదయ్‌కుమార్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఏ సర్టిఫికెట్ లభించింది. ఫిబ్రవరి 22న సినిమాను విడుదల చేయనున్నట్టు నిర్మాతలు తెలిపారు. ''మా సంస్థ నిర్మిస్తున్న తొలి సినిమా ఇది. టీజర్‌ను ప్రముఖ దర్శకులు కె.రాఘవేంద్రరావుగారు విడుదల చేశారు. హీరోగా పరిచయం అవుతున్న ఈశ్వర్ నటనలో శిక్షణ తీసుకున్నారు. కమర్షియల్ హంగులతో అన్ని వర్గాలను ఆకట్టుకునే విధంగా రూపొందించడం జరిగింది'' అని వారు చెప్పారు.

హీరో ఈశ్వర్ మాట్లాడుతూ ''విక్టరీ వెంకటేష్ గారి ఆశీస్సులు అందుకోవడం ఆనందంగా ఉంది'' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ ''కలుసుకోవాలని తర్వాత తెలుగులో నేను దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. ఇది నేటితరం ప్రేమకథా చిత్రం. అందుకే కుర్రాళ్ళకి అర్థమవుతుందిలే అని ఉప శీర్షిక చేర్చడం జరిగింది. ప్రేమ, పెళ్లి విషయాల్లో నేటితరం ఆలోచనా విధానాన్ని ఇందులో చూపిస్తున్నాం. హైదరాబాద్‌లో టాకీ, బ్యాంకాక్‌లో పాటలనుచిత్రీక రించాం'' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఛాయాగ్రహణం: చిట్టిబాబు.

పోలీస్ ఉన్మాది

రక్షణ కల్పించాల్సిన పోలీసు ఉన్మాదిగా ఎందుకు మారాడు? అలా మారడానికి దారి తీసిన పరిస్థితులేమిటీ? అనే కథాంశంతో రూపొందుతున్న చిత్రం 'ఉన్మాది'. ఎన్.ఆర్. రెడ్డి దర్శకత్వంలో ఎన్. కరణ్ రెడ్డి సమర్పణలో ఈ సినిమా తెరకెక్కింది. నిర్మాత ఎన్.ఆర్. రెడ్డి మాట్లాడుతూ ''గ్రామీణ నేపథ్యంలో జరిగే కథ. కమర్షియల్ అంశాలు జోడిస్తూ, వినోదాత్మకంగా నిర్మించాం. డేవిడ్ సంగీతం అందించిన పాటలు, ట్రైలర్స్ ఇటీవలే విడుదలచేశాం. మిగతా కార్యక్రమాలు పూర్తిచేసి ఈ నెల 8న సినిమాను విడుదల చేస్తున్నాం'' అని చెప్పారు. టైటిల్ పాత్రలో ఎన్.ఆర్.రెడ్డి నటిస్తూ, దర్శకత్వం వహించారు. అల్లు రమేష్, శిరీష్, నాగిరెడ్డి, రమ్య, ప్రమీల, పుష్పలత, సోను తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: డేవిడ్, ఛాయాగ్రహణం: దంటు వెంకట్, కథ, మాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: ఎన్.ఆర్.రెడ్డి.


రమ్య